


ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
4 అణాలు
13-3-57
ANDHRA PATRIKA
LUSTRATED WEEKLY

చూడండి! సన్‌లైట్
సగంబిళ్ల మాత్రమే ఈ బట్టలన్నిటిని ఉతికింది!



అట్లు చేసినట్టిది దాని అధికమైన నురగ



ఎంతో బాగుగా పనిచేయునట్టిది సన్‌లైట్ యొక్క అధికమైన నురగ, మీరు ఆశ్చర్యపడెదరు, సగం బిళ్లతోనే మీరు ఎన్ని బట్టలను ఉతికారో!

ప్రతి మురికి అణువును తొలగించివేయునట్టిదిన్ని — మీ బట్టలను అద్భుతమైన తెలుపుగాను, కాంతివంతముగాను చేయునట్టిదిన్ని, సన్‌లైట్ యొక్క అధికమైన నురగ!

మీరు బట్టలను బాదకుండానే శుభ్రపర్చునట్టిది సన్‌లైట్ యొక్క అధికమైన నురగ, అనగా మీ బట్టలు చాలా కాలము మన్నగలవు.

భారతదేశంలో
తయారుచేయబడినది

సన్‌లైట్ సబ్బు బట్టలను తెల్లగాను కాంతివంతముగాను, ఉతుకును

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 28
13-3-57

దుర్ముఖ ఫాల్గుణ శుద్ధ ద్వాదశి బుధవారం

Statement about ownership and other particulars about

THE ANDHRA PATRIKA

Illustrated Weekly

FORM VI

(See Rule 8)

The Registration of Newspapers (Central) Rules, 1956.

1. Place of Publication :
   6 & 7, Thambu Chetty St., Madras-1.
2. Periodicity of its publication :
   Every Wednesday
3. Printer's Name:
   Sri S. Radhakrishna.
   Nationality: Indian
   Address: 6 & 7, Thambu Chetty Street, Madras-1.
4. Publisher's Name:
   Sri S. Radhakrishna.
   Nationality: Indian
   Address: (As above)
5. Editor's Name:
   Sri S. Sambhu Prasad.
   Nationality: Indian.
   Address: "Deviprabha" 6th Main Road, Raja Annamalaipuram, Adyar, Madras.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.

NAME	ADDRESSES
1. Mrs. K. Ramayamma	"Deviprabha", 6th Main Road, Raja Annamalai puram, Adyar, Madras.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Sambhu Prasad	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street, Madras-1.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA.

★

ముఖచిత్రం : హిందీ నటి షకీలా.

★

మంత్రాలు: నమ్మకాలు

పరిశోధన అవసరం

మంత్రశక్తి నిజానిజాలనుగూర్చి తర్జనభర్జనలు జరుగుతున్నవి. ఏవిషయాన్నైనా విమర్శనాదృష్టితో పరిశీలించి అర్థం చేసుకున్నందువల్ల శుభమే చేకూరుతుంది. మంత్రాలను మంత్రాల మహిమను గూర్చి అనేక అభిప్రాయాలు మనదేశంలో ఎన్నో సంవత్సరాలనుంచీ ప్రజలలో వేళ్లునాటుకుని పోయినవి. కొందరు మంత్రశక్తి మహత్తరమైనదని వాదిస్తే, మరికొందరు దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. అయితే, ఈ రెండు పక్షాల వాదనలను బలపరిచే ఉదాహరణలు అనేకం కనబడుతున్నవి. అందువల్ల ఏ పక్షవాదనైనా, శాస్త్ర సమ్మతమనదగిన నిరూపణలేనిదే అంగీకరించడం దుస్సాధ్యము. అయితే శాస్త్రానికి మంత్రానికీ, సంబంధమేమిటని కొందరు వాదించవచ్చు. దీనికి జవాబిది శాస్త్రం ఈ సృష్టిలోని పదార్థముల ధర్మాలను గురించి చెబుతుంది. ఆధునిక కాలంలో శాస్త్రంద్వారా అండపిండ బ్రహ్మాండాలకు సంబంధించిన అనేక విషయాలనుమానవుడుఅర్థం చేసుకుంటున్నాడు అంటేసృష్టిలో బహుచిన్నవైన అణువుల నుంచి బహుపెద్దవైనగోళాలవరకు అనేకవిషయాలు మానవుడు తెలుసుకోగలుగుతున్నాడు. సృష్టిలో జరిగే ప్రతి సంఘటనకు శాస్త్రీయ వివరణం ఒకట వుండి తీరుతుంది. అందువల్ల ఈ లోకంలో జరిగే ఏమార్పైనా శాస్త్రాన్ని ఉల్లంఘించ జాలదు. మంత్రశక్తి నిజంగా ఉన్నట్లైతే, అదిసాధించే మార్పులకు కూడా శాస్త్రీయమైనవివరణ వుండితీరాలి ఇప్పటి ప్రశ్న మంత్రశక్తి నిజానిజాలను నిరూపించే మార్గమేమిటి? మంత్రానికి శక్తి ఉన్నట్లయితే దానికి శాస్త్రీయ వివరణమేమిటి? వీటికి సమాధానాలు చెప్పడం అంత సులభమైన పని కాదు. ప్రస్తుత పరిస్థితులలో మొదటి ప్రశ్నకు సమాధానం రాజాలదు అందువల్ల మంత్రానికిశక్తి ఉన్నదని ముందు ఊహించి, తర్వాత దానికి శాస్త్రీయ సమన్వయం చెప్పడం ద్వారా ఆ మంత్రశక్తిని రుజువు చేయవలసి వుంటుందని తోస్తుంది.

ఈమధ్య ఆంధ్ర సచిత్ర వారపత్రికలో మంత్రశక్తికి శ్రీ "తుకారాం" (గుడివాడ) ఒక విధమైన శాస్త్రీయ వివరణ ఇవ్వడానికి ప్రయత్నించారు. కాని దానిని సందిగ్ధముగా శాస్త్ర వ్యతిరేకమైన ఊహాలతో జతపరచి వదిలిపెట్టారు. మంత్రోచ్చారణవల్ల "బీజాక్షర విద్యుత్తరంగాలు" ఎలాఉద్భవిస్తాయో దురూహ్యము. దీనిని నమ్మటకు శాస్త్ర రీత్యా వీలు లేదు.

మంత్రశక్తికి కారణము శబ్దతరంగములు. దీనినిరూపమును ఇక్కడ పరిశీలిద్దాము.

మనం మాట్లాడేటప్పుడు, మన గొంతు నోటిలోని ప్రదేశములు అనేక విధములైన కదలికలచేత వాయువు బహుళమార్గాల ద్వారా ఛాతినుంచి బయటికి పంపబడి, శబ్దం కలుగుచున్నది. ఈ శబ్ద ప్రసారానికి ఒక వాహన మవసరం. వాయు, ద్రవ, ఘన పదార్థాలు ఇందుకు పనికి వస్తాయి. ఈ పదార్థాలలోని అణువుల కదలికచే శబ్దము వ్యాపిస్తుంది. శబ్దం తరంగమార్గమున ప్రయాణం చేస్తుంది. శబ్దం పుట్టినచోట ఈ తరంగాల "శక్తిసాంద్రత" ఎక్కువగా వుండి దూరంపోయిన కొద్దీ తగ్గిపోతుంటుంది. అందువల్లనే దూరానికి శబ్దం బహునెమ్మదిగా వినిపిస్తుంది. ఇంకా దూరానికి అది మరీ బలహీనత చెంది అసలే వినబడదు.

ఒకగంటనే ఉదాహరణగా తీసుకుందాము. గంటను సుత్తితో బాదామనుకుందాము. ఘంటానాదమునకు ప్రేరేపణ కలుగుతుంది. ఈ ప్రేరణలు ప్రతి సెకన్డుకు 20 సార్లకు తక్కువగా జరిగితే, మనకు శబ్దం వినపడదు. సెకన్డుకు 20 సార్లకు ఎక్కువగా ప్రేరేపించినట్లయితే, వినబడుతుంది సెకన్డుకు 20,000 సార్లకు ఎక్కువ ప్రేరేపించిన శబ్దం మరల మనకు వినపడదు. ప్రతిసెకన్డుకు జరిగే ప్రేరేపణల సంఖ్యను, ఆ శబ్దతరంగాల "ఫ్రీక్వెన్సీ" అంటారు. అందువల్ల మనం, 20 మొదలు 20,000 వరకూ మధ్యవుంటే ఫ్రీక్వెన్సీగల శబ్దాన్ని మాత్రమే వినగలం. "ఫ్రీక్వెన్సీ" 20,000 కు పైగా వున్నట్లయితే శబ్దాన్ని ఆంగ్లభాషలో "సూపర్ సోనిక్ సౌండ్" అంటారు

ఈ "సూపర్ సోనిక" శబ్దతరంగాలకు బహువిచిత్రమైన కొన్ని ధర్మాలున్నవి.

• మనము మాట్లాడేప్పుడు ఉద్భవించే శబ్దాన్ని గూర్చి ఇప్పుడు పరిశీలిద్దాము. మానవుని గొంతులో ఒక గుంటవంటి నాళిక (Larynx) వున్నది. దీనిలో తీగలవంటి కండరాలు వుంటాయి. వీటి మధ్యగల ఖాళీ ప్రదేశాలద్వారా గాలిని బలవంతంగా ఛాతి నుంచి పైకిపంపినపుడు, ఆతీగలు ప్రేరేపణను పొంది గొంతు, నోరు, ముక్కులలోని ఖాళీ ప్రదేశాల సహాయంతో శబ్దం పుట్టుతుంది. ఈఖాళీ ప్రదేశాల ఆకృతులను బట్టి శబ్దగుణం వుంటుంది. ఈ శబ్దపు "ఫ్రీక్వెన్సీ" ఈ తీగలవంటి కండరాల బిగువును నిడివిని బట్టి మారుతుంటుంది. ఈవిధంగా మనం ఒకఅక్షరాన్ని అనేక "ఫ్రీక్వెన్సీ"లతో పలుకవచ్చు. మన చెవికి వినపడేట్లుగాని, లేదా, వినపడనట్లుగాని పలుకవచ్చు. వీటికి అనేక "ఫ్రీక్వెన్సీ" లుండవచ్చు.

ఇక మంత్రోచ్చారణ విషయం పరిశీలిద్దాము సామాన్యంగా మంత్రాలు అనేకవిధాలుగా శబ్దించే మాటల సముదాయాలు. ఈ సముదాయానికి అర్థం ఉండవచ్చును; లేక పోవచ్చును మంత్రోచ్చారకులు మంత్రాన్ని చెవికి వినబడనట్లే ఉచ్చరిస్తారు. కాని, వారి నోటినుంచి ఒకవిధమైన తరంగాలు వస్తున్నట్లు ఎదుటివారు తెలుసుకుంటారు. ఇది ఎవరైనా గమనించవచ్చు. ఇట్టి ధర్మమే "సూపర్ సోనిక్" శబ్దతరంగాలకు కూడా వున్నది. అందువల్ల, ఈ ప్రత్యేక పదముల (మంత్రం) ఉచ్చారణవల్ల "సూపర్ సోనిక్" శబ్దతరంగాలు ఉద్భవిస్తున్నవని భావించవలసివుంటుంది. అతి తక్కువనుంచి, అతి ఎక్కువ "ఫ్రీక్వెన్సీ"లు గల శబ్దతరంగాలను రికార్డుచేయగల "కాథోడ్ రే ఆసిలోగ్రాఫ్" అను యంత్రసహాయంతో మంత్రోచ్చారణము రికార్డుచేయవచ్చు. ఈ రికార్డును తిరిగి వాడ వీలగును. అయితే రికార్డుచేసేటప్పుడు, రికార్డింగు యంత్రంలో వాడిన పరిస్థితులనే (వేగం వగైరాలు) రికార్డు తిరిగి వాడేటప్పుడుకూడా పాటించాలి.

మంత్రోచ్చారణవల్ల సూపర్ సోనిక్ శబ్ద తరంగాలు వెలువడుతవని నమ్మినప్పుడు, ఈ

★ మంత్రాలు, నమ్మకాలు ★

తరంగాలు మంత్రశక్తికి ఏవిధంగా కారణభూతమవుతున్నాయో పరిశీలిద్దాము. ఇందుకు సూపర్ సోనిక్ శబ్దతరంగాల విచిత్ర ధర్మాలను, లక్షణాలను గమనించవలసి వుంటుంది

సూపర్ సోనిక్ శబ్ద తరంగాలు అనేకమైన యాంత్రిక, రసాయనిక, కాలిక మార్పులను తీసికొనిరాగల శక్తిని కల్గివున్నవి. ఇటువంటి మార్పులను చాలమట్టుకు వుడ్, లూమిస్ అనే ప్రఖ్యాత శాస్త్రజ్ఞులిద్దరు పరిశోధించి కనుగొన్నారు. ఒక దానిలో మరొకటి కలవని ద్రవపదార్థముల మిశ్రమము ద్వారా ఈ తరంగాలను పంపినట్లయితే, ఆ రెండు ద్రవాలు ఒకదానిలో మరొకటి జొచ్చి "ఎమల్షన్"గా తయారవుతాయి. ఫోటోగ్రఫీలోను, వైద్యంలోనూ వాడే "ఎమల్షన్"లను తయారుచేయడానికి ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు

ప్రవహించుచున్న చిక్కని ద్రవపదార్థం ద్వారా (ఉదాహరణకు ఆముదము) ఈ తరంగాలను పంపినట్లయితే, అది క్రమంగా పలుచబడి వేగంగా ప్రవహిస్తుంది ద్రవం సన్నని గొట్టాల ద్వారా ప్రవహించినప్పుడు ఈపని చురుకుగా జరుగుతుంది. ఈమార్పును "ఆర్గానిక్" ద్రవపదార్థాలు చాలా ఎక్కువగా పొందుతున్నవి.

ఉప్పు నీటిలో రక్తకణాలను కలిపి దాని, ద్వారా ఈ తరంగాలను పంపితే, రక్తకణాలు వియోగము (Decomposition) పొంది తమ రంగును ఉప్పునీటకి కూడా ఇస్తాయి. ఈ విధంగా మొత్తం పదార్థమంతా ఎఱని పారదర్శకమైన వర్ణాన్ని పొందుతుంది ఇది గమనార్హము.

సూక్ష్మజీవులు కూడా ఈ తరంగాలకు మార్పులు పొందుతాయి. చిరుచేపలు, కప్పలు ఈ తరంగాలను పొందినప్పుడు, అవి చనిపోయినవి. ఇది కూడా గమనార్హము.


ఈ తరంగాలను ఒక వైపుకు కేంద్రీకరించడం తేలిక. సముద్రంలో మునిగివున్న వస్తువులను తెలిసికోడానికి ఈ తరంగాలను పైన ఓడనుంచి క్రింద నీటలోనికిపంపిస్తారు. అవి నీటిలోవున్న వస్తువు మీద పరావర్తనము పొంది పైకి వస్తాయి. వీటని గమనించి వస్తువు ఉనికిని తెలుసుకుంటారు. ఇవిఈతరంగాల విచిత్ర ధర్మాలలో ముఖ్యమైనవి.

వీటినిబట్టి పాము మంత్రాలు మొదలయినవాటికి ఈ తరంగాలే కారణమవుతున్నవని గ్రహించవచ్చు. అంతేకాదు, "ఉపాధ్యాయుల"— (విజయనగరం) వారు ప్రకటించిన వ్యాసములో సత్యనారాయణగారి మంత్రాన్ని గురించి వ్రాస్తూ, ఆయన సర్పదష్టుడు తేరుకునేవరకూ టెలిఫోను రిసీవరు చేతిలో ఉంచుకొని, తరువాత దానిని యథాస్థానంలో వుంచినట్లు వ్రాశారు. దీనిని బట్టి మంత్రం టెలిఫోనులో ఉచ్చరించబడినదనీ, అది టెలిఫోనుద్వారా సర్పదష్టుని చేరగలిగినదనీ విదితమగుచున్నది. మంత్రము శబ్దతరంగాలద్వారా పనిచేస్తుందనే విషయాన్ని విశ్వసించవలసి ఉంటుంది.


ఇకపోతే, మంత్రోచ్చారకులు పాటించే నియమాలను, వారి అభ్యాసములను పరిశీలిద్దాము. మంత్రం నేర్చుకొనడానికెంతో అభ్యాస మవసరము. మనోవాక్కాయ కర్మల జయించవలెను. పైన వ్రాసినట్లు ఒక అక్షరాన్ని అనేక ఫ్రీక్వెన్సీలతో పలుకవచ్చును. అట్లే మంత్రాన్ని గూడ అనేక ఫ్రీక్వెన్సీలతో ఉచ్చరించవచ్చు నన్నమాట అయితే ఒక్కొక మంత్రానికి ఒక రకమైన ఫ్రీక్వెన్సీగల తరంగాలే పనికివస్తాయి. అందుచేత ఆఫ్రీక్వెన్సీ గల శబ్ద తరంగా మంత్రోచ్చారణ ద్వారా జనింపజేయడానికి ఎంతో అభ్యాసమవుసరం నిష్ఠ కూడా కావాలి మనస్సును కట్టివేసి మంత్రోచ్చారణమీదే నిమగ్నుడు కావాలి ఇవన్నీ అందరికీ సాధ్యం కావు ఎవరో మహానుభావులు సాధించగలరు అట్టి వారే శిష్యులకు సరియైన పద్ధతులను నేర్పగలరు అటివారి మంత్రోచ్చారణను రికార్డు చేసిన దానిని తిరిగి తిరిగి వాడడానికి వీలుపడవచ్చు.

పై విషయాలను పరిశోధించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా శరీరశాస్త్రవేత్తలు ఇందుకు ముందంజ వేయాలి. దీనికి అందరి సహకారంకూడా అవసరం. అప్పుడు, ప్రస్తుత విజ్ఞానశాస్త్రంలో మరొక నూతన అధ్యాయ స్థాపనావకాశా లుండగలవు దీనికి తెలుగు బిడ్డలే ముందంజవేతురుగాత! ★

కానూరి పూలరామకృష్ణారావు.
(కవుతరం)


ఆరోగ్యవంతులైన జనులు ప్రతిరోజూ
లైఫ్‌బాయ్ సబ్బుతో స్నానము చేయుదురు
—అది ప్రతిదిన*మలినములోని
క్రిములను కడిగివేయును!
LIFEBUOY SOAP
LIFEBUOY SOAP
*మనకు ప్రతిదినం తార్పడేమామూలు మురికిలో క్రిములున్నాయి మనలో ప్రతివారికీ యీక్రిములవల్ల రోగాల ప్రమాదంవుంది అందుచేతనే చాలా మంది ఆరోగ్యవంతులగు జనులు లైఫ్‌బాయ్ సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగివేసుకొనుటవల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొనుచున్నారు—అది ఆరోగ్యవంతమయిన హాయిని గలిగించును.
L 256-X52 TL
భారత దేశంలో తయారు చేయబడినది.

చంద్రముఖి



ప్రపంచసృష్టి ప్రారంభకాలంలో ప్రప్రథమ మానవుడు మనస్వి ఆనాటి భూలోకసౌందర్యంచూచి విభ్రాంతుడై ముగ్ధుడైనాడు. ప్రపంచంలో ప్రతి స్వల్ప విషయము అతని కత్యాశ్చర్యకరంగా భాసించింది. ఆకాశంలో పక్షులు బారులు తీర్చి ఎగిరిపోతూంటే అతడెంతో వింతగా వాటివైపే చూస్తూ ఉండేవాడు. కొండ కాలవలు [illegible] ప్రవహిస్తూంటే వాటితో కలిసి పరుగులు పెట్టేవాడు. నెమళ్లు గుంపులుగుంపులుగా పురివిప్పి ఆడుతూంటే వాటితో కలిసి నృత్యం చేసేవాడు. అడవిలో చెట్లక్రింద ఒత్తుగా రాలిపడిన [illegible] పళ్లు తిని [illegible]

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

ప్రవహించే చల్లచల్లని నీళ్లు తాగి పర్వతగుహల్లో హాయిగా పడుకుని నిద్రపోయే మనస్వి మహారణ్యజీవితం కొంతకాలం పాటేలోటు లేకుండా సుఖంగా సాగిపోయింది:

మరికొంతకాలానికి మనస్వికి తనవంటి మానవులా అరణ్యంలో ఇంకా ఎవరైనా ఉన్నారా? అని జిజ్ఞాస బయలుదేరింది. అతడాఅరణ్యంలో గుహలు, చెట్లు, పుట్టలు అన్నీ గాలించి చూశాడు. ఎక్కడా ఇంకొక మానవునిజాడే పొడగట్టలేదు. మనస్వి మనస్సులో క్రమంగా ఒంటరితనము, నిస్పృహ, దిగులు ప్రారంభమైనాయి. ఒకమృగంలాంటి మృగాలా అరణ్యంలో కోకొల్లలుగా కనిపించాయి. కాని తనవంటి మానవుడెక్కడా మనస్వికి ప్రత్యక్షం కాలేదు. అయినా మనస్వి తన పట్టువిడిచిపెట్టలేదు.

ఆమహారణ్యంలో దుర్గమమైన ప్రదేశాలన్నీ గాలించివేశాడు. ఒక గుహాగర్భంలో అతనికి రెండునక్షత్రాలు భూమిమీదే మెరుస్తున్నట్లు కనిపించాయి. ఆ నక్షత్ర కాంతి చూడగానే అతని కెంతో ఆశ్చర్యం కలిగింది. వెంటనే ఆప్రదేశానికి చేరుకున్నాడు.

అక్కడ కూర్చున్న వాడు మనస్వివంటి మానవుడే! అతని కళ్లేమక్కల్లా మెరిశాయి. కాని అతడు చాలా వృద్ధుడై పోయినట్లు కనిపించాడు. ఆ వృద్ధుడతన్ని చూస్తూనే లేచివచ్చి ఎంతో ఆప్యాయంగా ఆదరించాడు. మొట్టమొదటగా వారిద్దరిమధ్య సంజ్ఞాధ్వని రూపంలో అవిర్భవించిన అన్యోన్యత క్రమక్రమంగా అత్యాశ్చర్యకరమైన మానవభాషగా అవతరించింది.

కొన్నాళ్లకు వారిద్దరిమధ్య అపూర్వమైన అన్యోన్యత ఏర్పడింది. ఆ వృద్ధుడతనికి తన నామధేయం 'సవిత' అని మాత్రమే తెలియజేశాడు. అంతేగాని మిగిలిన తన పుట్టుపూర్వోత్తరాలేవీ తెలియజేయలేదు. సవిత మనస్విని పుత్రవాత్సల్యంతో ఆదరించేవాడు. మనస్వికి కూడా సవితపై పితృగౌరవం కలిగింది. ఆ నూతన బాంధవ్యంతో వారిద్దరు మరి కొంతకాలంపాటు చీకు, చింత లేకుండా సుఖంగా కాలం వెళ్లబుచ్చారు.

మరికొంతకాలానికి ఆ మహారణ్యంలో వర్షాకాలం ప్రారంభమైంది. మనస్వి హృదయంలో మళ్ళీ విచిత్రమైన ఆవేదన బయలుదేరింది. నెమళ్లు జంటలు జంటలుగా పురివిప్పి ఆడుతూంటే అతనికి కూడా ఆడనెమలి వంటి 'మనిషి'తో కలిసి ఆ అరణ్యంలో హాయిగా నృత్యం చేస్తూ సంచరించాలని బుద్ధిపుట్టింది. అప్పటినించీ అతనిలోని ఆవేదన మరింత తీవ్రంగా విజృంభించింది. మొట్టమొదటగా ఆ రాత్రే అతనికి నిద్రపట్టకపోవడం అంటే ఏమిటో తెలిసివచ్చింది. క్రమక్రమంగా ఆహారం మీద కూడా అరుచి బయలుదేరింది. సవిత ఒకనాటి ఉదయం అతనిఅస్వాస్థ్యానికి కారణమేమని అడిగాడు:

"ఏమో మరి! రోజు రోజు నాలో ఏదో పెద్ద అఖాతం ఏర్పడి పోతున్నట్లుంది."

సవిత కొంచెం ఆలోచించి మళ్లీ అడిగాడు.

"ఎందుచేత?"

"ఏమో!"

అని ఇంకా బాగా దిగాలు పడిపోయాడు మనస్వి. అ నాటి సాయంకాలంవరకు మరి ఆహార పానీయాదులేవి ముట్టలేదు. అలాగే దిగాలుపడి మతిపోయినట్లయి హాయిగా పురివిప్పి ఆడుకునే నెమళ్లుజంటల కేసి చూస్తూ కూర్చున్నాడు.

అంతలో సూర్యాస్తమయం అయింది. కొండకాలవలలో కొండ మల్లెపూవులు నక్షత్రాలు కలిసి మెలిసి ప్రవహించాయి. ఆకాశంలో మబ్బులపై మెరుపులు పురివిప్పి ఆడే నెమళ్లలా నృత్యం చేశాయి.

చిటపటమని చిన్న చిన్న చినుకులు పడ్డాయి. మనస్వి చెక్కిళ్లపై కన్నీటి బిందువులు నెమ్మది నెమ్మదిగా దిగజారాయి సవిత హృదయంలో మనస్విని గురించిన ఆందోళన, కరుణ కొండకాలవలై ప్రవహించాయి. సవిత నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ మనస్వి దగ్గిరికివచ్చి అతనివీపు తట్టాడు. మబ్బులతెరలు, చీల్చుకుని సన్నని పిల్లకాలవలా ప్రవహించిన వెన్నెలరేక మనస్వి పాదాలదాకా పాకివచ్చింది. ఉరుమొకటి మంద మందంగా మహారణ్యంలోని కొండచరియలలో మారుమోగింది. తటాలున మెరుపు మెరిసింది. క్షణకాలం అది మనస్వి కళ్ళకు మిరు మిరుమిట్లు గొల్పింది. దానితో అతనిముఖం కొంచెం వికసించింది, సవిత ఆ అదను కనిపెట్టి అతనిని నోదార్చాడు:

"మనస్వీ! ఎందుకంతగా అధైర్యపడి పోతావు! అదిగో నీకెదురుగా ఒక చక్కని చుక్క నిలబడింది చూడు!"

అని వేలెత్తి వారికనతిదూరంలో నిలబడిన ఒక సుందరీమూర్తిని చూపించాడు. మొట్టమొదట మనస్వి ఆకాశంలో తళతగా మెరిసిపోయే ఒక చక్కని చుక్కే తన కెదురుగా వచ్చి నిలబడిందని అనుకొన్నాడు. ఆ మూర్తి చక్కని 'చుక్క' కాదు. చుక్కవంటి ఒక మనోహర మానవమూర్తి!

౨

అటువంటి మనోజ్ఞ మానవమూర్తిని మనస్వి అంతవరకెన్నడు చూచి ఉండలేదు. అందుచేత ఇంచుమించుగా ఒక అరగడియవరకు అలాగే విస్తుపోయి ఆమెవైపే చూస్తూ కూర్చుండిపోయాడు.

ఆమె ముఖం పున్నమినాటి చంద్రబింబం అచ్చంగా భూమిమీదికి దిగివచ్చినట్లే కనిపించింది. తేళ్ళకళ్ళె ఆమెకళ్లుగా మారిపోయాయనిపించాయి. ఆమె చూపులు కొండకాలవలలో తళతళలాడే చిన్న చిన్న మీనుల్లా మెరిసి పోయాయి. చల్లనల్లని పిల్ల గాలికి చలించిపోయే కొండమల్లె తీగే ఆమె శరీరమై తన కెదురుగా నిలిచిందని మనస్వి నిశ్చయించుకొన్నాడు. మొట్టమొదటి చూపులో అతడు నెమలి పింఛమే ఆమె తనశిరస్సుపై అలంకరించుకొన్నదని భ్రమించాడు. కాని అది నిజం కాదనీ అది ఆమె తలకట్టేనని తరవాత నిర్ణయించుకొన్నాడు. ఒక్క విషయంమాత్రం అతనికివి స్పష్టంగా అవగాహన కాలేదు. ఆమె బాగా పరిపక్వమైన చూతఫలాలు రెండెంటో జాగ్రత్తగా హృదయం దగ్గర దాచుకొన్నదని అతని అనుమానం! ఎంతసేపటికీ అతనికా అనుమానం తీరలేదు! అసలావ్యక్తి ఎవ్వరో కూడా అతనికి తెలియలేదు! సవిత అతనితో అప్పుడప్పుడు దేవతామూర్తులనుగురించి ప్రసంగించేవాడు. మొదట ఆమె అలాంటి దేవతామూర్తే కావచ్చునని అనుకొన్నాడు. కాని మనస్సులో సంశయం ఇంకా అలాగే పట్టుకుని పీడించింది. తొందర తొందరగా సవిత సన్నిధికివెళ్లి అతని చెవిలో ఊదాడు:

"ఈ సుందరవ్యక్తి ఎవ్వరు? ఎవరైనా దేవతా?"

"కాదు!"

"రాక్షసుడా?"

"కాదు!"

"మరి?"

"మనుష్యస్త్రీ!"

"అంటే!"

"ఆడునెమలిని, మగనెమలిని చూచావు కదా? మగనెమలికి ఆడనెమలి ఎలాగో నీకామె అలాంటి దన్నమాట!"

మనస్వి మరింతగా విస్తుపోయాడు:

చంద్రముఖి

"ఇలాంటి వ్యక్తిని నేనెన్నడు చూడలేదే! ఎంతటి అత్యద్భుత సుందర వ్యక్తి!"

"ఆమె సృష్టి అత్యాశ్చర్యకరం! ప్రపంచంలో అందమైన వస్తువులన్నీ తమ అందం ఆమెకిచ్చాయి. అంతేకాదు ప్రపంచంలో పరమాద్భుతాలన్నీ ఆమెలో మూర్తీభవించాయి! ఇకనించీ ఆమె నీకు సహధర్మచారిణి!"

ఆమాట మనస్వికేమీ బోధపడలేదు. వెంటనే అడిగాడు:

"అంటే?"

సవిత అతనికామాట అర్థం కొంతవరకు వివరించి చెప్పాడు:

"ఇకనించీ ఆమె నీలో కలిసి మెలిసి తిరుగుతూ నీకు తోడునీడలా సంచరిస్తుంది. ఈ క్షణంనించీ నీలోని ఒంటరితనం అంతా పటాపంచలైపోతుంది. ఇకనించీ మీరిద్దరు సింహాలజంటలలాగ ఈ అరణ్యం అంతా ఏలుకుంటూ పావురాల జంటల్లాగ కలిసి మెలిసి సంచరించండి! నెమళ్ళ జంటల్లా కలిసిమెలిసి వినోదించండి! వెళ్ళు నాయనా! వెళ్ళు! ఆమెను నీవెంటతోడుకుపో!"

అని ఎంతో వాత్సల్యంతో అతని కుపదేశించాడు.

ఆ క్షణంలో మనస్వి మనస్సులోని ఆవేదన అంతా తెల్లవారేవేళ చిమ్మచీకటిలా పటాపంచలై పోయింది. అయినా ఆమె నేమని పిలవాలో అతనికి తెలియలేదు.

"ఆమె పేరు?"

"చంద్రముఖి!"

అని సవిత నెమ్మదిగా లేచి తన నివాసానికి తిరిగి వెళ్ళిపోయాడు.

మనస్వి ఆకల్లాడకుండా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ చంద్రముఖిని సమీపించాడు! ఆమె శరీరంమీది పాముకుబుసవంటి పట్టువస్త్రం చూడగానే అది పామేమోనని మొట్టమొదట అతనికి కొంచెం భయంవేసింది. ఇంకా ఆమెకు సమీపంగా వెళ్ళి నిలబడగానే అతని భయం కాస్తా అంతరించిపోయింది. అలాగే అత్యాశ్చర్యంగా ఆమె వైపు చూస్తూ నిలబడ్డాడు. కొంత సేపటికతనికా సౌందర్యమూర్తి పెదవులు ముద్దు పెట్టుకోవాలనీ ఆమె పుట్టుపూర్వోత్తరాలన్నీ ఆప్యాయంగా అడిగి తెలుసుకోవాలనీ అనిపించింది.

మనస్వి సాయంకాల సూర్యకిరణాలలా మెరిసిపోయే చంద్రముఖి పెదవులు ముద్దు పెట్టుకోబోయాడు. తటాలున ఆమె ముఖం పక్కకి తిప్పివేసింది. అతడు తిరిగి ప్రయత్నించాడు. కాని ఈమారుకూడా అది సాధ్యపడనీయలేదు. ఆమెను తన కౌగిలిలో బంధిస్తే అది సాధ్యపడగలదని మనస్సుకు తోచింది. వెంటనే ఆమెను గాఢంగా కౌగిలించుకొన్నాడు. క్షణంలో ఆమె అతని కౌగిలి పట్టు తపించుకొని చెంగున ఒక్క గంతువేసి లేడిపిల్లలా అరణ్యంలోనికి పారిపోయింది.

3

అయినా మనస్వి ఆమెను సంతటతో విడిచిపెట్టలేదు. ఎలాగైనా చేజిక్కించుకొని తీరాలని ఆమె వెంటపడ్డాడు. చంద్రముఖి అతని కందకుండా అతివేగంగా కొండలలోను, కోనలలోను పరుగులు పెట్టింది. మనస్వి తీవ్రవేగంతో పరుగులు పెట్టే లేళ్లు మొదలయిన మృగాలనెన్నిటినో వెంటదరిమి చేజిక్కించుకొన్నాడు. 'ఆమె పరుగొక లెక్కా!' అని అహంకరించాడు. మరింత వేగంగా ఆమె వెంటపడి పరిగెత్తాడు.

చూస్తూండగానే చంద్రముఖి ఒక మర్రి చెట్టు మాటున ఇట్టే అదృశ్యమైపోయింది. అతడా ప్రాంతం అంతా గాలించాడు. ఆమె ఎక్కడా కనబడలేదు. దిగాలు పడిపోయి, ఉసూరుమని మర్రిచెట్టునీడలో కూలబడిపోయాడు! అంతలో చంద్రముఖి హఠాత్తుగా అతని కళ్ళు రెండు మూసింది. ఆ తరవాత మరి అతని పట్టు తప్పించుకోలేకపోయింది!

ఆనాటినించీ వారిద్దరు వెలుగునీడల్లా ఒకరొకరిని విడిచి పెట్టకుండా వెంటనంటి తిరిగేవారు.

క్రమంగా కొంతకాలం గడిచిపోయేసరికి వారిద్దరు ఒక విడరాని జంటగా మారిపోయారు. మరికొంత కాలానికి మనస్వి మరి సవిత మాటే మరిచిపోయాడు. అతనికి చంద్రముఖే సమస్త ప్రపంచము అయి కూర్చుంది. ఒకనాడతడామెను గుచ్చి కౌగిలించుకొని చెక్కిలి ముద్దు పెట్టుకుంటూ అడిగాడు:

"చంద్రముఖీ! నీతో చెలిమి చేసినప్పటినించీ నా జీవితం అంతా ఒక మహోత్సవంగా, ఒక మృగయా వినోదంలా సాగిపోతూంది. నీ వెవరవు? ఇక్కడి కెలాగ వచ్చావు?"

అని నెమ్మదిగా ఆమె పుట్టుపూర్వోత్తరాలన్నీ అడగడం మొదలు పెట్టాడు. చంద్రముఖి అతని ప్రశ్నలు విని పక్కుమని నవ్వింది:

"ముందు నీ మాట చెప్పు! నీ వెక్కడినించి వచ్చావు?"

"నేనెక్కడినించీ రాలేదు! చాలాకాలం నించీ ఇక్కడే ఉంటున్నాను."

"నేను అంతే."

"అయితే నీవిక్కడఉన్న విషయం హఠాత్తుగా సవిత కెలాగ తెలిసింది?"

"అయితే మరి నీ విషయం మాత్రం ఆయన కెలాగ తెలిసింది?"

"నేనే ఆయన్ని ఒక గుహలో కనుక్కొన్నాను! అంతేగాని ఆయన నన్ను కనుక్కోలేదు!"

"నేను నిన్ను, ఆయన్ని ఒక్కమారే చూచాను. అంతే! అయినా హాయిగా అడవిలో పుట్టతేనె ఆరగించే వేళ ఈ అనవసర ప్రసంగాలన్ని ఎందుకు? రాపోదాం?"

అని చంద్రముఖి అతన్నింక మళ్ళీమాట్లాడనీయకుండా వెంటనే తనవెంట తోడుకుపోయింది. మనస్వి మారుమాట చెప్పకుండా ఆమెవెనకాలేపడి అడివిలోకివెళ్ళిపోయాడు. అప్పటినించి వారిద్దరు ప్రప్రథమంగా మానవలోకంలో అవతరించిన మనుష్యదంపతుల అమాయికానంద మాధుర్యం అంతా కొల్లగొన్నారు. వారిద్దరిని చూచిన మృగపక్షి మిథునాలన్నీ వారి ఆనందానికి ప్రతిబింబాలుగానే మారిపోయాయి. మొట్టమొదటగా మనస్వి ఆమె కౌగిలింతలోనే కలలు కనడం నేర్చుకొన్నాడు. అంతవరకు అతనికి కల అంటే ఏమో తెలియనే తెలియదు! అలాగ కొన్ని నెలలు గడచిపోయాయి.

ఆ అపూర్వానందం చవి చూచినకొద్దీ మనస్వికా అనంపమాధుర్యం అంతా ఎప్పుడో ఒకప్పుడు కల కరిగిపోయినట్టు కరిగిపోతుందేమోనని భయం వేసింది. ఆమాటే ఒకసారి ఆమెలో అన్నాడు. అది వింటూనే చంద్రముఖి రుసరుసలాడింది. "ఎప్పుడు ఏవో లేనిపోనిమాటలతోనే కాలక్షేపం చేస్తావు. నీకేం! నే నడివిలోకి వెళ్ళి నీకు పుట్టతేనె, పళ్లు తీసుకురావాలి! నన్ను వెళ్లనీ!"

అని ఆపైన అతడు చెప్పేమాట తిన్నగా వినిపించుకోకుండా తుర్రుమని అక్కడినించి పరుగెత్తుకుపోయింది. ఆనాటిరాత్రి గూళ్లలో పక్షులన్నీ నిద్రపోయేదాకా అతని ఆమెదగ్గరికి తిరిగి రాలేదు. అనుక్షణము చంద్రముఖి రాకకోసం కళ్ళు కాయలు కాచేలాగ ఎదురుచూచి విసిగి వేసారినమనస్వి ఆమెను చూస్తూనే మండిపడ్డాడు. "ఇంతిరాత్రి దాకా ఏంజేస్తున్నావు ఏపెద్దపులి అయినా హఠాత్తుగా నిన్ను నోట బెట్టుకుపోతే?"

"ఇన్నాళ్లనించీ నన్ను నీవే రక్షించావా? నాకేమీ భయం లేదులే!"

ఆ మాటతో మనస్వి మనస్సు భగ్గున మండింది:

"నీకేం! నువ్వలాగే మాట్లాడతావు! ఏదైనా ఆపత్తు వస్తే మధ్యన యాతన అనుభవించేవాణ్ని నేను! నీవు రేపటినించి ఒక్కత్తెవు అడివిలోకి వెళ్ళడానికి వీల్లేదు! తెలిసిందా?"

అని మనస్వి ఆమెమీద గుడ్లురజేశాడు. చంద్రముఖి మరింత మండిపడింది:

"నన్నాజ్ఞాపించడానికి నీ వెవరవు? నేను వెళ్ళితీరతాను! చూసుకో!"

"వెళ్లడానికి వీల్లేదు! గుహ దాటి ఎక్కడికైనా కదలిచూడు! ఏన్నంజేస్తానో!"

అని మనస్వి ఆమెను మరింత గట్టిగా బెదిరించాడు. చంద్రముఖి అతని కేమాత్రము లొంగిపోలేదు:

"అయితే నీ పుట్టతేనె, పళ్ళు నీవే తెచ్చుకో! ఈ వేళనించీ నేనవి నీ కోసం తీసుకురానేరాను! తెలిసిందా?"

ఆపైన అతనికేసి చూసి పట్టరాని ఉడుకుబోతుతనంతో బుడిబుడి దీర్ఘాలు తియ్యడం మొదలుపెట్టింది. అలాగ కొంతసేపు బుడిబుడి దీర్ఘాలుతీసి రుసరుసలాడుతూ అక్కడినించి వెళ్ళిపోయింది.

మనస్వి కామె దీర్ఘాలుతియ్యడం మొదలు పెడితే మరి నోటుమాట పెగలదు. అతడు పెద్ద పెద్ద అడవుల నెన్నిటినో రెండు చెవులు గట్టిగా పట్టుకుని క్షణంలో లొంగదీశాడు. కాని చంద్రముఖిని బాగా మచ్చిక చెయ్యడంమాత్రం అతనికి సాధ్యపడలేదు.

అప్పటినించీ వారిద్దరిమధ్య కస్సు బుస్సు లెక్కువైపోయాయి. మనస్వి ఏదిచెప్పినా ఆమె దానికి అడ్డంగా సమాధానం చెబుతుంది. అతడు పుట్టతేనెకోసం బయలుదేరదామంటే ఆమె పళ్లకోసం బయలుదేరదామంటుంది. కొంచెం గట్టిగా కసిరితే రాగాలు మొదలు పెడుతుంది. వారిద్దరిమధ్యన బయలుదేరిన చిలిపి కజ్జాలు క్రమంగా చిలికి చిలికి గాలివానలుగా మారిపోయాయి. చివరికి మరి కొంతకాలానికి వారిద్దరిమధ్య పచ్చగడ్డి వేసినా భగ్గుమని మండింది.

"సుఖంగా అడవిలో ఆకు, అలము తిని తిరిగేవాడికి నాకీవల్లమాలిన గుదిబండ దాపురించిందే!"

అని తన దురదృష్టానికెంతో విచారించాడు. ఎలాగైనా మరి ఆమె కంటికి కనబడకుండా తప్పించుకు తిరగాలని అనుకున్నాడు. కాని మరునాడెలాగైనా ఆమె నొకమారు చూడకపోతే అతని కంటికి కునుకే పట్టేదికాదు!

కాని ఆ మరునాడుదయమే అతడామె కంటికి కనిపించకుండా ఒక కీకారణ్యంలోకి వెళ్లిపోయాడు. "అమ్మయ్యా! ఇక ఇప్పటినించీ నాకు చంద్రముఖి పీడవదిలిపోయింది!"

అని ఎగిరిగంతేశాడు. కాని ఎక్కడినించి వచ్చిందో! చంద్రముఖి వెనకాలేవచ్చి అతని మెడచుట్టు వాటేసింది:

"నన్ను తప్పించుకుని పారిపోదామని అనుకున్నావా? నేను నీవెక్కడికి వెళ్ళిందీ కనిపెట్టలేననుకున్నావా! నేనిక్కడే పుట్టి పెరిగాను. నీవెక్కడెడున్నదీ పట్టుకోలేననుకొన్నావా?"

అని కలకలా నవ్వడం మొదలుపెట్టింది. మనస్వి ఆమె చాకచక్యాని కెంతైనా సంతోషించాడు. ఇద్దరు కలిసి మళ్ళీ అడివిలో లేళ్లజంటలా విహరించారు.

అంతలోనే చంద్రముఖి మళ్లీ అతనితో చిలిపి కజ్జాలు మొదలుపెట్టింది. క్రమంగా అతన్ని పొద్దస్తమానము పుండు సలిపినట్లు సలపడం మొదలుపెట్టింది. దానితో మనస్వి హృదయంలోని సహనశక్తి అంతా నశించిపోయింది. ఆమెనెలాగయినా సరే వదిలించుకు తీరాలని ఒక దృఢ నిశ్చయానికి వచ్చివేశాడు.

౪

ఆ క్షణంలోనే అతనికి సవిత సంగతిజ్ఞాపకము వచ్చింది. అతనినెలాగయినా ఆఅరణ్యమంతా గాలించి పట్టుకోవాలనీ అతని చంద్రముఖిని తిరిగీ అతనికి అప్పగించివేసి హాయిగా అడవిలో వేటకు వెళ్లిపోవాలనీ అనుకొన్నాడు.

అతికష్టంమీద పగలంతా ఆ మహారణ్యం అంతా వెతికి సాయంకాలంవేళ సవిత నొక గుహలో పట్టుకున్నాడు. వెంటనే అతని పాదాలమీద సాగిలపడ్డాడు. సవిత అతని యోగక్షేమాల విషయం అడగనే లేదు. పైగా చంద్రముఖి మాటే ముందుగా ప్రసంగించాడు.

"చంద్రముఖి ఏది?"

"ఏమో! ఎక్కడికి వెళ్లిందో తెలియదు. స్వామీ! ఆమె నామాట బొత్తిగా వినిపించుకోవడమే మానివేసింది."

మనస్వి గుక్క తిప్పుకోకుండా ఆమెకు తనకు మధ్యన నడిచిన వ్యవహారం అంతా సవిస్తరంగా విన్నవించాడు. సవిత అదంతా అతి శ్రద్ధగా ఆలకించాడు:

"అయ్యో! పాపం! ఏ పాపమూ ఎరుగని అమాయకురాలామె. ఇప్పుడీ అడవిలో ఎక్కడ ఏమి ఇబ్బందులు పడుతూందో!"

సవిత ఒక్క వేడినిట్టూర్పు విడిచి పెట్టాడు. అప్పటికి మనస్వి తాను తొందరపడ్డానేమో అని కొంచెం పశ్చాత్తాపపడ్డాడు.

★ చంద్రముఖి ★

అంతలోనే సవిత అందుకొన్నాడు:

"నాయనా! చంద్రముఖి ఇంకా ముక్కుపచ్చలారని పసిపిల్ల! ఆమెవల్ల ఏదైనా ఒక చిన్న లోపమే జరిగిందనుకో! అంత మాత్రానికే నీవింత తొందరపడాలా?"

సవిత మాటిమాటికి చంద్రముఖినే వెనక వేసుకురావడంతో మనస్వి ప్రాణం విసిగిపోయింది:

"ఏమైనాసరే! నేనిక ఆమెతో నేనొక్క క్షణంకూడా వేగలేను! ఆమె నన్ను పెట్టిన యమయాతనలు మీకేం తెలుసును! ఆమెకనక అడివిలో ఎక్కడైనా కనిపిస్తే ఇక తిన్నగా మీ దగ్గిరికే వెళ్లిపొమ్మని చెప్పేస్తాను. ఇక మీ చంద్రముఖిని మీరే జాగ్రత్త చేసుకోండి!"

మనస్వి ఆపైన మరి సవిత ముఖం చూడలేక తలవంచుకొన్నాడు. సవిత అతన్ని మాటిగా అడిగాడు:

"మనస్వీ! నువొక్కడవు ఒంటరిగా బతకలేక భయపడినప్పుడే నీకామెను తోడిచ్చాను! అప్పుడే ఆ మాట మరిచిపోయావా?"

"మరిచిపోలేదు గాని నాకిప్పుడామెకేసి కన్నెత్తి చూడడానికే భయంగా ఉంది. ఇప్పుడామె నాకొక ఈనిన పులిలా కనిపిస్తూంది!" అన్నాడు మనస్వి ఖండితంగా. ఆమాటమీద సవిత సాధికారంగా గట్టిగా నవ్వాడు:

"వెర్రివాడా! ఆ చంద్రముఖి ఎవరో తెలియక నీవిలాగ మర్యాద అతిక్రమించి మాట్లాడుతున్నావు! ఆమె ఎవరో తెలుసునా! స్వర్గలోకంలో దేవకన్యకే తిరిగి ఈ భూలోకంలో సాక్షాత్తు చంద్రముఖిగా అవతరించింది! తెలిసిందా?"

మనస్వి హృదయంలో ఆ మాటతో కొంచెం మెత్తబడింది. కొంచెం తటపటాయిస్తూ అడిగాడు:

అయితే నేనెవరిని స్వామీ!" సవిత పెదవిపై చిన్న చిరునవ్వు వెలిసింది:

"వెర్రివాడా? మీరిద్దరు పూర్వజన్మంలో స్వర్గదేవతలే! కేవలం సుఖమయమైన స్వర్గలోకంమీద విరక్తికొద్దీ మీ రిద్దరు సుఖదుఃఖ సమ్మేళనమయమయిన ఈ భూలోకంలో జన్మించారు. మీరే ఇకే ఈ మానవజాతి కంతటికీ ప్రథమదంపతులు! మీరే ఇక ఈ సృష్టికంతటికీ ఆకాశ దీపాలు! తెలిసిందా?"

మనస్వి ఆమాట విని తాను చేసినపనికి బాగా నొచ్చుకున్నాడు. అంతలో అతనికామె మంకుపట్లు, రుసరుసలు, బుడిబుడి దీర్ఘాలు మొదలైనవన్నీ జ్ఞాపకం వచ్చాయి. వాటిని గురించి సవితతో ఏదో విన్నవించుకోవాలని అనుకున్నాడు. అంతలో కొంచెం తటపటాయించి మాట్లాడకూరుకున్నాడు. సవిత అతని జిజ్ఞాస గ్రహించాడు.

"మనస్వీ! ఈ అంధకార బంధురమైన సంసార మహారణ్యంలో నీకిక బంధుమిత్రులెవరున్నారు? ఈ అరణ్యయాత్రలో నీకు భుక్తి ముక్తి ప్రదాయిని ఆ చంద్రముఖే! ఆమె చూపులే నీకీ కీకారణ్యంలో వెలుగుదారులు చూపించగలవు! ఇక ఇప్పటినించీ నీవామె కనుసన్నలలో మసులుకో! ఆమె ఎప్పుడైనా కంట తడిపెట్టిందంటే ఇక నీ నట్టింట సిరి ఒక్కక్షణమైనా నిలవదు! తెలిసిందా? మీ కిద్దరికి అచిర కాలంలోనే ఒక కుమారుడు కలుగుతాడు. ఆ పసివాణ్ణి దివ్యలోకంలోని దేవతలాగే పెంచి పెద్దచెయ్యండి! వెళ్లు నాయనా!"

అంతలోనే చంద్రముఖి కలకల నవ్వుతూ హఠాత్తుగా అక్కడికివచ్చి "చూచావా? చివరికి నామాటే నెగ్గింది!" అన్నట్టు మనస్వివైపు చూచింది. మళ్లీ చంద్రముఖిని చూడగానే మనస్వి మనస్సానందంతో ఉరకలు వేసింది. ఇద్దరు సవితకు పాదాభివందనంచేసి గుహ గుమ్మందాటి కొంతదూరం ఇవతలికివచ్చారు. మనస్వి ఎంతో ఆప్యాయంగా చంద్రముఖికేసి చూచాడు:

"విన్నావా? ఆయన చెప్పిన మాట, ఇక్కడినించీ నీవు నాతో చిలిపికజ్జా లాడడానికి వీలులేదు! ఇకనించీ నేను నీ మాటెన్నెప్పుడు నొప్పించనులే!"

చంద్రముఖి బుంగమూతిపెట్టింది:

"అయితే ఇక అడివిలోకి వెళ్లి పుట్టతేనె, అడివిపళ్లు నీవే తీసుకురావాలి. ఆసవిత మనకోసం ఒక దేవతై వెలిశాడు. ఆయనమాట లెప్పుడూ జవదాటకూడదు తెలిసిందా?"

అంతలో మనస్వి కొక విషయం జ్ఞాపకం వచ్చింది. అతడు మొదట సవిత ఎవరో తెలుసుకోవాలని అనుకొన్నాడు. కాని హఠాత్తుగా చంద్రముఖి అక్కడికి రాగానే అతడామాటే మరిచిపోయాడు. తీరా గుహగుమ్మం బాగా దాటివచ్చినతరవాతనే అతని కావిషయం జ్ఞాపకం వచ్చింది. తిరిగి వెంటనే లోపలికి వెళ్లాడు.

కాని అతనిక్కడ సవిత కనబడలేదు! గుహ అంతా అంధకార బంధురంగా కనిపించింది. మనస్వి వెంటనే తిరిగివచ్చి ఆ అద్భుత వృత్తాంతం ఆమెకు తెలియజేశాడు:

"చంద్రముఖీ! ఆయన నిజంగా దేవతామూర్తే! సందేహంలేదు!"

వెంటనే చంద్రముఖి మనస్సులో అతనికి చెయ్యెత్తి నమస్కరించింది.

నిన్ను, నన్ను, ఈ మహాప్రపంచము సృష్టించిన సృష్టికర్త ఆయనే!"

అన్నాడు మనస్వి.

తిరిగీ ఇద్దరు ఆ గుహాముఖంలో నిలబడి అతనికి చెయ్యెత్తి నమస్కరించారు.

అప్పటినించీ అడివిపళ్లు, పుట్టతేనె తీసుకురావడం మనస్వి కొక అలవాటుగా మారిపోయింది. ఆ పళ్లు పుట్టతేనెలో పొదిపి అతని కందించడం చంద్రముఖికి మహానందదాయకంగా పరిణమించింది.

మనస్వి అడివిలో ఎన్ని కష్టాలుపడినా చంద్రముఖీ ముఖస్మరణంలో అవన్నీ అతని కవితీయని కలలుగానే కనిపించాయి. ★



న్యూఢిల్లీ లేఖ

ఎన్నికల అనంతర తతంగం

అధికారం తిరిగి మెల మెల్లగా కాంగ్రెస్ హస్తగత మవుతున్నది. ఇది భారతదేశ ఏకైక నాయకుడు ప్రధాని నెహ్రూపట్ల ప్రజలు తమ విశ్వాసభావాన్ని పునర్వ్యక్తీకరించడమే అవుతుంది. ఎన్నికల ఫలితాలు క్రమక్రమంగా బయటపడిన కొద్దీ, ఇక్కడ రాజధానిలో కొత్త కేంద్ర మంత్రివర్గంలో ఎవరెవరు వుంటారనే విషయమై ఇప్పటి కప్పుడే ఊహాగానం కూడా ప్రారంభమైంది. ఎన్నికలలో గెలిచినప్పటికీ, కొంతమంది పాతమంత్రులకు కేంద్రప్రభుత్వంలో స్థానం ఉండదన్నది తథ్యంగానే కనిపిస్తున్నది. ఐదేళ్ళ క్రితం ప్రధాని నెహ్రూకు కుడిభుజం, ఎడమభుజంగాపనిచేసిన ఇద్దరుముఖ్యమిత్రులు ఉండేవారు. వారిద్దరూ నెహ్రూకు మిత్రులుగానే గాక, వివిధవ్యవహారాలమీదా అంతరంగిక సలహాదారులుగా కూడా వ్యవహరిస్తుండేవారు. వీరిద్దరిలో ఒకరు రఫీ అహమ్మద్ కిద్వాయ్; మరొకరు ఎన్. గోపాలస్వామి అయ్యంగార్. ప్రధాని నెహ్రూకు వీరు అత్యంత ఆంతరంగికు లయినప్పటికీ, వీరిద్దరూ కూడా ఎన్నికలు వచ్చినపుడగానే స్వయంశక్తిమీదే ఆధారపడి ఎన్నికల పోరాటము సాగించుకున్నారు. అంతేగాని ప్రధాని నెహ్రూ మీద ఆధారపడలేదు. ఆనాటి పరిస్థితికి ఈనాటి పరిస్థితి ఎంతో భిన్నంగా వున్నది.

ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు పూర్తి కాగానే, రేపు ఏప్రిల్‌లో కొత్త కేంద్ర మంత్రివర్గం ఏర్పడుతుంది. స్వార్థపరాయణు లయినవారు మంత్రివర్గ నిర్మాణంలో ప్రధాని నెహ్రూపై బహుముఖాలుగా వత్తిడి తెచ్చే అవకాశం లేకపోలేదు.

ఇందు కుదాహరణంగా మురార్జీ దేశాయ్ వ్యవహారాన్నే తీసుకోవచ్చు. మురార్జీ భారతప్రభుత్వ వాణిజ్య శాఖపై ఆధ్వర్యం వహించకూడదని కొంతమంది ప్రబలమయిన ప్రచారాన్నే సాగించారు. అజిత్ ప్రసాద్ జైన్ వాణిజ్యమంత్రి కావాలని వీరి వాదన. అంటే, బీహారీ ప్రముఖుల చేతుల్లో వున్న శాఖలు ఎప్పుడూ వారిచేతుల్లోనే వుండాలని బీహారు వత్తిడి చేస్తుందన్నమాట.

రాష్ట్రీయ సంకుచిత దృక్పథంగాని, కులతత్వ ధోరణిగాని ఏమాత్రం లేని వ్యక్తి ఎవరైనావున్నారా అని ప్రశ్నిస్తే, ప్రధాని నెహ్రూ మాత్రమేనని సమాధానం చెప్ప వలసి వస్తుంది. కేంద్ర మంత్రివర్గం ఏదో ఒక రాష్ట్రానికి చెందిన ప్రబుద్ధుల అడుగుజాడలకు లోబడి పనిచేయడమన్నది ఎంత ప్రమాద భరితమయిన విషయమో ప్రధాని నెహ్రూకు బాగా తెలుసు. దేశ సుస్థిరత్వం సురక్షితముగా వుండాలంటే, కేంద్ర మంత్రివర్గంలో వివిధ రాష్ట్రాలకు సమానమైన, న్యాయమైన ప్రాతినిధ్యం వుండితీరాలి. ఇప్పటిమంత్రివర్గములో బెంగాల్ రాష్ట్రానికి ఎన్నదగిన ప్రాతినిధ్యమేమీ లేదు. హిందీభాష మాట్లాడని దక్షిణాపథం తరఫున టి. టి. కృష్ణమాచారి, వి. కే. కృష్ణమీనన్ ఇద్దరే ఇద్దరు ప్రతినిధులున్నారు. ఇప్పటి ఎన్నికలు పూర్తికాగానే కృష్ణమీనన్, బొంబాయి ప్రతినిధిగా మారి పోతారు - దేశముఖ్ నిష్క్రమణతో మహారాష్ట్రులకు ప్రాతినిధ్యమే లేకుండా పోయింది.

ఇప్పటిపార్లమెంటు జీవితం 1957మార్చి 31 అర్ధరాత్రితో సమాప్తమవుతుంది. దేశ పరిపాలనానిర్వహణంలో రాష్ట్రపతికిసహాయ పడడానికి కొత్తమంత్రివర్గం ఏర్పడాలి. అంటే, ఏప్రిల్ 1-వ తేదినుంచి ప్రస్తుత మంత్రివర్గం కేవలం "అజ్మాయిషీ మంత్రివర్గం"గా మారిపోతుందన్నమాట. ఆ తర్వాత రాష్ట్రపతి ఎన్నికకు తేదీలు నిర్ణయిస్తారు. పార్లమెంటు కాంగ్రెస్ పార్టీనాయకుణ్ణి మంత్రివర్గం ఏర్పాటుచేయవలసిందని నూతన రాష్ట్రపతి ఆదేశిస్తాడు. పండిత్ జవహర్లాల్ నెహ్రూకు రాష్ట్రపతివద్దనుంచి ఈ పిలుపువస్తుంది. కొత్త రాష్ట్రపతి ఎన్నిక ముందు జరిగితేగాని, కొత్త మంత్రివర్గ నిర్మాణం జరగదన్నమాట. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర శాసనసభ్యులు కలసి రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. లోక్‌సభ స్థానాలలో కొన్నిటికి ఎన్నికలు వాయిదా పడినప్పటికీ, రాష్ట్రపతి ఎన్నికకు ఆటంకమేమీ వుండదు.

* * *

టిబార్ మెండీ అనే అతడు ప్రధాని నెహ్రూతో 1956 ఆరంభంలో జరిపిన నాలుగు సంభాషణలనూ చేర్చి "నెహ్రూతో గోష్ఠి" అనే పేరుతో ఒక పుస్తకం ప్రచురించాడు. దీన్ని చదివితే దేశాన్ని ఎదుర్కొంటున్న కొన్ని ప్రాథమిక సమస్యలపట్ల ప్రధాని నెహ్రూ అభిప్రాయాలేమిటో, మనోగత భావాలేమిటో బోధపడతవి. నెహ్రూ అనంతరం పరిస్థితి ఎలా వుంటుంది? ఎవరిది ఆధిపత్యం? అన్నది ఈ సమస్యలలో ఒకటి. ఈ విషయమై తన సంభాషణల ద్వారా తెలుసుకున్న నెహ్రూ భావాలను టిబార్ మెండిస్ ఇందులో పొందుపరిచారు. నెహ్రూ ఇచ్చిన సమాధానం ఒక ప్రశ్నకు ఈవిధంగా వున్నది.

టిబార్ మెండీ: చాలా వ్యక్తిగతమైన విషయాన్ని ముచ్చటిస్తున్నాను ... కొన్నివారాల క్రితం నేనుఖజూరహో వెళ్ళడం తటస్థించింది. ఆలయాలకు పక్కనేవున్న ఒక మర్రిచెట్టు కింద కూచుని మధ్యవయస్కుడైన ఒక వ్యక్తితో పిచ్చాపాటీ మాట్లాడడం మొదలుపెట్టాను. బహుశా అతడొక ఉపాధ్యాయుడనుకుంటాను. అతడు అందమైనవాడూ, చాలా తెలివైనవాడూ కూడా. పొడుగాటి గడ్డంవుంది. భారతదేశ

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

★ న్యూఢిల్లీ లేఖ ★

వ్యవహారాలనే ముచ్చటించుకున్నాము, మాట్లాడుకోవడం పూర్తి అయిన తర్వాత అతడు లేచి, "మిత్రమా! నెహ్రూ వున్నప్పటి భారతదేశానికీ, నెహ్రూ లేనప్పటి భారత దేశానికి చాలా వ్యత్యాసం వుంటుంది సుమా!" అన్నాడు...ఇదంతా ఇంత వివరంగా ఎందుకు చెబుతున్నానంటే, ఇదే భావం దేశమంతా బాగా వ్యాపించివుందనే సంగతి మీకు తెలిసే వుండవచ్చు. భారత ప్రజాబాహుళ్య మనఃఫలకాలలోవున్న అతి ప్రధానమైన భావాలలో ఇదొకటనుకుంటాను. భారతదేశం మీ నాయకత్వం కోల్పోతే ఏమి కానున్నది? అంతా ఒకే ఒక వ్యక్తి మీద ఆధారపడి వుంటుందా అనీ, ఏఒకరూ అంత అనివార్యమైన వ్యక్తికాడనీ మీరు ఈ ప్రశ్నను త్రోసి రాజనవచ్చు. ఇది అంత సులభమైన సమస్యకాదు. మీరు ప్రస్తుతం దేశంలో బహురకాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీటిలో ముక్తసరిగా మూడు ముఖ్యమైన విషయాలనే విన్నవిస్తాను. (1) దేశపరిపాలనా బాధ్యతలు నిర్వహిస్తున్న పార్టీ రథానికి మీరు సారధి. సువిశాలమైన, జటిల వ్యవహారాలతో కూడిన ఈ దేశాన్ని పరిపాలించడానికి ఈపార్టీ విధిగా వుండితీరాలంటున్నారు. పార్టీలోవున్న రకరకాల వర్గాల మధ్య సామరస్యం సాధించి, సమైక్యపరచి సారధ్యం వహిస్తున్నారు. పార్టీ శాఖోపశాఖలలో ఎక్కడ ఏ అశాంతి ప్రజ్వరిల్లినా అక్కడ రెక్కలు కట్టుకునివాలి మీ మాంత్రికపదమాధుర్యాన్ని కుమ్మరించి అశాంతి జ్వాలలను ఆర్పివేయగలుగుతున్నారు. (2) దేశంలోవున్న మధ్యతరగతి ప్రజాబాహుళ్యానికీ, గ్రామసీమకూ మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించి అతి ముఖ్యమైనపాత్ర నిర్వహిస్తున్నారు. ఈ బాధ్యత నిర్వహించడమన్నది అంత తేలికైన పనికాదు.

(3) ఇక మూడోది అత్యంత ప్రధానమైన విషయం. దేశాభివృద్ధి పథకాలన్నీ ఈనాడు అభ్యుదయ పథాన కొనసాగుతున్నవంటే అందుకు మీ పలుకుబడీ, మీ ప్రభావమే కారణం. జాతీయ అంతర్జాతీయ వ్యవహారాలన్నిటిలోనూ ఈ మీ ప్రభావమే తారకమంత్రంలా పనిచేస్తున్నది. దేశంలో సాగుతున్న



ప్రతి అభ్యుదయకార్యకలాపానికీ మీరు సామాజిక శ్రేయస్సనే ఒక లక్ష్యాన్ని సమకూర్చగలుగుతున్నారు. భారత ప్రజలదృష్టిని బాహ్యప్రపంచ వ్యవహారాల మీదికికూడా మరల్చ గలుగుతున్నారు. మిగతా ప్రపంచం ఏమైపోతే నేమనే ధోరణ్ని దేశప్రజలలో లేకుండా చేయగలిగారు.

పార్టీ సారథిగా మీ స్థానాన్ని మరొకరు ఆక్రమిస్తే ఆక్రమించవచ్చు. గ్రామసీమకు, ఇతరమధ్యతరగతులప్రజలకుమధ్యఅనుసంధానకర్త బాధ్యతలనుకూడా మరొకరు స్వీకరిస్తే స్వీకరించవచ్చు. అభ్యుదయ సాధనలో మీ అంతటి పలుకుబడినీ, ప్రాభవాన్నీ ఉపయోగించగలిగిన వ్యక్తి మీ స్థానే మరొకరు దొరుకుతారా అన్నదే నా సందేహం. దయచేసి ఈ విషయంలో మీ భావాలేమిటో దాపరికం లేకుండా చెబుతారా? దేశంలోనేగాక, దేశానికి వెలుపలకూడా లక్షలాది ప్రజలు మీ అభిప్రాయం తెలుసుకోవాలని తహతహ లాడుతున్నారనుకుంటాను.

ప్రధాని నెహ్రూ: మీరు ముఖ్యమైనవని మూడు అంశాల ప్రసక్తిమాత్రమే తెచ్చారు. నేను నాల్గో అంశం కూడా మరొకటి చెబుతాను. దేశ స్వాతంత్ర్య సమరంతో ప్రత్యక్ష సంబంధం ఒక్క నాకే గాక, అనేకమంది ఇతరులకుకూడా వున్నది. స్వాతంత్ర్య స్థాపనానంతనం సాగుతున్న ద్వితీయఘట్టంతోకూడా – అదే పునర్నిర్మాణ ఘట్టం– చాలామందికి సంబంధం వున్నది.

పోనుపోను స్వాతంత్ర్యసమరఘట్టంతో ప్రత్యక్ష సంబంధం వున్నవారి సంఖ్య దేశంలో సహజంగా తగ్గిపోతుంది. స్వాతంత్ర్య సమరంతో ప్రత్యక్ష సంబంధంవున్న కారణంచేత మాకు ఒక పెద్దప్రయోజనమే చేకూరింది. ప్రజలలో విశేష కీర్తిప్రతిష్ఠలు, పలుకుబడి చేకూరడమే ఈ ప్రయోజనం. ఈ ప్రాపకాన్నీ, ప్రతిష్ఠనూ దేశ పునర్నిర్మాణ కార్యకలాపంలో వినియోగించుకోడానికి వీలవుతున్నది. ఇప్పుడు మేము పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిపాలనా విధానాన్ని ఏర్పాటు చేసుకున్నాము. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తిగత కీర్తి ప్రతిష్ఠలకు ప్రాధాన్యంలేదు. అయినప్పటికీ, మాకు లోగడ లభ్యమైన అనుభవం ఒక ప్రత్యేక ప్రయోజనమని అంగీకరించక తప్పదు. ఈ ప్రయోజనం ముందుముందు క్రమ క్రమంగా తగ్గిపోయే మాట నిజం. కొత్తతరం యువకులకు పూర్వ స్వాతంత్ర్య సమరంతో ప్రత్యక్షసంబంధం వుండని మాటకూడా నిజమే. ఆ సమర గాధను వారు వినిగాని, చదివిగాని తెలుసుకోవలసి

వుంటుంది. దాన్నిబట్టి వారు కేవలం నినాదాలు మార్కొగేట్లు చేసినందువల్ల స్వర్గం ఊడిపడుతుందని దురభిప్రాయపడే అవకాశంవుంది. ఇలాంటి చిక్కులు ఏర్పడవచ్చు. ప్రజలకు ఉత్తమమార్గంలో శిక్షణ ఇవ్వడంద్వారా ఈ చిక్కులు పరిష్కరించుకోవలసి వుంటుంది. మేము ప్రస్తుతం చేస్తున్నపని ఇదే. సవ్యంగానే ఈపని సాగిపోతున్నది.

ఇక పోతే అంతర్జాతీయ వ్యవహారాలపై భారతదృక్పథం విషయం. ఇందులో కూడా రెండు పరస్పర విరుద్ధశక్తులు పని చేస్తున్నవనడంలో సందేహంలేదు. ప్రపంచ వ్యవహారాలంటే లోగడభారతదేశం మామూలుగానిర్లిప్తభావాన్ని ప్రదర్శిస్తూవచ్చినమాట నిజమే. భారతదేశంలాంటి సువిశాలమైన ఒకదేశం ఈధోరణ్ని ప్రదర్శించడంలో అసహజమేమీ లేదు. తనకు తనే ఒక పెద్ద ప్రపంచంలా గోచరిస్తుంటుంది. దేశం ఎంత చిన్నదైతే, అంత ఎక్కువ శ్రద్ధగా అది ఇతరదేశ వ్యవహారాలపై అసక్తిచూపుతుంది. అయితే ఆధునిక పరిస్థితుల కారణంగా ప్రతి దేశమూ బాహ్యప్రపంచ వ్యవహారాలను ఆలోచించక తప్పదు. ప్రపంచ సమస్యలను శ్రద్ధాసక్తులతో పరిశీలిస్తుండాలనే అభిలాషను, ఆసక్తిని స్వాతంత్ర్య ఉద్యమం సాగించినప్పటినుంచీ కూడా అలవరుచుకుంటూ వచ్చాము. ఇందుకు తప్పకుండా నేనే కారణభూతుడినని కూడా చెప్పుకుంటున్నాను. మారుమూల నివసించే గ్రామీణుడైనా, ఢిల్లీలో టాంగానడిపి జీవనోపాధి ఆర్జించే సాధారణవ్యక్తి అయినా మా విదేశాంగ విధానంపై ఏవో కొన్నిభావాలను చెప్పగలిగి వుంటాడు. దీన్ని మీరు స్వయంగా గ్రహించే వుండవచ్చు. అతగాడికి వివరాలన్నీ సవిస్తరంగా తెలియక పోవచ్చు; అయినప్పటికీ బాహ్యప్రపంచాన్నిగురించి ఇదివరకుకంటె ఎక్కువగానే ఇప్పుడు ఆలోచించే స్థితిలో వున్నాడు.


ఈవిధమైన మార్పులకు శక్తికొద్దీ పునాదులు వేస్తున్నాము. భారత ప్రజానీకపు మానసిక వైఖరినే మార్చాలని యత్నిస్తున్నాము. ఈ మార్పులు ఎంతవరకు సఫలీకృతం కాగలవో, నేను, నాతరంవారు దాటిపోయిన తర్వాత ఏమిసంభవిస్తుందో ఊహించవలసిందేగాని ఏమని చెప్పగలం? ఏవేవో కొన్ని సుస్థిర లక్ష్యాలకు కట్టుబడి యథాశక్తి పనిచేయడానికి ప్రయత్నిస్తాము. తర్వాత కొత్తవారు అందుకుంటారు.

మీ ప్రశ్నకు సమాధానమన్నది లేదు. అయితే ఒకవిషయం. భవిష్యత్తు విషయమై నాకు భయమేమీలేదు. ఎందువల్లనంటే, భయపడి లాభంలేదు; ఈలోపుగా శక్తికి తగినట్లు మేలుచేయడమే మనవిధి..." ★

(నాటిక)

నీలి తెరలు

అంగర సూర్యారావు





4 అంకం.

(స్థలం:- అదే. సమయం:- రాత్రి 7 గంటలు. వామనమూర్తి కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూ వుంటాడు. కుడివైపునుంచి దామోదరం వస్తాడు.)

వామన:- (సంతోషంతో) రండి, దామోదరంగారూ, మీకోసమే ఎదురు చూస్తున్నాను.

దామో:- (ఆత్రుతతో) ఏమయ్యింది? అసలు మా అబ్బాయి వచ్చాడా?

వామ:- (ఉత్సాహంతో) వచ్చాడండీ, వచ్చాడు. చాలా హుషారైన కుర్రాడు.

దామో:- వాళ్లిద్దరూ యిష్టపడ్డారా?

వామ: మా చిత్ర మీవాడితో పెళ్ళి సంగీతంకూడా పాడించిందండి మీవాడు ఎంత అద్భుతంగా పాడాడనుకున్నారు!

దామో: (ఆశ్చర్యంతో) మా వాడికి పాటలు పాడడం వచినట్లు నాకు తెలియదే!

వామ: పాడడం వచ్చినంత మాత్రాన మీముందు పాడుతూ, కూర్చుంటాడటండీ! అంతేకాదు మా అమ్మాయి మీ వాడితో లెఖ్ఖలుకూడా చేయించింది.

దామో: వాడికి లెఖ్ఖలు అసలు రావు.

వామ: అదేమిటి? అలా అంటారు! యిచ్చిన నాలుగు లెఖ్ఖలు క్షణంలో చేసి పారేశాడు.

దామో: యిది నాకు మరీ వింతగావుంది. వాడికి లెఖ్ఖల పరీక్షలో నూటికి పది మార్కులే వస్తూవుండేవి. అటువంటిది వాడు యిక్కడ యింత అద్భుతంగా ఎలా చేశాడో నాకు అర్థం కావడం లేదు.

వామ: తరవాత మీ వాడికి చిత్రలేఖనం అసలు చేతకాదు.

దామో: నాకు తెలిసినంత వరకూ మా వాడికి చేతనైన విద్య బొమ్మలు వెయ్యడం ఒక్కటే, చిన్నప్పుడు వాడు మసిబొగ్గుతో గోడలనిండా బొమ్మలు వేస్తూవుండేవాడు.

వామ: కాని మా అమ్మాయి సమక్షంలో ఒక బొమ్మకూడా గియ్యలేక పోయాడు—ఏమైతేనేం చివరకు మా అమ్మాయికి మీ వాడు పూర్తిగా నచ్చాడు.

దామో: అయితే మరి మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చిందా?

వామ: (తేలికగా) నచ్చకేంచేస్తుందండీ! మహారాజులా నచ్చుతుంది.

దామో: అబ్బే! అలా అనడానికి వీలు లేదండోయ్. వాడికి నచ్చకపోతేమాత్రం మనం ఏమీ చెయ్యలేం. అసలు మీరు కనుక్కున్నారా మా వాణ్ణి?

వామ: ఊహు! నేనేమీ అడగలేదు. కాని మీ వాడి వాలకొన్నిబట్టి చూస్తే యిష్టపడినట్లే కనిపిస్తోంది.

దామో: అలా అనుకోడానికి వీల్లేదండీ. వాడు విచిత్రమైన మనిషి. వాడిని ఒకసారి పిలవండి-యిప్పుడే తెలుసుకుందాం.

వామ: (మేడమీదికి చూస్తూ) దండపాణీ! దండపాణీ!

చిత్ర: (మేడమెట్లమీద కనిపించి) లేడు డాడీ! దండపాణికి యీపూట మీరు సెలవిచ్చారట కదూ!

వామ: అవునవును. పోనీ పెళ్ళికొడుకును యిలా రమ్మను వాళ్ళ నాన్న వచ్చారు. మాట్లాడతారు.

చిత్ర: లేరు డాడీ! దండపాణి ఆయనా కలిసి ఏదో నాటకం అనుకుంటూ వెళ్ళిపోయారు. ఒక గంటలో తిరిగి వస్తారు.

దామో: (లేచి) నేను ఒక గంటలో మళ్ళీ వస్తాను వామనమూర్తిగారు!

వామ: పోనీ, యిక్కడేకూర్చోకూడదూ!

దామో: లేదండీ! ముఖ్యమైన పని ఒకటి వుంది. అది చూసుకువచ్చేసరికి గంట ఎలాగూ అవుతుంది. వస్తాను. (కుడివైపు నిష్క్రమిస్తాడు.)

చిత్ర: బ్రెడ్ యిక్కడకు తీసుకురానా డాడీ?

వామ: వద్దమ్మా! నేనే పైకివస్తాను.

(చిత్ర మేడమీదికి వెళ్ళిపోతుంది. వామనమూర్తిగారు నెమ్మదిగా మేడమెట్లు ఎక్కి పైకి వెడతారు. అకస్మికంగా హాలులో దీపాలు ఆరిపోతాయి. గాఢాంధకారం ఆవరిస్తుంది.)

దినకర్: (మాటలు వినిపిస్తాయి. మనిషికనిపించడు.) కాలచక్రం తిరుగుతోంది. తిరిగి తిరిగి ఉజ్వల తేజస్సుదాటి గాఢాంధకారంలోకి వచ్చింది. సామాన్య మానవుని సుఖం, కాంతి, అనుభూతులు, కోర్కెలు సమస్తం చీకటిలో చిక్కుకు పోయినై. అంధకారంలో అణగివున్న సుఖాన్ని కాంతిని పట్టుకోవాలి. వాటిని వెలుగులోకి తీసుకురా! వాలి. మనిషీ! యికలే! నడుం బిగించు ఆలస్యం చెయ్యకు.

(అకస్మికంగా హాలులో నీలికాంతి ప్రసరిస్తుంది. హాలుమధ్య ఒక సోఫామాత్రమే వుంది. నిరంజన్ చక్కగా అలంకరించుకొని సోఫాలో కూర్చుని వున్నాడు. అతని ముఖంలో కోపం, అవమానం కనిపిస్తున్నాయి.)

అనంద్: (సేవకుని వేషంలో ప్రవేశించి)

★ నీలి తెరలు ★

నిరం: (లేచి ఉగ్రుడై) ఎందుకు? ఆ ముసలిదెయ్యం మళ్లీ ఎందుకు వచ్చాడు?

ఆనంద్ : (వినయంగా) మిమ్మల్ని చూడాలంటున్నాడు బాబూ! వెళ్లిపొమ్మని ఎంత చెప్పినా వినడంలేదు.

నిరం: ఆ ముసలిపీనుగను వెంటనే ప్రవేశ పెట్టు. అంతవరకూ వాడు నన్ను వదలడు. ఊఁ! వెళ్లు!

(ఆనంద్ నిష్క్రమిస్తాడు. ఉద్వేగంతో హాలులో తిరుగుతూవుంటాడు నిరంజన్. చిరిగిన బట్టలతో, చివికిన దేహంతో, తెల్లబడిన కేశాలతో, వణుకుతూ ఒక ముసలివాడు ప్రవేశిస్తాడు.)

వృద్ధుడు: (గద్గద స్వరంతో) చిన్నబాబూ!

నిరం: (కోపంతో) నువ్వు మమ్మల్ని వదలదలుచుకో లేదా?

వృద్ధు: ఎలా వదలగలను చిన్నబాబూ!– నాలోని యౌవనాన్ని, రక్తమాంసాలను మీ సేవలో హరింపచేసుకున్నాను.

నిరం: నిన్ను సేవకవృత్తిలోకి రమ్మని ఎవరైనా బతిమాలారా? హాయిగా అంతఃపురంలో కూర్చోలేకపోయావూ?

వృద్ధు: లేదు బాబూ! విధి అందరినీ సుఖపడడానికి సృష్టించలేదు. నాలాంటి వాళ్లకు విధి ప్రతికూలించి కంటకావృతమైన మార్గాన్ని ప్రసాదించింది.

నిరం: యికనన్ను వృథాగా విసిగించకు. వెళ్లు.

వృద్ధు: మా వంటి దీనులమీద దయ చూపించాలి చినబాబూ!

నిరం: (కోపంతో) మీరు కేవలం దీనులే కాదు. హీనులు. తిన్నయింటికి వాసాలు లెక్కపెట్టే నీచాతి నీచులు!

వృద్ధు: కుర్రవాడు చేసిన పొరపాటుకు నన్ను శిక్షించడం ధర్మమా?

నిరం: (హేళనగా) కుర్రవాడు!... పొరబాటు!...హహ్హహ్హా! వాడిని చిత్రవధ చేసినా పాపంలేదు.

వృద్ధు: నా ముఖం చూడండి చిన్నబాబూ! నేను పదేళ్ల పిల్లవాడిగా వున్నప్పుడు మీ తాతగారిదగ్గర నౌకరుగాచేరాను. ఆయన జీవితకాలం......

నిరం: (మధ్యలో అందుకొని కోపంలో) ఆ గడిచిపోయిన గాథలతో నన్ను విసిగించకు!

వృద్ధు: (ప్రాధేయ పూర్వకంగా) నా మొర వినండి చినబాబూ! నన్నీ ముసలి వయస్సులో ప్రశాంతంగా ప్రాణాలు వదలనివ్వండి బాబూ!

నిరం: నువ్వు ప్రాణాలు వదిలితే ప్రపంచానికేమీ నష్టంరాదు. యికపో.

వృద్ధు: నా జీవనయాత్రలో యాభై సంవత్సరాలు పూర్తిగా మీసేవకే అంకితం చేశాను.

నిరం: అందుకు నీకిప్పుడు నష్టపరిహారం కావాలంటావా?

వృద్ధు: వద్దుబాబూ! నష్టపరిహారం ఏమీవద్దు. నన్ను తిరిగి మీ కొలువులోకి తీసుకోండి. అంతేచాలు.

నిరం: నువ్వు నా దగ్గర వుండానికి ఎంతమాత్రం పనికిరావు.

వృద్ధు: (నిరంజన్ కాళ్లు పట్టుకొని) బాబూ! కనికరించండి! నా నోటి దగ్గర తిండి పడగొట్టకండి. నా నలుగురు బిడ్డలు తిండి లేక ఆకలితో మాడి చస్తూవుంటే చూడలేను బాబూ! యీ వృద్ధాప్యంలో నన్ను ఏడిపించకండి. నా కొడుకుకు ఉద్యోగం దొరికేవరకైనా......

నిరం: (కోపంతో ముసలివాణ్ణి విదలించి) ఛీ! వాడిమాట నా దగ్గర ఎత్తకు. వాడు ద్రోహి! దుర్మార్గుడు!

వృద్ధు: బాబూ! జరిగిపోయిన సంఘటనలు ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోండి. మీ తండ్రిగారు మీతోపాటు నా కొడుకును కూడా చదివించి పెంచి పెద్ద చేశారు.

నిరం: అవును! పామును పాలు పోసి పెంచారు!

వృద్ధు: వాడు ఎప్పుడూ మీ కనుసన్నలలో మెలగేవాడు.

నిరం: అవును. మొదటిలో అలాగే జరిగింది. చివరకు నాకు నిలువునా ద్రోహం తలపెట్టాడు. చిన్నప్పటినుంచి యింటిలో వుంటూ అమాయకురాలైన విమలను మోసం చేశాడు. నా ఆస్తిని పంచుపోవడానికి కుట్రపన్నాడు. వానిని నిలువునా చీల్చినా పాపం లేదు.

వృద్ధు: శాంతించండి చిన్నబాబూ! ఒక వైపునుంచి చూస్తే న్యాయంకనిపించదు రెండువైపులనుంచి చూడండి. న్యాయాన్యాయాలను నిర్ణయించండి. నా కొడుకు నిర్దోషి అని ......

నిరం: (కోపం పట్టలేక బలం కొద్దీ ముసలివాణ్ణి కొట్టి) నోర్muయ్!

వృద్ధు: (చెక్కిలిని చేతితో పట్టుకొని) ఏభై సంవత్సరాల నిష్కల్మష సేవకు యిది ప్రతిఫలం!–కళ్లు పూర్తిగా తెరవని యవ్వనంలో వున్నావు చిన్నబాబూ! యిక నిన్ను దేవుడే రక్షించాలి. వస్తాను చినబాబూ!

(వృద్ధుడు దైన్యంతో నిష్క్రమిస్తూ వుండగా రంగస్థలాన్ని తిరిగి అంధకారం ఆవరిస్తుంది.)

దినకర్: (ప్రశాంతస్వరంతో) మానవుడా! జీవితంలో నువ్వు పూర్తిగా మోసపోయావు. జీవితయాత్రలో అడుగడుగుకు నీకు నీలితెరలు అడ్డువస్తూ వున్నాయ్. వాటిని తప్పించుకొనిముందుకుపోతున్నావు. అలా ఎంతకాలం నిర్విరామంగా పోగలవు మనిషీ? నేటికి నీవు అలిసిపోయావు. చిరంజీవి మానవుడా నీకు యీ రంగస్థలం నుంచి నిష్క్రమించే సమయం ఆసన్నమయ్యింది. యిక నీ ముందు కన్ను పొడుచుకున్నా కానరాని గాఢాంధకారం. నీచుటూ దట్టమైన నీలితెరలు.

(హాలులో మసకవెలుతురు కనిపిస్తుంది. ఆ

వెలుగులో చిత్తచాంచల్యంతో తిరుగుతున్న నిరంజన్ అతని వెనుక నీడలాతిరిగే నల్లటి మానవాకారం అస్పష్టంగా కనిపిస్తారు. నిరంజన్ ఎటు కదిలితే నల్లటి నీడవంటి మనిషికూడా అటేకదులుతున్నాడు. అతను ఆగితే నీడకూడా ఆగుతోంది.)

నిరం: (కోపంతో బిగ్గరగా) ఎవరు నువ్వు? ఎందుకు నావెనుక తిరుగుతున్నావ్? (జవాబు రాకపోవడం చూసి మరింత కోపంతో) మాట్లాడవేం? నన్ను నీడవలె వెన్నంటుతున్న నువ్వు ఎవరవు?

కిశోర్: (ఆకస్మికంగా నిరంజన్‌ముందు కనిపించి) అతకు యమధర్మరాజు. నవ్వు చేసిన దుర్మార్గాలకు, దురంతాలకు అతడు ప్రత్యక్షసాక్షి.

నిరం: (హేళనగా) యమధర్మరాజు!! (కిశోర్ వైపు కళ్లెర్రజేసి చూస్తూ) నువ్వు యిలా రావడానికి కారణం?

కిశోర్ (బాధగా) నా తండ్రిని-తన జీవిత సర్వస్వం మీసేవకు అంకితంచేసిన నా ముసలితండ్రిని-శిక్షించడానికి కారణం?

నిరం: నాసేవకుని శిక్షించేహక్కు నాకు వుంది.

కిశోర్: నాతండ్రి పరాభవానికి ప్రతీకారం తీర్చుకొనేహక్కు నాకు వుంది.

నిరం: కష్టాలను కౌగలించుకోవడానికి ముచ్చటపడుతున్నావా?

కిశోర్: కష్టసముద్రంలోనిర్విరామంగా ప్రయాణం సాగించేమనిషి కొత్తకష్టాలకు వెనుకాడడు.

నిరం: వృథాప్రసంగం కట్టిపెట్టి మర్యాదగా నువ్వు వచ్చినదారినే వెళ్లు.

కిశోర్: నేను వచ్చిన దారి అప్పుడే మూయబడినది. యిక నేను తిరిగిపోవడానికి దారిలేదు,

నిరం: చివరకు యీ పద్మవ్యూహంలో చిక్కుకున్నావ్. యిక నీవు జీవితాశ వదులుకోవలసి వుంటుంది.

కిశోర్: (హేళనగా) జీవితాశ!-అది ఏనాడో వదులుకున్నాను. నామాటకేం.నిన్ను నీవు పరిశీలించి చూసుకో. నీవెనుక దండధరుడు పొంచివున్నాడు. నీపాపాలకు శాశ్వతపరిష్కారాన్ని అతడు ప్రసాదించగలడు.

నిరం: నువ్వు నాసేవకుని కొడుకువై వుండే నీతలకుమించి మాట్లాడుతున్నావ్.

కిశోర్: నువ్వు నిర్మించుకున్న సమాజంలో యజమానికి సేవకునికి విభేదం వుండవచ్చు. మృత్యువుకౌగలిలోమాత్రం యిద్దరికీ ఎట్టిభేదమూ లేదు.

నిరం: యింతవరకూ నీనేరాలను నేను క్షమిస్తూవచ్చాను. యిక నీ దుండగాలు...

కిశోర్: (మధ్యలో అందుకుని) ఏమిటా నేరాలు?

నిరం: బాల్యంనుంచీ మా యింటిలో వుంటూ మాకు తీరనిద్రోహం తలపెట్టావు.

కిశోర్: అక్కడే పొరబాటు పడుతున్నావు. ప్రమాదాన్ని ముందే గుర్తించి మీ యిల్లు విడిచిపోయాను — సమాజంలో నాకు వున్న స్థానం ఎటువంటిదో నాకు తెలుసు. మీరు వుంటున్న అంతస్థు వైపు కనీసం చూడడానికైనా నాకు అర్హత లేదు.

నిరం: ఇప్పటికైనా నువ్వు కళ్లు తెరచినందుకు సంతోషిస్తున్నాను.

కిశోర్: నేను ఏనాడో కళ్లు తెరిచాను. నువ్వు యీనాటికీ కళ్ళు మూసుకొని కూర్చున్నావు.

నిరం: (కోపంతో) నాలోని క్రోధాగ్నిని రగిలించకు. ఇక వెళ్ళిపో! నా కంటికి తిరిగి కనిపించకు!

కిశోర్: కేవలం మీ దాస్యంకోసం, మీ సంతృప్తికోసం నాలోని కోరికలను, ఆశలను ఇంతవరకూ చంపుకున్నాను. ఇంకా నీకు తృప్తి కలగలేదా? ఇక వెళ్ళిపొమ్మంటావా? జీవితంనుంచి నన్ను నిష్క్రమించమంటావా? నీ ఆనందం కోసం.........

నిరం: (అసహనంతో) ఇక ఆపుచెయ్యి! ఈ ప్రశాంతమైన రాత్రిని......

కిశోర్: (మధ్యలో అందుకొని ఆవేశంతో) ప్రశాంతమైన రాత్రి!! నీవంటిపెట్టి పుట్టినవాళ్లకిది ప్రశాంతమైన రాత్రి. నావంటి గర్భదరిద్రుల పాలిటి కాళరాత్రి ఇది. నా జీవితం......

నిరం: (మధ్యలో అందుకొని) ధనవంతులమీది అసూయను చంపుకో!

కిశోర్: దరిద్రులపట్లగల నిరసనభావాన్ని తొలగించుకో?

నిరం: (కోపంతో) నాలోని అసహనాన్ని రెచ్చగొట్టకు.

కిశోర్: ఆదినుంచీ నీలోని అసహనం పడగ విప్పుకొని ఆడుతోంది. అది మాబోటి అభాగ్యుల నెందరినో తన విషపు కోరలతో గాయపరచింది. ఇంకా దానికి తృప్తి కలగలేదు. ముందుకు......

నిరం: (కోపంలో మైమరచి కుర్చీని రెండు చేతులతో పైకెత్తి కిశోర్ తలకు గురిచూసి) నేటితో నీ జీవితం సమాప్తం!

(నిరంజన్ చేతులలోని కుర్చీ కిశోర్ తలపై బడుతున్న సమయంలో మేడమెట్ల మీద ఆకస్మికంగా చిత్ర కనిపిస్తుంది.)

చిత్ర: (భయంతో) ఆగు! (తొందరగా

(55-వ పేజీ చూడండి)

నల్లమచ్చల తెల్లపిల్లి

కోటమర్తి భ్రమరాంబ

ఆ పిల్లి మొఖం తెల్లగా వుంటుంది. కాళ్లు సగంవరకూ తెల్లగా వుంటాయి. మిగతాది అంతా నలుపే. అంటే వీపు, చెవులు, కాళ్లు కొంత మేరా, తోక, అంతా నలుపే. దానికి వున్న నల్ల భాగమే ఎక్కువ. కానీ అది నల్లపిల్లి అనడానికి వీలులేదు. అంటే వాళ్ళు ఒప్పుకోరు. అది దీక్షితులుగారి పిల్లి. నల్లపిల్లి అంటే ఆయనకు చాలా కోపం వస్తుంది. దానికి అక్కడా అక్కడా నల్లటి మచ్చలున్నాయి కాని అసలు అది తెల్లపిల్లి అంటారాయన. ఆయన మాటకి తిరుగులేదు ఆయనకి అది అంటే చాలాముద్దు. మజ్జిగా, అన్నం తినేటప్పుడు ఆయన దానికి ఒక ముద్ద వదిలిపెడతారు. అంతే. అది వంటింట్లోకి రావడానికి వీలులేదు. వస్తే కాళ్లు విరుగుతాయి. దానికి అముర్థ అవతల పడెయ్యవలసిందే.

దీక్షితులుగారికే ఇంకో పేరుంది అగ్గిరాముడని. ఆయనకి ఇప్పుడు 60 ఏళ్లుంటాయి. ఆయన కాపేరు 30 ఏళ్లనుంచివుంది. అంటే ఆ సినిమా రావడానికి చాలా ముందునుంచి అన్నమాట. ఆయనకి 60 ఏళ్ళు; ఆయన పేరుకి 30 ఏళ్ళు. అగ్గిరాముడంటే, అగ్గి అంటే నిప్పు - కోపం ముక్కుమీదవుంటుంది. అందుచేత అందరికీ ఆయనంటే చాలాభయం. ఆయన ఏదంటే అది నిజంగా ఇష్టంలేకపోయినా ఒప్పుకు తీరవలసిందే. ఈ 60 ఏళ్లాయి ఆయనమాట అలాగే చెల్లుతూంది. ఆయన చాలా గొప్ప పండితుడు. గుక్క తిప్పకుండా ఎన్నినా శ్లోకాలు చదవగలడు. ఎన్నైనా తిట్లకూడా తిట్టగలడు. అలాటి అగ్గిరాముడికి ఆయన తమ్ముడికీ 30 ఏళ్ల క్రిందట దెబ్బలాట వచ్చింది. అది ఆస్తి పంపకాలలో. అంటే తమ్ముడేమీ దెబ్బలాడలేదు. దెబ్బలాట అంతా దీక్షితులుగారే ఆడేశారు. ఆడేసి ఇల్లు, భూమి పంపకాలు చేసేశారు. ఇంటి భాగానికి గోడలు అడ్డు పెట్టించేశారు. పెరటిలో నూతికి కూడా మధ్యగోడ పెట్టించేశారు. అంటే ఒకళ్ల మొఖా లొకళ్లకి కనిపించకుండా చేసేశారు. పెరట్లో నూతిదగ్గిరికి వెళ్ళినా ఒకళ్ళమొఖా లొకళ్లకి కనుపించవు. ఆ నూతిలో నీళ్ళు అసలే కనుపించవు. అవి పాతాళంలోనే ఉన్నాయి. అంచేత నూతిలో నీళ్లలో నీడకూడా కనుపించదు. వీధులోకి వెళ్లినా ఒకవేళ తమ్ముడు ఎదురువస్తే దీక్షితులుగారు గభుక్కుని వెనక్కి తిరిగిపోతారు. ఆయనకళ్ళు ముందుకుండడంచేత వెనకనున్న తమ్ముడు కనిపించడు.

అలాంటి దీక్షితులుగారి పిల్లి ఆ నల్లమచ్చల తెల్లపిల్లి. అంచేత దానిని నల్లపిల్లి అనడానికి వీల్లేదు. అంటే అగ్గిరాముడికి ఆహుతి అవవలసిందే. ఆయన మాట కాదని బతకడం కష్టం అని ఇదివరకే చెప్పాను కదూ. ఇంతాచేసి ఆ పిల్లి అందరిదీని. అంటే అందరిళ్లలోనూ తిరుగుతుంది. అందరిళ్లలోనూ పాలూ, పెరుగూ తాగుతుంది. దొరికితే ఎలకల్ని కూడా తింటుంది. కానీ అవి సాధారణంగా దొరకవు. వాటిని గురించి అది అంత బాధపడదు. కానీ పాలూ, పెరుగూకోసం చాలా తంటాలుపడుతుంది. మేము రోజూ పాలుతాగే వేళకి మా ఇంటికి వస్తుంది. గ్లాసు క్రిందపెట్టేదాకా ఓపిగ్గా కాసుక్కూచుంటుంది. గ్లాసు క్రిందపెట్టగానే గ్లాసులో అడుగునవున్న పాలు ముందుకాలు గ్లాసులోముంచి, మజ్జిగా అన్నం జుర్రినట్లు జుర్రుతుంది. మేము రోజూ తప్పక కొన్నిపాలు దానికోసం వుంచుతూ వుంటాము. ఒకవేళ గ్లాసు వేగిరం పెట్టకపోతే (మ్యావ్) అంటుంది. అంటే నాకు అవతల చాలాపనుంది గ్లాసు వేగం ఇవ్వకపోతే ఎలాగాఅని. అది ఒక్కరోజు రాకపోతే మాకేమీ తోచదు.

ఆ నల్లమచ్చల తెల్లపిల్లి, అంటే దీక్షితులుగారిపిల్లి, ఆవేళ దీక్షితులుగారు భోంచేస్తూ వుంటే దానిమజ్జిగా ముద్దాకోసం వెళ్లి గుమ్మంలో కాసుక్కూచుంది. కానీ ఆవేళాయన అగ్గిరాముళ్లా వున్నారు. కూరలో ఖారం ఎక్కువయిపోయింది. కళ్లలో నీళ్ళు తిరుగుతున్నాయి. ముక్కుల్లో నీళ్ళు కారిపోతున్నాయి. ఆయనపెళ్లాం ఎప్పుడూ వెధవ్వంట చేస్తుంది. 40 ఏళ్లనుండీ కాపరం చేస్తూన్నా మొగుడికి ఎలాగచేస్తే బాగుంటుందో ఇప్పటికింకా తెలియదు. ఇంక తెలిసేదేమిటి? ఈజన్మకింతే. ఇలావుంది లోపల వరుస. గుమ్మంలోకూర్చున్న పిల్లికి తొందరగావుంది. ఆకలవుతోంది. వేళ చాలా అయిపోయింది. ఇంకా అవతల బోలెడుపనులున్నాయి. ఎంతోసేపు ఇక్కడ కూర్చుంటే ఎలాగ. కానీ ఏంచేస్తుంది. అడగడానికిలేదు. దీక్షితులుగారి కోపం దానికి కూడా తెలుసు. ఒకసారి ఆయన చేతిలో దాని ముక్కు విరిగింది. మూడురోజులు కుంటింది. అంచేత మ్యావ్ అనదు. అంటే మళ్లీ విరుగుతుంది. చూసిచూసి ఎంతకీ ముద్ద పడకపోతే ఏమోఅని, చూద్దామని లోపలికి అడుగు పెట్టింది. పెట్టిందోలేదో ఆయన కళ్ళ పడింది. ఇంకేముంది. అసలే అగ్గిరాముడు. "హాంఫ్ మాధచ్చోదు ముండా" అన్నారు. ఇంకా అనకుండానే, పక్కనున్న గ్లాసు ఎడంచేత్తో తీసి దానిమీదికి విసిరారు.

కానీ ఆయన గ్లాసు తీసి, విసిరి, అది మీద పడేదాకా అది వుంటుందా. ఛంగున గెంతి పెరట్లోకి పరిగెత్తింది. వెనక్కి తిరిగి చూడలేదు. చూస్తూవుంటే మీద ఏమివచ్చి పడుతాయో మరి. గెంతి పరుగెత్తి పెరట్లోకి వెళ్ళేసరికి ఇంకేముంది. చుట్టూ పెద్ద ఎత్తయిన ప్రహరీగోడలు, మధ్యలోమాత్రం నుయ్యి, దానికి సగానికి వేసిన అడ్డుగోడా వున్నాయి. పిల్లికి ముందుచూస్తే నుయ్యి, వెనకచూస్తే దీక్షితులుగారూ. ఈ దీక్షితులుగారికన్నా

అనుర్యో వయ తుసుకున్నట్టుంది. నూతిగోడ మీదనుంచి గెంతింది. మధ్యలో నూతిలో పడింది.

ఇంతలో దీక్షితులుగారు పిల్లిని కొడదామని పరిగెట్టుకుంటూ పెరట్లోకి వచ్చారు. వచ్చి పిల్లి నూతిలో పడడం కళ్లారా చూశారు. (హమ్మోర్ముండా) అన్నారు. దీక్షితులుగారి పెళ్లాంకూడా వెనకాతే వచ్చింది. (అయ్యో) పిల్లిచస్తే బ్రహ్మహత్య అంది. దీక్షితులు గారికోపం వెంటనే పోయింది. అగ్గిరాముడు అయిస్ రాముడు అయిపోయాడు. పిల్లేమయిందోనని నూతిదగ్గరికి వెళ్లి ఇద్దరూ చూశారు. అప్పటి కప్పుడే నూతిలో అట అడుగునున్న నీళ్లలోపడ్డ నల్లమచ్చల తెల్లపిల్లి ఈదుకుంటూ వడ్డుకి వచ్చింది. ఒడ్డునున్న ఒక పెద్దబండమీదకి మెల్లిగా చేరుకుంది. ఒళ్లు దులిపేసుకుంది. తోక ఝాడించేసింది. బండపక్కనున్న ఒక కన్నంలోకి దూరింది. అదికూడా దీక్షితులు గారి ఇంటివేపే, తమ్ముడిగారి ఇంటివేపు కాదు. మరి అది దీక్షితులుగారి పిల్లి. ఇది అంతా దీక్షితులుగారూ భార్యా చూశారు.

ఇంక దీక్షితులుగారి భార్యకి సమయం దొరికింది! ఇంతసేపూ వున్నకసి తీర్చుకోడానికి అదేమిటండీమీకోపంబంగారంగానూ నోరులేని పిల్లిముండమీద అంతకోపమా! మీ సోహ్యకి వునూరుమని ఆ ముండ నూతిలో పడే చచ్చును. ఎంతపని అవును. పిల్లి బ్రహ్మహత్య! ఇన్నేళ్లూ వచ్చి ఇంతచదువూ చదివి అంతకోపమయితే ఎలాగండి? అని అక్కసు తీర్చుకుంది. ఇంక పిల్లిని నూతిలో నుంచి తియ్యాలి లేకపోతే అది ఛస్తుంది. పిల్లిచస్తే బ్రహ్మహత్య! పండితుడయిన దీక్షితులుగారు పిల్లిని ఎలాగేనా బతికించి మహాపాతకంనుంచి తప్పించుకోవాలి. ఎలా పిల్లిని తియ్యడం? ఆలోచించి మెల్లిగా తాడుతో బాల్చీ నూతిలో గోతివేపు దింపేరు. పిల్లి బాల్చీలో దూరి కూర్చుంటే నీళ్లు తోడినట్టు తోడి పారేయొచ్చని. బాల్చీదగ్గరకు వచ్చేసరికి పిల్లి తెల్లటి రెండుకాళ్లూ ముందుకి చాచింది. తలపైకెత్తి చూసింది చూసేసరికి దీక్షితులుగారి మొఖం ఆత్రంగా చూస్తూ కనిపించింది. దానికి భయంవేసింది. మళ్లీ ఆయన వీగ్గాసు మీద విసురుతాడో అని లోపలకి పారిపోయింది. ఈ దీక్షితులుగారి చేతులో పడ్డంకన్నా ఆ నూతిలోవున్న గోతిలో వుంటేనే నయం అనుకుంది. పాపం పిల్లి కేంతెలుసు దీక్షితులుగారి కంగారు!

ఇలా బాల్చీవేసి పిల్లిని తియ్యాలని దీక్షితులుగారు భార్య పావుగంట తంటాలు పడ్డారు. లాభం లేకపోయింది. ఉపాయం తోచడంలేదు. పాపం నెత్తిముండ ఒక్క ముద్ద అన్నంకోసం వస్తే ఎంతపనయిపోయింది! అన్నంలేదు సరికదా ఎంతాక

★ నల్లమచ్చల తెల్లపిల్లి ★

లేస్తూందో! పైకివస్తే వెట్టిముండకి కడుపునిండా పెరుగుఅన్నం పెట్టవచ్చు. కానీ రాదే వెధవ. అది కత్తు కట్టినట్లుంది. పైకి రాకుండా అలాగే నూతిలో వుండి, తిండి లేకుండా మలమలమాడి చచ్చి ఆ మహాపాతకం దీక్షితులుగారి మెడకి చుడదామని చూస్తూంది. కానీ మహాపండితుడైన దీక్షితులుగారు ఇలాంటి మహాపాతకానికి వప్పుకుంటారా! ఇది నూతిలోంచి పైకి రాకపోయినా చావకూడదన్నమాట. దానికి వుపాయం ఆలోచించారు. పిల్లి పైకిరాకపోయినా అన్నమే పిల్లిదగ్గిరకు పంపుతే! తింటుంది చావదు. తరువాత ఎలాగో వుపాయంచేసి పైకి తీయవచ్చు. ఒక చిన్న బుట్టలో పెరుగూ అన్నం పెట్టారు. చాలా అన్నం పెట్టారు. అంటే రోజూ ఆయనవేసే ఒకముద్దకాదు. ఆయనకీ తెలుసు అది ఆముద్దతోనే బ్రతకడంలేదని. అంచేత చాలా అన్నం కలిపి బుట్టలోపెట్టి బుట్టకే తాడుకట్టి నూతిలోకి దింపారు. అన్నం చూడగానే పిల్లి ముందుకు వచ్చింది. రెండు కాళ్లూ బుట్టలో పెట్టింది. అన్నం అంతా గబగబ తినేసింది. ఆకలిమీ గుందేమొ! "కానీ ముండ రెండుకాళ్లే బుట్టలో పెట్టింది. మిగతా రెండూ కూడా పెట్టి, బుట్టలో కూర్చుంటే తోడెయ్యొచ్చు" అనుకున్నారు దీక్షితులుగారు. "కానీ పైకివస్తే మళ్లీ ఈయన చేతిలో పడాలి. ఇదే నయం. బాగా ఎప్పుడూ పెట్టనంత అన్నం పెట్టారు. హాయిగా తినేసి ఇక్కడే కూర్చుంటే నయం. పైకి వచ్చేం చెయ్యాలి. అన్నమా? చచ్చినట్లు ఆయనే పెడతాడు" అనుకుంది. పిల్లి రెండుకాళ్లే బుట్టలో పెట్టింది. బుట్ట లాగితే మళ్లీ నూతిలో నీళ్లలో పడిపోతుంది. ఎలాగో ఒకలాగ అది బ్రతికితే అదే పదివేలు. ఏదో ఇప్పటికి కొంత బాధ తగ్గింది. అన్నం తిన్నాది. మూల కూర్చున్నది. ఇంక ఫరవాలేదు. మెల్లిగా ఎవరినేనా పిలచి దానిని తీసే వుపాయం చూడవచ్చు అనుకున్నారు దీక్షితులుగారు. రెండురోజులు దీక్షితులుగారు ఎన్నో విధాల ప్రయత్నం చేసినా పిల్లిని బయటికి తీయలేకపోయేరు. పిల్లి మాత్రం కడుపునిండా అన్నం తిని నూతిలో వున్న గోతిలో హాయిగా వుంది. దీక్షితులుగారు ఇంక వేరే గత్యంతరంలేక ఏనాది రాముడు దగ్గిరకి బయలుదేరారు. కష్టపడి వాణ్ని పట్టుకుని, ఇంటికి తీసుకువచ్చి, నూతిని పిల్లిని చూపించేరు. వాడిప్పుడు ఈ సందర్భంలో ఒక నిపుణుడు అయి కూర్చున్నాడు. వాడు ఎలాగైనా ఆ నూతిలోంచి ఆ పిల్లిని తెస్తేనే దీక్షితులుగారికి మోక్షం. లేకుంటే పిల్లిచస్తే బ్రహ్మహత్య మహాపాతకం. ఏనాదిరాముడు నూతికేసి చూశాడు. దీక్షితులుగారికేసి చూశాడు. పరిస్థితి అర్థమయింది. 'ఏమిస్తారూ' అన్నాడు. 'అడుగు ఏం కావాలో' అన్నారు దీక్షితులుగారు. 'ఒక రూపాయి' అన్నాడు ఏనాది రాముడు. 'హారి ఒకసారి నూతిలో దిగి పిల్లిని తీసెయ్యడానికి రూపాయా.' ఒక్క పావలా ఇస్తానన్నారు. గిరుక్కున వెనక్కి తిరిగాడు ఏనాది రాముడు. 'ఒరే వెధవా' అలా వెళ్లిపోతావేంరా ఏం కావాలో చెప్పుమరి!' అన్నారు దీక్షితులుగారు. 'చెప్పేనుగా' అన్నాడు రాముడు. వాడికి తెలుసు ఎలాగా దీక్షితులుగారు పిల్లిని తియ్యందే వెళ్లనివ్వరని. 'అంతేనా మరోమాటుందా?' అన్నారు ఆయన. లేదు అన్నాడు వాడు ఖచ్చితంగా." ఒరే వెధవా! రూపాయి ఎందుకు, నీకు కడుపునిండా అంటే నువ్వు తిన్నంత అన్నం పెట్టిస్తాను. ఒక పావలా ఇస్తాను తీసెయ్యరా" అన్నారు దీక్షితులుగారు. ఆయన గాదె నిండా ధాన్యం, కావలిసినంత అన్నం పెట్టగలరు. కానీ డబ్బు మాత్రం ఇవ్వడం ఇష్టం లేదు ఆయనకి.

"ఎందుకు బాబూ, ఒక రూపాయ ఇచ్చెయ్యకూడదా?" తరువాత కావలిస్తే అన్నం కూడా పెట్టండి. వెధవ కావలిస్తే అన్నంకూడాపెట్టాలిట. ఎవరికికావాలి స్తేనో? నాకో? వాడికో? అనుకున్నారు దీక్షితులుగారు. కానీ ఆయనకీ తెలుసు. వాడికి అడిగింది ఇస్తేకాని వాడు తియ్యడు. వాడుత్త మూర్ఖుడు. అదితియ్యకపోతేపిల్లిచస్తే బ్రహ్మహత్య మహాపాతకం! దానికి శాంతి, అన్నదానం, డబ్బుఖర్చు, చాలా బెడద వుంది. ఇంక లాభంలేదు. సరేలే వెధవా! నువ్వన్నట్లే రూపాయి ఇస్తాను తియ్యి" అన్నారు.


ఏనాది రాముడు పెద్ద ఎక్స్‌పర్ట్. అందుకు పూనుకున్నాడు. తలపాగా తీసేశాడు. చొక్కా విప్పేశాడు. పంచె గ్గట్టేడు. పెద్ద మోకుతాడు తీసుకున్నాడు. దానికి మంచి జారుముడి ఒకపక్క వేసేడు. అది దగ్గరున్న స్తంభానికి కట్టేడు. తాడు మరోకొసకి పెద్ద బుట్ట కట్టేడు. బుట్ట నూతిలోకి మెల్లిగా దింపేడు. దీక్షితులుగారు దగ్గిరుండి ఇది అంతా చూస్తున్నారు. బుట్టెందుకన్నారు. పిల్లిని ముందు బుట్టలో కూర్చోపెట్టేస్తాను. తరువాత దానిని బుట్టతో పయికి తీసేస్తా. దాన్ని చేత్తో పట్టుకుని మరి పైకి ఎక్కడం ఎలాగా అన్నాడు. బాగుంది ఉపాయం అనుకున్నారు దీక్షితులుగారు.

బుట్ట నూతిలో దిగింది. పిల్లి చూసింది. కాళ్ళు ముందుకి పెట్టింది. తల పైకి తిప్పి చూసింది. పైని ఏనాది రాముడు కనిపించాడు. ఫరవాలేదనుకుంది. అగ్గిరాముడు లేడు. ధైర్యం వచ్చింది. పెళ్లికూతురులా కాళ్లు ముడుచుకుని తల వంచుకుని బుట్టలో కూర్చుంది. ఏనాది రాముడు కొంచెం నిదానించాడు. 'పంతులుగారూ మీరు లోపలికి పోయి తలుపులు వేసుక్కూర్చోండి, పిల్లి చాలా కసిమీద వుంది. పైకిరాగానే దగ్గర ఎవరేనా కనిపిస్తే గుడ్లు పీకేస్తుం దన్నాడు. దీక్షితులుగారు లోపలికి పరిగెత్తేరు. తలుపులు బిడాయించేరు. కిటికీ దగ్గర నిలబడి చూస్తున్నారు. ఏనాదివాడు నెమ్మదిగా, జాగ్రత్తగా, పిల్లి మళ్ళీ జారిపడకుండా, తోడుతున్నాడు. పిల్లి పెళ్ళికూతుర్లా బుట్టలో కదలకుండా, తల ఎత్తకుండా కాళ్లు ముడుచుకుని కూర్చుంది.

బుట్ట పైకివచ్చింది. చుట్టూ ఎవరూ లేరు. ఏనాది రాముడు మాత్రమే వున్నాడు. ఫరవా లేదు వాడు మనవాడే అనుకుంది. ఇటూ అటూ చూసింది. బతుకు జీవుడా అనుకుంది. ఒక్క వుగుకు వురికింది. వీధిలోకి పరుగు తీసింది. దీక్షితులుగారు కిటికీలోనుంచి పిల్లిని చూశారు. బతుకు జీవుడా అనుకున్నారు. అది అవతలికి పారిపోయింది. ఇక ఫరవా లేదు. తలుపుతీసుకు వచ్చారు. రాముడు బుట్ట తాడు విప్పేడు. చొక్కా తొడుక్కున్నాడు. తలపాగా పెట్టుకున్నాడు. 'తెండి' అన్నాడు. 'ఏమిమ్మంటావు' అన్నారు. పంతులుగారూ మళ్ళీ అడుగుతున్నారా అన్నాడు ఏనాదివాడు. 'ఆ' వెధవా ఎంత కష్టపడ్డావు, నువ్వు నూతిలో దిగేవా ఏమైనానా అదే వచ్చేసింది కదా? అన్నారు. ఎలాగైతే నేమి, దాన్ని పైకి తీశానుకదా, అంచేత రూపాయీ ఇవ్వవలసిందే అన్నాడు. వాడితో ఏమిటండి ఇచ్చి పంపించెయ్యక అన్నారు దీక్షితులుగారి భార్య. అంత అగ్గిరాముడూ ఏనాది రాముడితో చాలలేకపోయారు. ఆయన పాండిత్యం, కోపం, పలుకుబడీ, వాడిముందు ఎందుకూ పనికి రాలేదు. దీక్షితులుగారు రూపాయి ఇవ్వక తప్పిందికాదు. ఏనాది రాముడు ఇంకా నిల్చున్నాడు. అమ్మా కొంచెం అన్నం పెట్టించండమ్మా అన్నాడు. వాడికి తెలుసు పంతులుగారికన్నా అమ్మగారు నయం అని. ఆవిడ పెట్టింది. వాడు తిన్నాడు.

ఇంక పిల్లి సంగతి. అది మళ్ళీ దీక్షితులుగారింట్లో కాలు పెట్టలేదు. ఇక అది దీక్షితులుగారి పిల్లి కాదు. అంచేత ఇప్పుడది నల్లపిల్లే! నల్లమచ్చల తెల్లపిల్లి కాదు. ★

అపర బుద్ధి



[గతవారం తరువాయి]

అర్ధరాత్రివేళ రైలుగోడ్డుకంటే చీకటిగా వుండే ప్రదేశం మరొకటి వుండదేమొ. రైలు వేగంగా వెళ్ళిపోయింది. క్రిందపడి నేను కొన్ని నిమిషాలవరకు అట్లాగే వున్నాను. ఎత్తుగావున్న రైలుకట్ట దాటి ప్రక్కగావున్న కాలిబాట చేరాను. అక్కడ ఎవ్వరూ నన్ను చూసే అవకాశమే లేదు. చుట్టుప్రక్కల తేరిపార చూశాను. సమీపంలో మట్టిరోడ్డు, ఆ రోడ్డు పక్కగా రెండు చిన్న ఫ్యాక్టరీలు, నిర్మానుష్యంగా వున్న ఖాళీ ప్రదేశాలు కనపడ్డవి. ఆ ప్రాంతాలలో ఎక్కడా దీపపు వెలుతురన్నమాట కనపడటం లేదు. చీకటి దట్టంగా వుంది. ఆమె ఇక్కడికి వచ్చివుండాలి. రైలు కదలటానికి ఏడు నిమిషాలు ముందుగానే ఆమె బయలుదేరింది. కారు, మట్టిరోడ్డుమీదికి రావటానికి పదినిమిషాలకంటె ఎక్కువ పట్టదు. సమీపంలో ఎక్కడైనా కారు ఆగించేమోనని పరిసరాలన్నీ కలయచూశాను. నాకు కారు నిలిచినట్టు కనబడలేదు.

అక్కడ ఎంతసేపు నేను నిరీక్షించానో నాకే బాగా తెలియదు. కారు నడపటంలో మార్గంలో ఏదైనా ప్రమాదం జరిగిందేమోనని లోనే గుంటలో నీళ్ళు కనబడుతున్నవి. అటు వైపుగా వెళ్లి మట్టిరోడ్డుమీద నడక సాగించాను.

నా వెనుక అడుగుల చప్పుడు వినిపించింది. వెనుకకు తిరిగిచూశాను. ఎవరూ కనబడలేదు. కొన్ని నిమిషాలు అక్కడే నిలబడిపోయాను. అడుగుల చప్పుడు ఇంకా దగ్గరగా వినపడింది. తలకు గుడ్డకట్టుకుని ఒక నల్లటి స్వరూపం నన్ను సమీపించింది. నాకు భయం వేసింది. అదేదో దెయ్యం నన్ను తరుముకు వస్తూన్నట్లు తోచింది. రెండు నిమిషాలలో ఆ స్వరూపం నా దగ్గిరకు వచ్చి నిశ్శబ్దంగా చేతిని గట్టిగా పట్టుకుంది. వెంటనే పెద్ద కేక పెట్టేవాడినే. కాని ఇంతలోనే ఆ ముఖం నాకు బాగా కనపడింది. ఆమె కోమలం. ఆమె గుండెలు గట్టిగా కొట్టుకుంటున్నవి. ఆ ధ్వని, ఆమె ఒగర్పులో లీనమైంది.

"అతణ్ణి కారులోనుంచి నేనొక్కర్తెను దించలేను. నాకు చాల భయంగా వుంది," అంది.

"నేనున్నానుగా! ఇంకా భయందేనికి?" అన్నాను.

ఇద్దరం కారు దగ్గిరకు వెళ్ళాము. ఆమె కారు వెనుక తలుపు తెరిచింది. కారులోనుంచి అతణ్ణి క్రిందికి దించాము. ఒక విరిగిన కోలకర్ర, ఒక మంచి కోలకర్ర బయటికి తీసుకువచ్చి ఆమె కారు వెనుక తలుపు మూసింది. అతడిశవాన్ని నా వీపుమీద వేసుకుని, బరువుగా అడుగులువేస్తూ, రైలుకట్ట దగ్గిరకు నడిచాను. అతడి తల నా భుజంమీది నుంచి క్రిందికి వ్రేలాడుతూంది. కోమలం నా ప్రక్కగా వస్తూంది. రైలుపట్టాల దగ్గిర ఆ శవాన్ని దించాను. ఆమె స్వెట్టర్ జేబులోనుంచి ఒక చాకుతీసి నాకు ఇచ్చింది. దానితో అతణ్ణి కట్టిన తాడును కోసి, ఆ ముక్కలన్నీ ఆమె చేతికి ఇచ్చాను. చుట్ట వెలిగించి, అతణ్ణి పడుకోపెట్టిన స్థలానికి ఒక అడుగు దూరంలో వుంచాను. విరిగిన కోలకర్ర అతడి దగ్గరగాను, రెండో కోలకర్రను పట్టాలదగ్గరగాను పడవేశాను.

"మనపని ముగించాం; ఇక వెళ్లిపోదాం," అన్నాను.

ఇద్దరము వెళ్లి కారులో కూచున్నాము. ఆమె కారునడిపింది. నా నెత్తిమీదవున్న టోపీ జ్ఞాపకం వచ్చింది. వెంటనే కారు ఆపి దిగి వెళ్లి ఆ టోపీ కూడా రైలు కట్టమీదికి విసిరి పారేసి తిరిగి వచ్చి కారులో కూచున్నాను.

ఆమె కారు చాలా వేగంగా నడపడం మొదలుపెట్టింది. మేము పెద్ద రోడ్డుమీదికి ఇట్టే వచ్చాము. రోడ్డుమీద దీపాలు బాగా వెలుగుతున్నవి.

"ఇక్కడ నేను నీ ప్రక్కన వుండగా రోడ్డుమీద కారు ఆపడం చాలా ప్రమాదం. ఎవరైనా మన ఇదరినీ దీపాల వెలుతురులో

తుమ్మలపల్లి
సీతారామారావు

(42-వ పేజీ చూడండి)

(నాటిక)

పెళ్ళి చూపులు

ముదిగొండ లింగమూర్తి

ప్రదేశం

[రాంబాబుగారి యింట్లో మధ్య హాలిడి —బాగా అలంకరింపబడి వుంటుంది ప్రాయ మైన బొమ్మలు— అందులో పండ్లూ తాంబూలాలువుంటాయ్.

సోఫా సెట్టులో రాంబాబు, కృష్ణా, దాసు కూర్చొని వుంటారు. రామారావు వెనగ్గా నిలబడి పత్రికను చదువుకుంటూవుంటాడు.

వెంకాయ్ అచ్చటున్న కాఫీగ్లాసులను పోగుజేసుకొని లోపలికి తీసుకొని వెళ్ళే ప్రయత్నంలో వుంటాడు—

గడియారం పదిగంటలు కొడుతుంది. రాంబాబు దీన్ని శుభసూచకంగా ఆనందిస్తాడు—]

రాం: శుభం! మా అమ్మాయిని చూశారు. పాటకూడా విన్నారు. మా పిల్లలిద్దరు మహాకట్టుదిట్టంలో పెరిగారు. చదువూ సంస్కారాల్లో లోటంటూ లేదు. (రామారావును చూపిస్తూ) మా అబ్బాయి ఫోర్త్-ఆనర్స్ వరకు వచ్చాడంటే, దాన్నిబట్టి మీకే అర్థమౌతుంది. దాసుగారూ! మరీ మా అమ్మాయి సుందరుండే-అది యిటు పుట్టింటికి అటు మెట్టినయింటికి కీర్తితెచ్చే సౌభాగ్యసుందరంటే నమ్మండి. మీరు సరేనంటే పైయేర్పాట్లన్నీ జరిపిస్తాం దాసుగారూ!

దాసు: ఏరా కృష్ణా! ఏమంటావ్? నీ అభిప్రాయమేమిటో చెప్పు! వారి అమ్మాయి నీకు నచ్చిందాఅని?

కృష్ణ: వారమ్మాయికి మనం నచ్చామా అని?

దాసు: (నవ్వుతూ) రాంబాబుగారూ! ఈ కాలం కుఱ్ఱవాళ్ళతో యింతేనండి యాతన! అందులో మావాడు ఫిలాసఫీ యం. ఎ. అవటంతో వివరాలన్నీ సేకరిస్తే గాని వున్నమాటేదో పైకిచెప్పడు.

రాం: అమ్మాయికి మరో అభిప్రాయమెలావుంటుందండీ? నేను సరేనంటేచాలు! దాన్ని మా అమ్మాయి విధిగా ఆమోదిస్తుంది. మీరేమిటో అనుకుంటున్నారు. రావుబహద్దూర్ రాంబాబంటే యీవూళ్ళోనేగాదు యింట్లోకూడావుంది గౌరవం!

దాసు: సంతోషం! మా అబ్బాయి తృప్తికోసమైనా అమ్మాయిని ఆకాస్త మాటా......

రాం: అడిగితీరాలంటారు! అంతేనా?

దాసు: అదే! అంతమాటెందుకండీ?

పాత్రలు

రాంబాబు: ఇంటియజమాని; (రిటైర్డ్ ఆఫీసర్.)

రామారావు: రాంబాబుగారి అబ్బాయి.

కృష్ణ: పెండ్లిచూపులకు వచ్చేయువకుడు.

దాసు: కృష్ణయొక్క బావ.

సిద్ధాంతి: పురోహితుడు.

సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్:

వెంకాయ్: రాంబాబుగారింట్లో వుండే నౌకరు.

రాం: (మీసం సరిజేసుకుంటూ) ఈ పరీక్ష మా అమ్మాయినికాదు. నన్ను. (రామారావుతో) ఒరేయి రాముడూ! వెళ్ళి చెల్లాయిని అడిగిరా! వారిమాట కాదనటం ఎందుకు?

రామా: (చేతిలోని పుస్తకాన్ని బల్లమీదపెట్టి బయలుదేరుతూ వుంటాడు)

రాం: ఒరేయి వెంకాయ్! (బయకిటి వెళుతూ) నీవువెళ్ళి... (ఇద్దరూ వెళ్తారు)

రామా: (ఆగి, దాసుతో) క్షమించండి! మా చెల్లాయిమాట తెలుసుకుంటేగాని మీ పెళ్ళికొడుకు గారికి నిర్ణయమేదీ యేర్పడదాండీ?

దాసు: అలాకాదనుకో! ఎలాగైనా ఆ రెంటికీ పరస్పరసంబంధంకూడా వుంటుంది. నీకు తెలియందేముంటుంది? ఫోర్త్ ఆనర్స్ కూడా చదువుతున్నావ్!

రామా: ఆనర్స్‌లో యిలాంటి వెందుకుంటాయి? వుంటే ఫిలాసఫీలోవుండాలి!

దాసు: (నవ్వుతూ) మంచిగడుసువాడివోయ్! ఇదిగో రామారావ్! నిన్ను వెళ్ళి అడగమంది మీనాన్నగారు.

రామా: తెలుసుకోవలసింది మీరు. అయినా నాకెందుకు? (వెళుతూ, ఆగి) మా చెల్లాయి వుద్దేశం మీకు చెప్పొచ్చుగదూ?

దాసు: నిరాక్షేపణీయంగా!

రామా: చెల్లాయి సరేనంటే చిక్కేలేదు. "కాదు" అంటేనో?

కృష్ణ: (నవ్వుతాడు)

రామా: అప్పుడూ మీరిలాగే నవ్వుతారా?

కృష్ణ: ఒట్టుచేయిచ్చు!

రామా: (కృష్ణ చేతిని లాక్కొని షేక్‌హాన్డ్ చేస్తూ) నాకు నచ్చావోయిబావా! (లోపలికి వెళుతాడు)

రాం: (వస్తూ) మారాముడింకౌరాలా? (కూర్చొని) చూశారూ దాసుగారూ! కుటుంబంలో పలు విధాలైన అభిప్రాయాలకు, అభిరుచులకుతావంటూ వుండకూడదండి! ఏకమత్యంగా అందరూ కలిసి మెలసి వుండాలి! మాలో వియ్యమందాక మీకే అన్నీ విశదమౌతాయి.

దాసు: అందుకేగదండి ఎన్ని సంబంధాలొచ్చినా త్రోసి రాజన్నది? చిన్ననాటి నుండి మాకృష్ణుడు నాచేతుల్లోనే పెరిగాడు-నాకు మఱదైనా కొడుకైనా వాడొక్కడే! ఆ మూడుముళ్ళూపడితే నా బాధ్యతకూడా తీరుతుంది. చదువు పూర్తిఅయింది. వాడు పదిమందిలో తిరగనేర్చాడు. ఉన్న తాదర్శాలకోసం యే మహత్తరత్యాగమైనా చేయగలమనో స్థైర్యం కలిగింది. ఉన్నమాట చెబితే పొగడ్త అవుతుందేమో! మావాడి స్వభావమేవేరు. ఆడది ఎదుట పడితే తలపైకెత్తడండి. యీనాటి యువకుల్లో యీ సద్గుణంవుండటం అరుదేననుకోండి..

రాం: అదేమిటండోయి? మావాడు-మారాముడు మాత్రం? అసలు వాడికి ఆడదంటే యెట్లావుంటుందో కూడా తెలియదండీ! ఇల్లు వదిలితే కాలేజి-కాలేజి వదిలితే యిల్లు! (నవ్వుతూ) ఇదంతా మనట్రయినింగులో వుంటుందండి.

దాసు: అవుననుకోండి! అయినావాళ్ళ బుద్ధుల్లో కూడా వుంటుందండీ! ఈడొచ్చిన వాళ్ళను మనం పట్టుకుంటే మాత్రం...

(రామారావు వస్తాడు)

రామా: మా చెల్లాయి చెప్పింది!

(వెంకాయ్‌ధర్మాస్ఫ్లాస్కుతో వస్తాడు,

వెం: (రాంబాబు వద్దకు వస్తూ) ఇదో తెచ్చినాబాబు ఓవలెటిన్ను!

రామా: (నవ్వుతూ) ఓవలెటిన్ను ఏమిట్రా నీ మొహం! ఓవల్‌టిన్!

వెం: (గ్లాసులోపోస్తూ) పోనీ సినబాబు! ఏదోటిన్ను! ఆయింగిలిపీసునాకేం తెలుసద్ది?

దాసు: అమ్మాయి అభిప్రాయం...

రామా: ఊటుతాగా! (కృష్ణనిచూచి) పెండ్లికొడుక్కు అంత ఆత్రం అయితే ఎట్లాగ నిదానించాలి!

రాం: (నవ్వుతూ రామారావుతో) అదే మిత్రోయి? కాబోయే బావగారితో యిప్పుడే ఆరంభించావే పరిహాసం?

దాసు: దానికేంలెండి! అమ్మాయి ఏమంటో...

రామా: సరేనండి. చాలాండీ! ఇహ చెప్పండి మీ పెళ్లికొడుకుగా లేమిసెల విస్తారో?

కృష్ణ: (నవ్వి, దాసు చెవిలో చెపుతూ వుంటాడు)

రామా: ఒహోహో! బాగుంది! మ్యాజెన్ మెడికన్ల్లాగా యినో మాడ్రన్ టెలిఫోనా? యింకో ఏమిటో ఆ రహస్యాలు! పిలిచి పిల్లనిస్తాంటె యీ ఫిలాసఫీయం. ఎ. గారికి గుసగుస లెక్కువైనాయె! (చప్పట్లు చరుస్తూ) ఏమండోయి! మిమ్మల్నే!

దాసు: (విసుగ్గా తిరిగి) ఆ! ఏమిటోయి? ఏమిటంటావ్?

రామా: అబ్బే! ఏం లేదండి! (అంటూ వెళ్ళి పేపర్ చదువుతూ వుంటాడు)

రాం: మీ అబ్బాయి వుద్దేశమేమిటో తెలిస్తే పై కార్యక్రమం......

రామా: ఆ! మఱచిపోయాను. అమ్మ చెప్పమందీ...

రాం: ఏమని?



★ పెళ్లిచూపులు ★

రామా: ఇప్పుడే తాంబూలాలు యివ్వ వుంది.

రాం: ఏమంటారు దాసుగారూ! త్వరగా తేలి స్తే...

దాసు: తేల్చటాని కేముంది? మీ మాటను కాదంటాడా మాకృష్ణుడు.

రాం: అయితే తథాస్తు! (లేచి తాంబూలం యివ్వబోతాడు)

దాసు: కాని-ఓ-చిన్న మనవి!

రాం: సెలవియ్యండి.

రామా: కట్నం చాలదేమో!

దాసు: అబ్బే అదేం కాదు! అనుకున్న తర్వాత మాట తప్పుతామా? యీ తాంబూలాల్తో పాటు ముహూర్త నిర్ణయం కూడా జరిపి స్తే బాగుంటుందని నా వుద్దేశం!

రాం: దానికేం? మాగుమాస్తాను పంపి సిద్ధాంతి నిప్పుడే పిలిపిస్తాను (బయటికి వెళుతూ) గోపాలం! గోపాలం! (వెళ్తాడు)

దాసు: కృష్ణా! మనం కూడా పెళ్లికూతు రికి పూలూ పండ్లు చీర రవికా పెట్టటం విధాయకం! బజారుకువెళ్ళి...

కృష్ణ: దానికేం? వెళ్ళి తీసుకొస్తేసరి! (అంటూ పెళ్లికూతురిని చూస్తాడు దూరంగా)

దాసు: (నవ్వుతూ) నీవిక్కడే వుంటా వన్నమాట!

కృష్ణ: (గ్రహించి) రమ్మంటె వస్తా బావా?

దాసు: వద్దులే! వుండు! నేను త్వరగానే వస్తాగా? (వెళ్తాడు)

కృష్ణ: (జేబులోనుంచి సిగరెట్ కేసును తీసి, అందులోని సిగరెట్టును నోట్లో పెట్టుకొని, అగ్గిపెట్టెను వెదికి వెంకాయ్‌తో)

ఇదిగోనోయ్! కొత్త అగ్గిపెట్టె అందు వుంటావ్?

వెం: (ఆశ్చర్యంగా చూసి వెళ్తాడు)

కృష్ణ (రామారావుకు ఒక సిగరెట్టును యిస్తూ) మీ సర్వెంటుకు టేస్టు కూడా వుందే!

రామా: (తీసుకొని) అంతా మా ఫాదర్స ట్రయినింగ్! ఆయనకు పీడో సి. ఐ. డి. గాడు.

(వెంకాయ్ అగ్గిపెట్టెను తెచ్చి కృష్ణుడి కిస్తాడు. వాడిని చూచి రామారావు తనసిగరెట్టును తీసి దాస్తాడు. దీన్ని గమనించని కృష్ణుడు తనసిగరెట్టును వెలిగించుకొని ఆ కాలుతున్న పుల్లను రామారావుకు అందిస్తాడు. రామారావు తటపటాయిస్తూ కాలుస్తాడు)

రామా: నీకు బలేపుణ్యం వుంటుంది! ఈ సంగతి నాన్నగారితో చెప్పకేం?

వెం: ఇదెన్నాళ్ళనుంచి సినబాబూ!

రామా: అబ్బే ఇదేరా బోణీ!

వెం: నన్నే ఏమారుస్తుండావే? అది కాదయ్యా! నేనీయిసయం అరితో సెప్పటం మానాననుకో! దానిపాగ నీకుండేను సెరుపు సెయ్యటం మానుద్దా అని? ఎందుకొచ్చింది? ఇదేవన్నా కూడెట్టుద్దా కడుపునిండుద్దా? కృష్ణుడ్నిచూస్తూ) తాసెడ్డకోతి అడివంతా సెరిసిందంట!

రామా! (లోపల చప్పుడువిని, అదిరిపడి) Excuse me! (సిగరెట్టును క్రింద పడేసి, కాలితో ఆర్పి వెళ్ళబోయి, మళ్ళీవచ్చి ఆసిగరెట్టును తన కాలివేళ్లతో పట్టుకొని కుంటుకుంటూ బయటకు వెళ్తాడు. - కృష్ణుడు విరగబడి నవ్వుతాడు-వెంకాయ్‌కు వళ్లుమండి కృష్ణుడ్ని వుద్దేశిస్తూ వికటంగా నవ్వుతాడు.- కృష్ణుడు వెంకాయ్‌ను తీవ్రంగా చూస్తాడు- వెంకాయ్ నవ్వటం ఆపి)

వెం: అగ్గిపెట్టెను తమరుంచుకుంటారా యింటో యిచ్చెయ్యమంటారా?

కృష్ణు: (అగ్గిపెట్టెలోనుంచి నాలుగు పుల్లలు తీసుకుని) ఇచ్చేయవోయ్! వెధవ అగ్గిపెట్టె నాకెందుకు?

(ఇస్తాడు)

వెం: అవున్లే! ఇంక మీకెందుకు?

(పోబోయి, ఆగి)

ఇంకో రెండు పుల్లలేవన్నా...

కృష్ణు: (నవుతూ) అక్కర్లేదులే! వెళ్లు!

వెంక: ఓయబ్బో! దాష్టీకం సాల వుండదే! (వెళ్తాడు)

(కృష్ణ లేచి వెళ్ళి పళ్లెంలో వున్న పండును తింటూ వుంటాడు)

(C.I. D. పోలీసు యిన్‌స్పెక్టర్ వస్తాడు)

(కృష్ణుడు ఆపండును వదిలేసి, కాలుతున్న సిగరెట్టును వెనగ్గా దాచిచూస్తూవుంటాడు).

ఇన్: (కృష్ణతో) రాంబాబుగారున్నారేమో తెలుసుకోవచ్చా?

కృష్ణ: వారిప్పుడే బయటకెళ్లారు. మీరువెళ్ళి మళ్ళీవస్తే...

ఇన్: ఫరవాలేదు. అందాకావుంటాను. (కుర్చీలో కూర్చుంటాడు).

కృష్ణ: (సిగరెట్టును ఏం చెయ్యటానికి తోచకుండా యిరకాటంలో పడినట్లుగా ఫీలుఅవుతూ) తమరెవరో తెలీదు. అంతసేపు అనవసరంగా మీరు యిక్కడ కూచోటం కంటె...

ఇన్: మీరు సిగరెట్టును కాల్చుకోవచ్చు? నాకేం అభ్యంతరం లేదు.

కృష్ణ: O! Thanks! (ఒక సిగరెట్టును అతివినయంగా ఆఫర్ చేస్తాడు)

ఇన్: (ముఖాన్ని పరకాయించిచూసి, అక్కర్లేదన్నట్లుగా తల తిప్పుతాడు).

కృష్ణ: I am Sorry! (వెళ్ళి కూర్చుంటాడు).

ఇన్: ఇక్కడ యేం పనిమీద దయచేశారో సెలవిస్తారా కృష్ణాగారూ?

కృష్ణ: నాపేరు మీకెట్లా తెలుసు?

ఇన్: మీ యింటినుంచే వస్తున్నాను. మీ అక్కగారు చెప్పారు మీ రిక్కడ వున్నారని!

కృష్ణ: ఇంతకూ మీ రొచ్చిన పని నాతోనా రాంబాబు గారితోనా?

ఇన్: ముందు మీ విషయం తేలితే, వారి సంగతి తరువాత చూడొచ్చు!

కృష్ణ: (ఆలోచించి, Idea వచ్చినట్లుగా తలవూపి) మీరేమైనా సంబంధం మోసుకొచ్చారేమో! అదేం లాభంలేదు. రాంబాబుగా రమ్మాయిని చేసుకుంటానని యిప్పుడే మాటిచ్చాను. (సిగరెట్టును దూరంగా విసిరేస్తాడు - అది లోపలనుంచి వచ్చే వెంకాయ్ మీదపడుతుంది. వెంకాయ్ దాన్ని ఆర్పి, కాలితో తొక్కుతూచాటుగా వుండివింటూవుంటాడు- కృష్ణుడు వెంకాయ్ వచ్చినట్లు చూడడు).

ఇన్: మాటకూడా యివ్వటం అయిపోయింది? చాలావరకు వచ్చింది! పాపం! నీ నిజస్వరూపం తెలిస్తే ఆ అమ్మాయి నీ మొహంకూడా చూడదేమో?

కృ: మాటలు మర్యాదను అతిక్రమిస్తున్నాయి! జాగర్త!

ఇన్: ఆగ్రహంలో పడితే నీవు అగచాట్లపాలవుతావ్!

కృ: Shut up! వూరుకున్నకొద్దీ మితిమీరుతున్నావే? నేను మంచివాడ్నిగనుక మాటతోనే పోయింది. రామారావులాంటి వాడైతే కనీ పాటికి రెండుతగిలేవే!

ఇన్: రామారావున్నాడాయింట్లో?

కృ: నే చెప్పను. యీ వెధవ Enquiries కన్నిటికి ఆన్సర్ చెయ్యటానికి కాదు నే నిక్కడికి వచ్చింది.

ఇన్: అవును. మరో అమాయకురాలి గొంతు కొయ్యటానికి వచ్చావని తెలుసు!

కృ: నోరు ముయ్యి! (అంటూకుర్చీ ఎత్తి కొట్టబోతాడు)

ఇన్: (రివాల్వర్‌ను తీసి, నిర్లక్ష్యంగా ఆడిస్తుంటాడు)

కృ: (అదిరిపడి, ఒక అంగ వెనక్కు వేసి, కుర్చీని మెల్లగా క్రిందపెట్టి, చెమట తుడుచుకుంటూ) మీ రెవ్వరో చెబితే...

ఇన్: (నవుతూ) నీ నరాల్లో ప్రవహించే రక్తం అకస్మాత్తుగా ఆగిపోతుందేమో?

కృ: మీ రెవరైతే నాకేం? నాతో మీకేంపనో త్వరగా చెప్పండి.

ఇన్: (రివాల్వర్‌ను దాచి, ఒక ఫొటోను తీసి చూపిస్తూ) ఈ అమ్మాయిని నీవింకా మఱచిపోలేదనుకుంటాను.

కృ: (చూచి కంగారుపడి, తిరిగి సర్దుకుంటూ) ఎవరో నాకేం తెలుసు? ఆడదాని ముఖం నేనసలు కన్నెత్తైనా చూడను.

ఇన్: ఎంత చదువు చదివి ఏం ప్రయోజనం? నీ వెవరితో మాట్లాడుతుంది తెలుసుకోలేవు. నిజం చెప్పకపోతే ఒకటె మార్గం వుంది. నీ చేతులకు సంకెళ్ళువేసి నేరుగా పోలీసుస్టేషన్‌కు...

కృ: ఆఁ! ఆ అమ్మాయి నాకు తెలుసు.

ఇన్: పేరు?

కృ: కమల!

ఇన్: నీ కామెతో పరిచయ మెప్పు డేర్పడింది?

కృ: కమల ఇంటర్ సెకండ్‌యియర్ చదువుతుండగా!

ఇన్: కమల నిన్ను మొదట నిరాకరించింది?

కృ: అవును.

ఇన్: నీ వామెను పెళ్ళి చేసుకుంటానని ప్రమాణం చేశావ్?

కృ: కాదు. ప్రామిస్ చేశాను.

ఇన్: ఆ ప్రామిస్ అయినా నీవు సదుద్దేశ్యంతో చెయ్యలేదు?

కృ: అప్పుడు సిన్‌సియర్‌గానే చేశాను.

ఇన్: ఆ సిన్‌సియారిటీకి మార్పెప్పుడొచ్చింది?

కృ: (మాట్లాడడు)

ఇన్: నీలో ఆ మార్పు రావడానికి కారణం?

కృ: (మాట్లాడకుండా బాధపడుతూ వుంటాడు)

ఇన్: కమల నీవు చెప్పిన మాటలన్నీ నమ్మింది?

కృ: అవును.

ఇన్: నీ నిజాయితీని నమ్మి, పెళ్ళికాక ముందే నీ ప్రపత్వానికి బలి అయింది?

కృ: (మాట్లాడడు)

ఇన్: తప్పదు. చెప్పాలి! అవునా?

కృ: (అవునన్నట్లు తలాడిస్తాడు.)

ఇన్: అట్లా ఆరు నెలలు గడిచిందనుకుంటాను.

కృ: కాదు. నాలుగు నెల్లే గడిచాయి.

ఇన్: ఆ యేడు కమల fail అవటానికి కారణం నువ్వేకదూ?

కృ: నే నెంతమాత్రం కాదు. పాఠాలు చదవద్దని నే నామెతో చెప్పలేదు. నా ఫొటోనుపూజిస్తూ కైమంతాపాడుచేసుకుంది.

ఇన్: ఆమెను పెళ్ళి చేసుకుంటానని ప్రామిస్ చేశానన్నావ్! ఎందుకు చేసుకోలేదు?

కృ: మా అక్కా, బావా ఒప్పుకోలేదు.

ఇన్: అందువల్ల ఆమెను నట్టేటిలో ముంచావ్? ఆ అమాయకురాలి బ్రతుకు పాడుజేసి, పెద్దమనిషిలాగా వచ్చి యీ అమ్మాయినికూడా మోసం చెయ్యబోతున్నావ్? అంతేనా?

(రామారావు వస్తాడు)

రామా: (కృష్ణతో) అదేమిటి? బావగారు తెల్లమొహం వేశారు. ఏం జరిగింది?

ఇన్: (కృష్ణతో) కాసేపు చల్లగాలిలో బయటికి వెళ్ళి రెస్టు తీసుకుంటారేమో! మీ రెక్కడికి వెళ్లరుగా! (గద్దిస్తూ) ఊఁ! వెళ్లండి!

(కృష్ణ బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్తాడు)

రామా: సర్కస్‌లో జంతువుల్ని ఆడించే వుద్యోగమాండీ మీకు?

ఇన్: (నవ్వుతూ) బాగా కనిపెట్టారు. మా సర్కస్ మృగాల్లో మీ రొకరు.

రామా: (తెప్పరిల్లి నవ్వుతూ) మీ joke కు రిపార్టీ యిచ్చేముందు మీ రెవరో తెలుసుకుంటె నాకూ యీజీగా వుంటుంది.

ఇన్: వెరి గుడ్! (తన జేబులో నుంచి "విజిటింగ్ కార్డు"ను తీసి యిస్తాడు)

రామా: (చదువుతూ) "ఎం. సి. మధుసూదనరావు, బి.ఏ., సి.ఐ.డి. ఇన్‌స్పెక్టర్...

ఇన్. (నవ్వుతూ) హత్యచేసిన వాడిలాగా హడిలి పోతున్నావేం రామారావ్?

రామా: నా కెందుకు భయం? మా నాన్నగారు ఆనరరీ మెజెస్ట్రేటని మీకు తెలిసే వుంటుంది.

ఇన్: మీ నాన్నగారి విషయం నాకు తెలియకపోవట మేమిటి? వారియధ్యక్షత లేని మీటింగుకాని, వారి ఆదరణ లేని ఆశ్రమంగాని వుంటుందా యీ వూళ్లో?

రామా: వారికోసం దయచేశారా?

ఇన్: నీకోసం కూడా!

రామా: నాతో మీకేంపని? (వెంకాయ్ తన్ను గమనించడం చూచి) మనం పార్కుకు వెళ్లి మాట్లాడుకుందామా?

ఇన్: అక్కడైతే నిజం చెపుతావా?

రామా: ఏమిటండా దాష్టీకం? అబద్ధాలాడటానికి నే నేం వుద్యోగం చెయ్యటం లేదు.

ఇన్: అట్లాగా! (ఫోటోను చూపిస్తూ) నీకీ అమ్మాయి తెలుసా?

రామా: (ఆతురతగా) యీ ఫొటో మీ కెట్లా దొరికింది? కమ లిప్పుడు ఎక్కడుంది? చెప్పండి. త్వరగా చెప్పండి.

ఇన్: కమల నీ కెట్లా తెలుసు?

రామా: (మాట్లాడడు).

ఇన్: ఊరుకుంటావేం? కమల నీ కెట్లా తెలుసు?

రామా: ఈ ప్రశ్నను మీరు కమలను కూడా అడిగేవుంటారు!

ఇన్: కమల వెంటనే చెప్పేది మాట్లాడ గలిగిన స్థితిలో వుంటె!

రామా: ఏమన్నారు? కమలిప్పుడు ప్రమాదంలో వుందా? ఇప్పుడెక్కడుంది? ఏ స్థితిలో వుంది?

ఇన్: నిజంగా నీ కామెను చూడాలని వుందా?

రామా: ఆమెకోసం వూరంతా వెదికాను. ఆమెజాడే కనపడలేదు. నాతో మాటమాత్రం చెప్పకుండా వెళ్లిపోయింది.

ఇన్: కమల వెళ్లిపోవటానికి కారణం?

రామా: (దుఃఖంతో) కొన్ని ఘోరపరిస్థితుల్లోనుంచి నన్ను తప్పించాలని వెళ్లిపోయింది.

ఇన్: ఆమె వెళ్లి ఎన్నాళ్లు అయింది!

రామా: మూడు మాసాలైంది.

ఇన్: తొలిసారి కమలను నీవు ఎట్లా కలుసుకున్నావ్?

రామా: (పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటాడు).

ఇన్: తప్పదు. చెప్పాలి!

రామా: అదొక విషాదగాథ! ఒక నీచుడెవడో ఆ అమ్మాయిని వివాహం చేసుకుంటానని నమ్మించి, తుదకు మోసం చేశాడు. వాడివల్ల కమల అన్నివిధాలా నాశనమైంది. ఆ ఏడు పరీక్షలోకూడా ఫెయిల్ అయింది. దానికితోడు ఆ విశ్వాసఘాతకు డామెను ఆనాడే వదిలేశాడు. ఈ విషమపరిస్థితులన్నీ ఒక్కనాడే దాపరించటంతో కమల మరీ కుంగిపోయింది. ఆనాటి రాత్రి పార్కులో ఒంటరిగా కూర్చొని యేడుస్తూ వుంది. నేనాసమయానికి సమీపంలోనే వున్నాను. ఆ ఆక్రందనం విని ఆమెదగ్గర కెళ్లాను. శోకించటానికి కారణం చెబితే నా చేతనైన సహాయం చేస్తానని ఆమెతో చెప్పాను. కాని ఆమె నాతో ఎట్టి సమాధానం చెప్పలేదు. (జేబుగుడ్డతో కళ్ళు తడుచుకుంటాడు.)

ఇన్: తరువాతేం జరిగింది?

రామా: ఆ ప్రశ్నే మళ్ళీ అడిగాను. అందుకు సమాధానం, నన్నచ్చటినుంచి వెళ్లిపొమ్మంది. అట్టి పరిస్థితుల్లో ఆమెను వదిలి వెళ్లటానికి నా మనస్సు యెదురు తిరిగింది. నే నామె సమీపంలోనే కూర్చున్నాను. అరగంట గడిచాక మళ్ళీ ప్రశ్నించాను. "తా నొక హతభాగి"నని చెప్పి యేడ్చింది. ఆమె తండ్రిపేరు చెబితే, నేనుకూడా వెంట వచ్చి సాయపడతానన్నాను. కమల తలిదండ్రులు ఆమె చిన్నతనంలోనే పోయారట. దూరదేశంలోవున్న బంధువు లెవరో ఆమెనిక్కడ చదివిస్తున్నారని, ఆనాటితో ఆ ఆశకూడా తీరిందని, తానొక దిక్కులేని అనాథనంటూ చెప్పింది. నా కెంతో జాలివేసింది.

★ పెళ్ళిచూపులు ★

కూడ కామెను బ్రతిమలాడి బలవంతపె నా చదువుకోసం ప్రత్యేకంగా అద్దెకు తీసుకున్న చోటికి తీసుకువెళ్ళాను.

ఇన్ : కమలను మోసగించినవాడి పేరును తరువాతైనా చెప్పిందా నీతో ?

రామా: లేదు. అతనిపేరు బయటపెట్టి ప్రయోజనంలేదని, దాని కంతటికి తన దుర దృష్టమె కారణమని అన్నది.

ఇన్: కమలను నీవునిజంగా ప్రేమించావా?

రామా: అంతేకాదు! కమలకోసం ఎంతటి త్యాగానికైనా వెనుదీయను.

ఇన్: కమల నీ ప్రేమను నిరాకరించింది కదూ ?

రామా: అవును. తాను పతితురాలవటం వల్ల, తన్నెవ్వరూ స్పృశించకూడదని,నన్నా పాపానికి దిగవద్దని మందలించింది. ఆమె పవిత్రప్రేమకోసమై నే నెంతటి త్యాగానికైనా సిద్ధపడతానని ప్రమాణంచేశాను. అప్పటికీ ఆమె హృదయం కరగలేదు. కొన్ని రోజులు గడిచాయి. ఆ రోజుల్లో నేను భోజనంకూడా మానేశాను. ఒకనాడు అకస్మాత్తుగా శోషవచ్చి పడిపోయాను. కమలందుకు హడిలిపోయింది. నేను చనిపోతానేమో అని భయపడిందికూడా! రాత్రింబగళ్లు నాకు సకలోపచారాలుచేసి, అమకష్టాలుపడి మళ్ళీ నన్ను బ్రతికించింది. ఆమెచేతుల్లో ఆనాడే నేను కన్నుమూసుంటే బాగుండేది. కాని విధి మరోలాగా చేసింది. అప్పటినుంచి మా జీవితాల్లో వెన్నెల ప్రవేశించింది.

ఇన్ : కమల నీదగ్గరనుంచి వెళ్లేనాటికి ఆమె గర్భవతికదూ?

రామా: అవును. అప్పటికి ఆరోనెలకూడా వచ్చింది.

ఇన్ : నీ దగ్గరనుంచి కమల వెళ్ళిపోవటానికి ఏమిటి కారణం?

రామా: నా ఖర్మ! అంతవరకు నేనొక ఆఫీసులో వుద్యోగం చేస్తున్నానని, తన కోసం చేసే ఖర్చంతా నేను సంపాదించి తెస్తూవున్నానని చెప్పాను. కమలనావిధంగా మోసగిస్తున్నానని బాధపడుతూ వచ్చాను. అంచేతా నాడు ఆమెతో సత్యం చెప్పాను. అదే నా పాలిట మహాపచారమైంది.

ఇన్: కమ లందుకు యేమంది?

రామా: ఏమంటుంది? ఒకటే యేడుపు! ఎంత బ్రతిమలాడినా ఆగలేదు. హృదయం బద్దలయ్యేటంతగా ఏడ్చింది. ఆఖరికి నన్నో ప్రశ్న అడిగింది.

ఇన్: ఏమని?

రామా: ఇన్నాళ్ళూ ఆ డబ్బంతా నే నెక్కడనుంచి తెస్తున్నది నిజం చెప్పమంది.

ట్టి చెబితే కథ అడ్డం తిరుగుతుం దనుకోలేదు. చెప్పాను. నా తండ్రి పేరు చెప్పాను. ఆ డబ్బంతా మా నాన్నకు తెలియకుండా దొంగతనంగా తెచ్చి ఖర్చుచేశానని, నేనింకా తండ్రి చాటువాడినని చెప్పాను. నుంచున్న పాటుగా విరుచుకుపడిపోయింది.

(కన్నీళ్ళు తుడుచుకుంటాడు.)

ఇన్: తరువాతేం జరిగింది?

రామా: ఒక గంట గడిచాక ఆమెకు ఒళ్లు తెలిసింది. ఇక అక్కడో క్షణంకూడా నిలవలేదు. తూలుతూ వెళ్ళిపోయింది. "పడిపోతావ్! వెళ్ళకు" అని నే నెంతచెప్పినా నామాట వినిపించుకోలేదు. నాకేమీతోచింది కాదు. కొంతసేపట్లా తటపటాయించాను. కమల ఏదైనా అఘాయిత్యం చేస్తుందేమో అన్న సందేహం కలిగింది. దొడ్లో భావి దగ్గరకు పరుగెత్తాను. కాని ఆజాడ కనపడలేదు. పిలిచాను. జవాబులేదు. ఎక్కడ వెతికినా కనబడలేదు. ఆఖరుకు వంటయింట్లోకి వెళ్లాను. అచ్చట సీతారాముల పటంముందు పడి యేడుస్తూంది. దగ్గరగా వెళ్ళి బుజ్జగిస్తూ మీద చెయ్యి వేశాను. కాని, నా చేతిని తోసిపారేసి దూరంగా జరిగి కూర్చుంది.

ఇన్: కారణం?

రామా: చాలా ప్రశాంతంగా చెప్పింది. ఆ రోజునుంచి నన్నక్కడికి రావద్దంది. ఆ కపటజీవితం తన కేమాత్రం యిష్టంలేదుట! నా తలిదండ్రులకు దూరం కావద్దని, దొంగతనము నే నైచ్యానికి పాల్పడవద్దని, నా తలిదండ్రులకు హృదయక్షోభను కలిగించవద్దని, తన విషయం తాను మాచుకోగలనని, యిట్లా యెన్నో అంది. కోపం చల్లారితే అంతా కుదుటపడుతుం దనుకొని అచ్చటినుండి వెళ్ళిపోయాను. ఆ మరునాడు వచ్చి చూస్తే యేముంది? కమ లచ్చటలేదు. తనవెంట ఒక్క వస్తువూ తీసుకు వెళ్ళలేదు. కమల కోసం వూరంతా గాలించాను. వీధివీధి వెతికాను. ఆమె కనబడలేదు. ఇప్పుడు కమ లెక్కడుందో చెబితే తక్షణం వెళ్లి క్షమాభిక్షను వేడుకుంటాను.

ఇన్ : ఆమె సంతానానికి నీవే తండ్రివని అందరియెదుట అంగీకరిస్తావా?

రామా: ఆ అదృష్టంకోసమె ఎదురుచూస్తున్నాను. కమ లెక్కడుందో దయచేసి చెప్పండి. మిమ్మల్ని ప్రాధేయపడి అడుగుతున్నాను. కమ లెక్కడుంది? నా భార్య యెక్కడుంది?

ఇన్: భార్యా! ఆమె నిజంగా అదృష్టహీనురాలే! కమల...

రామా: చెప్పండి!కమ లెక్కడుంది?

ఇన్: చనిపోయింది!

రామా: ఆఁ!

ఇన్: అవును రామారావ్! ఆమెచ ఐ బ్రతికుండి ఎవరిని వుద్ధరిస్తుంది? ఈ విశాలప్రపంచంలో ఆమెకు స్థానంలేదు. ఆమెకే యిక్కడ ఆశ్రయం కరువైనప్పుడు, ఆమె గర్భంలో వున్న అనిర్భాగ్యపు శిశువుకెక్కడ తావుంది? అందుకనే ఆ నిండు గర్భవతి-కమల-తన చీరెకు తన స్వహస్తంతో నిప్పెట్టుకొని అగ్నిహోత్రునికి ఆహుతైంది.

రామా: (చేతులు ముఖానికి అడ్డం పెట్టుకొని యేడుస్తాడు. వెంకాయ్ వచ్చి వూరడిస్తూ)

వెం: ఊరుకో సినబాబూ! ఇప్పుడేడిస్తే ఏం లాభం? ముందే వుండాల యీ బుద్ధి! అమ్మగారు యింటూనే వుండారు. పిలుస్తుండారు లోనికిరా సినబాబూ!

(బయటనుంచి "వెంకాయ్" అంటూ రాంబాబు పిలుపు వింటారు)

వెం: వత్తుండాఅయ్యా!(రామారావుతో) నా మాటిను! లోనికిరా! నే సెబుతాగా! మా బాబుకదూ!

(బలవంతంగా లోనికి తీసుకువెళ్తాడు.)

(రాంబాబు వస్తాడు)

రాం : వెంకాయ్! సిద్ధాంతి యింకా... (ఇన్. తో) ఎవరు?

ఇన్: మీతో అవసర విషయాలను మాట్లాడాలని......

రాం: సరేసరే! నాకిప్పుడో క్షణంకూడా తీరిక లేదు. చెప్పకోవలసిం దమైనా వుంటే రేపు సాయంకాలం 5 గంటలకు రా!

ఇన్ : ఒక్క అయిదు నిమిషాలు యిప్పుడు స్పేర్ చేస్తే చాలు !

రాం : (విసుగా) అబ్బబ్బబ్బా! మనిషి అన్నవాడికి ఒక మాటచాలు- ఊఁ! వెంటనే కదలా లిక్కడనుంచి?

ఇన్ : నేను కదిలితే మీరూ నావెంట రావలసి వుంటుంది!

రాం : ఎక్కడికి?

ఇన్ : పోలీస్ స్టేషనుకు.

రాం : ఆఁ! నే నెవరో తెలుసుకునే మాట్లాడుతున్నావా?

ఇన్ : అదే నేనూ అడుగుతున్నాను.

రాం : ఏమిటయ్యా ఆ మొండితనం? అసలు నీ వవరో చెప్పరాదూ యీ విధంగా ప్రాణం తియ్యకుండా!

ఇన్ : మొదట్లో నే ఆమాటంటె మర్యాదగావుండేదిగా! నేనుసి.ఐ.డి.ఇన్స్పెక్టర్ ను.

రాం : (తెప్పరిల్లి) అట్లాగా దయచేసి కూర్చోండి. మిమ్మల్ని యెప్పుడూ చూడలేదు. క్షమించాలి. మీ రీవూరికి కొత్తగా ట్రాన్స్ఫర్ అయి వచ్చివుంటారు. మీ పేరు?

ఇన్ : మధుసూదన్ రావు.

రాం : కులం ?

ఇన్ : ఉద్యోగానికి కాదు నేనిక్కడికి వచ్చింది.

రాం : క్షమించండి. మన కేమైనా చుట్టరికం కలిసి వుందేమోనని అడిగాను.

ఇన్ : ఈ వూరి అనాధాశ్రమానికి మీరు అధ్యక్షు లనుకుంటాను?

రాం : ఆఁ! ఏ మధ్యక్షుతో యేమిటో! నాకు వద్దయ్యా బాబూ అంటె వదలరు. ప్రాణాలు కొరుక్కుతింటారు. ఏం చేస్తాం? తప్పదు. పైగా నా రిటైర్డ్ లైఫంతా ప్రజాసేవక కైంకర్యం చేద్దామని అనుకుంటూ వుంటటంవల్ల యిటువంటి బాధ్యతలన్నీ నా మీదనే పడ్తూ వుంటాయి.

ఇన్: మీ అనాధాశ్రమానికి నిలవ ధన మెంతుంది?

రాం. ఉంటుంది అరవై వేలదాకా!

ఇన్: ఆ ధనాన్ని మీ రెలా సేకరించారో తెలవిస్తారా?

రాం. అదంతా మా చాకచక్యం, పలుకుబడివల్ల. ఢిల్లీనుంచి కొంత—హైద్రాబాదు నుంచి కొంత—కస్తూర్బాఫండ్ నుంచి కొంత—ప్రజలవద్దనుంచి కొంత—ఇట్లాగే వసూలు చేశాం. అనాధలపేరు చెపితే పేరుగలవాడెవ్వడివ్వడు చందా? వారి పేరులు పేపర్లోకూడా పడుతయిగా మరి?

ఇన్. ఇప్పు డాధనమంతా యెక్కడుంది?

రాం : షెడ్యూలు బ్యాంకు — మన ఆంధ్రా బ్యాంకులోనే!

ఇన్: ఎవరిపేర వుంది బ్యాంకులో?

రాం: ఎవరిపేరైతే నేమండి? ఆ ద్రవ్యం భద్రంగా వుండటమేగా మనం చూడవలసింది?

ఇన్. ఆ ధనాన్ని మీ సొంతపేరుతో వేశారు కదూ బ్యాంకులో?

రాం. అవును. ఎవరిపేరైతే నేమని, నా పేరుతోనే వేశాను. లోకోపకారంకోసమే చేసిందానికి ఆక్షేపణేముంటుంది?

ఇన్: మిమ్మల్ని అధ్యక్షుడుగా ఎన్నుకున్న దెవరు?

రాం. ప్రజలు.

ఇన్: అంటె?

రాం: అంటె—అంతకంటె ఏమి చెప్పాలి? ప్రజలు కమిటీ నెన్నుకున్నారు కమిటీ నన్నెన్నుకుంది. అంతె ప్రజాస్వామ్య సూత్రంపైనె జరిగింది లెండి!

ఇన్: మీ కమిటీ మెంబర్లెంతమందండి?

రాం. ఇద్దరు.

ఇన్: మీరు,మీ గుమాస్తా గోపాలమేగా?

రాం: అవును. అందులో న్యాయానికి విరుద్ధమేముండి? నేను అధ్యక్షుడ్ను, అతను కార్యదర్శి.

ఇన్: ఇంతకుముందు చెప్పారు మీ ఆశ్రమానికి చందాలు ప్రజలవద్దనుంచికూడా వసూలుచేశామని—మీరుకూడా యిచ్చారా చందా?

రాం: ఓఁ! ఇచ్చాం!

ఇన్: ఎంతిచ్చారో తెలుసుకోవచ్చా?

రాం: నోచిం దిచ్చాం!

ఇన్: అది యెంత అని అడుగుతున్నాను.

రాం: రెండు రూపాయలు.

ఇన్: రాంబాబుగారూ! నాలుగు రోజుల క్రిందట, మీ అనాధాశ్రమానికి ఒక నిస్సహాయురాలు, అతిదీనురాలు, చినిగిన గుడ్డలతో, మీ సహాయాన్ని అర్థించటానికై వచ్చిందాండి?

రాం: ఎంతోమంది వస్తూవుంటారు. నా కేమి జ్ఞాపకంవుంటుందండి?

ఇన్: (ఫొటోను చూపిస్తూ) జ్ఞాపకమొస్తుందిప్పుడు. ఈ ఫొటో చూడండి.

రాం: (కళ్ళజోడు పెట్టుకొని చూచి) ఔను. వచ్చింది.

ఇన్: మీ ఆశ్రమ ధనంలోనుంచి ఏమైనా సహాయంచేశారా ఆమెకు?

రాం: లేదు.

ఇన్: కారణం?

రాం: ఆమె చెప్పిన మాటలన్నీ నిజానికి న్యాయానికి విరుద్ధంగా కనబడటంవల్ల!

ఇన్: ఏమిటా విరుద్ధం?

రాం: నిండు గర్భవతి అయివుండీ తన భర్తపేరు చెప్పటానికి నిరాకరించింది. అటువంటివాళ్లకుకూడా చోటిస్తే అనాధాశ్రమం యింక నిలుస్తుందాండి? నామరూపాలు లేకుండాపోదు?

ఇన్: అందువల్ల మీ రామెకు కనికరం కూడా చూపెట్టలేదంటారు?

రాం: మా రూల్సు అలా వున్నాయి మధ్య నన్నేమి చెయ్యమంటారు?

ఇన్: ఆమె మిమ్మల్ని యే సహాయాన్ని అర్థించింది?

రాం: తనచేతి కేమీ డబ్బివ్వక్కర్లేదనుకోండి. కాని ఆమె ప్రసవించటానికి హాస్పిటల్లో అయ్యేఖర్చును మేము భరిస్తే చాలుట!

ఇన్: మీ రేమన్నారు?

రాం: నాకు తోచిన సలహాను వుచితంగా చెప్పాను. ఆ అమ్మాయి వినలేదు. నన్నేం చెయ్యమంటారు?

ఇన్. ఏమిటి మీరు చెప్పిన సలహా?

(రామారావు వచ్చి రాంబాబు వెనగ్గా నిలబడుతాడు.)

రాం: ఆ అమ్మాయిని అట్టి దురవస్థపాలు జేసిన ఆ వెధవమీద వెంటనే మనవర్తిదావా వేసి, వాడిగోగం సొంతంకుదర్చమన్నాను. ఆ గాడిదకు అప్పుడే సరైనబుద్ధి వస్తుందని కూడా చెప్పానండి. ఊహూఁ! సుతరామూ ఒప్పుకోందే! పైగా యీ తమాషా చూశారా? ఆ గుంటవెధవని నేను గట్టిగా మందలిస్తుంటే సంతోషించాలా? ఒక టేయాడవటం! కన్నీళ్లతో మా హాలంతా ముంచెత్తిందండి! తెలివి తక్కువ కాకపోతే ఆ కసాయిగాడిమీద యింకా మమకార మేమిటండీ? ఇంతకు యీ వివరాలన్నీ మీ రెందుకు అడుగుతున్నారో...

ఇన్ : ఆమె ఒక ఉన్నత కుటుంబానికి చెందివుంటుందా?

రాం: ఆఁ! ఇంటర్ దాకా చదివిందిట.

ఇన్ : ఆమె భర్తకూడా అంతకుపైనే చదివుంటాడని నమ్మతారా?

రాం: అఘోరించటానికండి వాడిచదువు! దాన్ని వూరిపాలుచేసి చల్లగా తప్పుకున్నాడు. తేరగా యిక్కడ నేనున్నానుగా? ఇహ వాడి కెందుకు పురిటిఖర్చు! వాడి అవుసరం తీరింది?

ఇన్ : వాళ్ళిద్దరికి వివాహం అయిందని కమల మీతో చెప్పిందా?

రాం : అదేగదండి దీనికంతకు మూలం! పెళ్ళి లేదు పెటాకులు లేదు. కన్నూ వళ్లూ తెలియక అవకతవకపనులు చెయ్యటం, ఆ పైన పెతుక్కుంటూవచ్చి అనాధాశ్రమంమీద పడటం! ఈ రోజుల్లో ఒక పరిపాటైంది.

ఇన్ : ఆ అబ్బాయి మీ యెదుటకొచ్చి నిలబడితే అధ్యక్ష్యం వహించి వివాహం జరిపిస్తారా?

రాం : వాడిపేరు బయటపెడితేగా యే చివాట్లయినాపెట్టి యేమైనా చెయ్యటానికి?

ఇన్ : ఆ అబ్బాయిపేరు బయటపెట్టలేదన్నారు. పోనీ, అతడి తండ్రిపేరైనా చెప్పిందా?

రాం : (నవ్వుతూ) మీరూ బలేవారండి! వాడిపేరే చెప్పంది వాడితండ్రిపేరును చెపుతుందా? వాడొక దగుల్బాజి! వాడితండ్రి అంతకంటే దగుల్బాజీ అయివుంటాడు! ఏమంటారు? అంతా ఒకతానులో గుడ్డేగా!

ఇన్ : నిజమే ననుకోండి! కాని ఆతండ్రి ఫలానా అని తెలిస్తే మీ అభిప్రాయం మార్చుకుంటారేమో?

రాం : ఎవరండివాడు? తెలిస్తే చెప్పండి పిలిచి నాలుగు చివాట్లు పెడతాను.

ఇన్ : పాపం! ఆ నిర్భాగ్యురాలు ఆ అబ్బాయిపేరు చెప్పక పోవటంవల్ల మీ కతనిపైన ఆగ్రహం కలిగిన మాట నిజమంటారు.

రాం : అవును.

ఇన్ : ఆ కారణంవల్లే ఆమె మిమ్మల్ని అర్థించిన సహాయం - అంటె ఆమె ప్రసవమయ్యేవరకు హాస్పిటల్లో అయ్యేఖర్చును భరించమని వేడుకున్న ఆ సహాయాన్ని మీరు తిరస్కరించారు. అంతేనా?

రాం : (సమాధానం చెప్పలేక తొట్రుపడుతూ వుంటాడు.)

★ పెళ్లిచూపులు ★

ఇన్: మీ కింత లోకానుభవంవున్నా, అతనిపేరామె చెప్పకపోవటానికి కారణం గ్రహించలేకపోయారు. అతని కుటుంబం తనవల్ల నలుగురిలో నగుబాట్లపాలు కాకూడదనే ఆమె ఆ పేరు చెప్పలేదన్న సత్యాన్ని మీరు గుర్తించలేకపోయారు.

తండ్రీ, కొడుకూ దూరమైపోతారని, అందువల్ల అతను అష్టకష్టాల పాలవుతాడని భయపడి, తానె కోరికోరి అగచాట్లను తెచ్చుకుంది. కాని ఆదరించే దిక్కు లేక, ఆశ్రయమిచ్చే దాతలు లేక పస్తులుకూడా పడుంది. ఈ విశాలప్రపంచంలో ఆమెకు త్రాగటానికి గుక్కెడు నీళ్ళుకూడా కరువైనాయి. క్రమక్రమంగా ఆమెకు ఒంట్లో శక్తి నీరసించింది. కాలు కదల్చలేని స్థితికి వచ్చింది.

ఆ పరిస్థితుల్లో ఆమెను ఆహ్వానించి ఆదరించే శక్తి ఒక్క దానికేవుంది. అదిమృత్యువు! ఆ మృత్యుదేవత విశాలబాహువల్లికల్లో ఆమె శాశ్వతంగా శాంతి పొందాలనుకుంది!

తన్ను ప్రతివారూ మోసంచేశారు. తన మృత్యువుకు ప్రతివారూ హక్కుదారులయ్యారు. కాని, తనగర్భంలోని ఆ శిసువును బలిచెయ్యటానికి తన కేంహక్కుంది? అభం శుభం తెలియని ఆ శిసువు యెవరికేం అపకారంజేసింది? ఏం నేరం చేసింది? ఏం పాపం చేసింది? ఎలాగైనా ఆ శిసువు భూమిమీద పడాలి! ఈ మానవ ప్రపంచాన్ని తలెత్తి చూడాలి! తప్పదు! అడ్డుపెట్టే అధికారం ఆమెకులేదు. ప్రసవం అయింతరువాత ఆమె మరణిస్తే అడిగేవాడూ లేడు, తలచేవాడూ లేడు. తల్లిలేని ఆ శిసువును యేనాటికైనా ఆ తండ్రే ఆదరిస్తాడు - లేదా యీ భారత భూమే భరిస్తుంది!

ఈ కారణాలవల్ల, ప్రసవించేవరకు ప్రాణాలు నిలుపుకోవాలని ఆమె సర్వప్రయత్నాలూ చేసింది. అందుకే తన ప్రసవానికయ్యే ఖర్చునైనా భరించమని మిమ్మల్ని కాళ్ళావేళ్ళా పడి వేడుకుంది - బ్రతిమలాడింది - ప్రాధేయ పడింది.

కాని మీ మానవహృదయం కరగలేదు. జాలి కనిపించలేదు. ఇక ఆమె చేయగలిగిందేమిటి? ఏ జంతువుగానో జన్మించివట్లయితే, స్వేచ్ఛగా ఏ నడిరోడ్డుమీదో ప్రసవించి వుండేది! కాని ఆమె మనిషిగా పుట్టింది. మనిషిగా పెరిగింది. మనుష్యుల్ని నమ్మింది - అందుకు అతిదారుణమైన ఫలితాన్ని అనుభవించింది!-

(ఇంతసేపు వెంకాయ్ పూరడింపుతో అణచబడుతున్న రామారావు దుఃఖం ఒక్కసారిగా బద్దలవుతుంది. రాంబాబు వెనకకు చూసి, ఆశ్చర్యపడుతాడు.)

రాం. ఇదేమిట్రోయి? మధ్య నీ యేడుపెందుకు? చాలుచాల్లే వూరుకో? ఎవరైనా వింటే నవ్వుతారు!

ఇన్: ఇంతటి కష్టాన్ని ఎవరు విన్నా హృదయం కరుగుతుందే? పాపం మీ అబ్బాయికి యింకా ఎంతవుండాలి బాధ?

రాం: ఏమిటి మీ రంటున్నది?

ఇన్: మీ సహాయ నిరాకరణంవల్ల ఆ అభాగ్యరాలు ఆత్మహత్య చేసుకుంది.

రాం: ఆత్మహత్యా! ఆత్మహత్య చేసుకోవటమే!

ఇన్. ఏం? మీ కిప్పుడు బాధగావుందా? ఇంకేం? మీ రూ శృతి కలపండి మీ అబ్బాయితో!

రాం: ఈ గొడవంతా మా కెందుకండీ?

ఇన్: అయినవాళ్ళు గనుక!

రాం: ఎవరికి అయినవాళ్ళం?

ఇన్: ఇంత బలగంవుండీ దిక్కులేని నికృష్టపుచావుకు ఆహుతైన దరిద్రదేవత కమలకు!

రాం: ఆ! దానికి మాకు ఏమిటిసంబంధం?

ఇన్: ఆమెకు నీవు మామ - అతడు భర్త! ఇదీ సంబంధం!

రాం: ఆఁ! ఏమిటి? (రామారావుతో) ఇది నిజమేట్రా?

రామా: (ఏడుస్తాడు)

రాం: ఏమిట్రా ఆ వెధవయేడుపు? నిన్నే అడుగుతుంది! చెప్పవేం? ఇదంతా నిజమేనా?

రామా: (కన్నీరు తుడుచుకొని, గంభీరంగా) నిజమె!

రాం: అయ్యో! (తల కొట్టుకొని అటూ యిటూ కంగారుగా పచారుచేసి) నీకు దీనికంతా డబ్బెక్కడనుంచి వచ్చింది?

రామా: మన యింటినుంచే తీసుకెళ్లాను.

రాం: ఎవరిచ్చారు నీకు?

రామా: ఇనప్పెట్టె తాళం తెఱచి నేనే తీసుకున్నాను.

రాం: దొంగిలించా?

రామా: ఎలా అనుకున్నా సరే!

రాం: ఒక పైసాకూడా సంపాదించలేని వెధవ్వ్-నాకు తెలీకుండా నా డబ్బును తాకటానికి నీకు గుండెలెట్లా వచ్చాయిరా?

రామా: ఆ తరువాతైనా ఆ డబ్బును వినియోగించవలసింది నేను.

రాం. అదంతా నా కష్టార్జితమోయ్? ఎవరబ్బసొమ్మూకాదు యిష్టం వచ్చినట్లు దుబారా చెయ్యటానికి!

రామా: మీ ఆర్జితం ఎటువంటిదో వాతికి కూడా తెలిసింది. అది ప్రజాద్రవ్యం! అది ప్రజలకే చెందాలి!

రాం: ఏడిశావ్! పెద్ద కమ్యూనిష్టు దిగాడోయి రష్యానుంచి! వెధవమాటలు, వెధవ చేష్టలు! (పచారు చేసి) అటువంటి దానితో అన్నాళ్లు కాపురం యేడుస్తూ, మాటమాత్రం చెప్పలేదుకదరా నాతో!

రామా: చెబితే జరిగేదేమిటో నాకు ముందే తెలుసు!

రాం: ఇప్పుడు మాత్రం ఏం చట్టుబండలైందోయ్? ఆ అమ్మాయి బలవంతంచావుకు నీవే కారణమని యీయన, రేపు నీ మీద కేసుపెట్టడు?

రామా: ఆ శుభసమయంకోసమే ఎదురుచూస్తున్నా! అప్పటికైనా నా అంతరాత్మ శాంతిస్తుంది. కాని కమలచావుకు బాధ్యులు, ముఖ్యకారకులు మీరు.

రాం: నేనాఁ? నేనుట్రా?

రామా: అవును. ముమ్మాటికి మీరే! మా హృదయాల్లోమండే దావాగ్ని మీకెట్లా తెలుస్తుంది? మీకు తెలిసిందల్లా ఒక్కటే! ఆదర్శాల పేరుతో లోకాన్నంతా దుమ్మెత్తటం! కాని, మనోదౌర్బల్యానికి శానిసలై కాలప్రవాహంలోపడి కొట్టుకుపోయే పతితుల్ని ఒడ్డుకుచేర్చి, మన్నించి మార్గంచూపే శక్తిలేదు. సహనమూ లేదు.

ఇన్: రంగం యిప్పుడు మాంచి రక్తిలో పడింది. (గడియారం చూచుకొని) నాకిక టైంలేదు. (లేస్తాడు)

రాం:-(చేతులు పట్టుకుంటూ) ఇవి చేతులుకావు కాళ్లు! మా గౌరవమంతా యిప్పుడు మీ చేతుల్లోవుంది. మీకు కావాలిసొస్తే ఎంతైనా...

ఇన్:-క్షమించాలి! లంచాలకు లొంగేవాడ్ని కాదు. ఎవరు చేసినపాపం వారే అనుభవించాలి! తప్పదు! మళ్ళీ వస్తాను! (వెళుతాడు)

రాం: (పచారుచేసి) సర్వం నాశనమయింది! వెంకాయ్! వెళ్ళి తలుపెయ్యి!

(వెంకాయ్ వెళుతుండగా కృష్ణ ఎదురుగా వస్తాడు)

కృష్ణ. చల్ల గాలికోసం గార్డెన్లోవున్నాను.

రాం: (తెప్పరిల్లి, నవ్వుతూ) అవునవును సిద్ధాంతికోసం కబురుజేశాం కదూ! మీ బావగారేరి?

కృ: ఇప్పుడే వస్తారు. వీ కేకలు రోడ్డుమీద వినబడుతున్నాయి. ఏం జరిగిందేమిటి?

రాం: అబ్బే! మరేంలేదు. మా వెంకాయ్ మీద కొస్త కూకలేశాను.

రామా: ఇంకా అబద్ధాలెందుకు? అవి కూకలుకావు కేకలూకావు! అణచుకున్నా ఆగని ఆందోళన-దానిఫలితంగా వచ్చే రోదన అని అంటె బాగుంటుంది!

కృష్ణ: నేనంతా వింటూనే వున్నా

కోయి బావా? ఈ చిన్న విషయానికి మనమంత కంగారు పడవలసిన పనిలేదు.

రాం: ఈ సి. ఐ. డిగా డొకడు దాపరించాడే శనిలాగా? వాడు తీరా కేసుపెడితే మన పరువేంకాను మన మేంకాను?

కృష్ణ: కేసేమని పెడతాడండి వాడి బొంద? పైగా వాడికి సాక్ష్యం యేది! చచ్చింది ఎట్లాగూ రాదుకదా! ఇక పోతే మనం! మనం అసలే చెప్పంకదా!

రామా: నే చెపుతాను. పూసగుచ్చినట్లు సర్వం చెప్పేస్తాను.

రాం: అంతగా చావటానికే నిశ్చయం చేసుకుంటే కోర్టుదాకా ఎందుకోయ్? ఆ యేడుపేమిటో యింట్లోనే యేడు.

రామా: రాచ పీనుగ ఒంటరిగాపోదు.

కృష్ణ: (రాంబాబుతో) అతని విషయం నాకు వదలండి!

రాం: వాడు కేసు తెస్తే ఎలా తప్పించుకోవటమో లోచకుండావుంది.

కృష్ణ: అంతవరకు రానీయండి చూద్దాం! మద్రాసునుంచి యతిరాజుల్ని పిలిపిద్దాం! దాంతో కథంతా అడ్డం తిరుగుతుంది.

రామా: కాని, ఒక్కటి మాత్రం సత్యం! మీజన్మలో మీ గుండెలపై చెయ్యి వేసుకొని నిద్రపోలేరు!

రాం: ఎందుకు పోలేమోయి నిద్ర?

రామా: మీ అంతరాత్మే మీకు శత్రువు! మీ పలుకుబడి, మీ రావు బహద్దూర్ బిరుదూ, మీ ఆనరరీ మేజిస్ట్రేటుపదవీ, వీటితో మీరు లోకాన్ని మోసగిస్తే, మిమ్మన్ని మోసగిస్తుంది మీ అంతరాత్మ!

రాం: ఏడిసింది! ఎక్కడుందిరా అంత రాత్మ? చూపించరా దాన్ని? నలిపి పారేస్తాను.

(కాలితో నేలను రాస్తాడు)

కృష్ణ: (నవ్వుతూ) పిచ్చుకపైన బ్రహ్మాస్త్ర మెందుకండీ? అతని విషయం నేను చూస్తానన్నాగా?

రాం: చూడుమరి? ఇల్లుగాలి ఒక డేడుస్తుంటే ఏదో కాలి యింకో డేదుస్తున్నాట! (పచారుచేసి) ఇప్పడు అరెస్టు వారంటుతో వస్తాడేమో ఆ శనివెధవ? (అంటూ కూర్చుంటాడు)

కృష్ణ: ఏడిశాడు! వాడికి గుండా చెరువా? వాడి కెక్కడేడిసింది ఆమాత్రం ధైర్యం?

(బయట తలుపు బాదినట్లు శబ్దం)

(కృష్ణా రాంబాబులు అదిరిపడి లేస్తారు)

(రామారావు నవ్వుతాడు)

రాం: ఊరుకోరా నీకు పుణ్యంవుంటుంది! (బయటికి చూస్తూ) సందేహం లేదు. పోలీసు వాళ్ళే!

(సిద్ధాంతి ప్రవేశం)

సిద్ధా: నమస్కారం మెజిస్ట్రేటుగారూ! మీ గుమస్తా చెప్పీచెప్పటంతోటే పంచాంగంతో పరుగెత్తుకొచ్చాను. శుభం! ఆఁ! వివాహం అన్నాడు. అబ్బాయిగారికా? అమ్మాయిగారికా?

రాం: (కోపంగా కొడుకును చూస్తూ) అబ్బాయిగారికి ముహూర్తం అక్కరలేదు. మనమూ అక్కర్లేదు. (సంబాళించుకొని) సిద్ధాంతిగారూ! అమ్మాయి వివాహానికి ముహూర్తం స్థిరపరచండి!

సిద్ధా: చిత్తం! అలాగే! అమ్మాయిగారి నక్షత్రం నాకు తెలుసనుకోండి. పెళ్ళికొడుకు గారి నక్షత్రం కావాలి!

రాం: (చూపుతూ) అడుగో! అతనే పెళ్ళికొడుకు!

సిద్ధా: సంతోషం! (కృష్ణతో) మీ నక్షత్రం?

కృ: దేవుడ్ని అడగాలి! నాకీ నక్షత్రాలమీద, జాతకాలమీద ఏమాత్రం నమ్మకం లేదు.

సిద్ధా: అట్లాగా! (రాంబాబుతో) దానికేమండి? వచ్చే అమావాశ్యనాడు మిట్ట మధ్యాహ్నం ముహూర్తం జరిపించండి!

రాం: ఏమిటో? నాకు టైంలేదు. ఏదో ఒకటి కానివ్వండి! తాంబూలం యిప్పుడే యిస్తాను.

(తాంబూలం యివ్వబోతుండగా లోపలినుంచి వెంకాయ్ "ఆగండి"అని అరుస్తాడు)

రాం: ఏమిట్రా అది?

వెం. (వచ్చి) తాంబూళాలు యియ్యొద్దని అమ్మాయిగారు సెప్పినారండి! ఈయన కత సాలా లావుగావుండదండి. సీరె నిప్పెట్టుకు సచ్చిపోయిందే, ఆ తల్లి సావుకు కారణం యీ దొంగనాయాలే! (కృష్ణతో) ఇప్పుడు బలే కూతకు లేశావ్? ఆ బాబుం డప్పుడు సచ్చిన గేదెదూడకుమల్లే పడుండా! ఇంకా సిగ్గులేక ఏవనివుండా విక్కడ? కదలయ్యా అంటె అట్టా గుడ్లోరిమి సూత్తావేం?

కృష్ణ: మీ సర్వెంటు నన్నిట్లా యిన్‌సల్ట్ చేస్తుంటె మీరు వింటూ వూరుకోవటం న్యాయంగా వుందా? చెప్పరేం రాంబాబు గారూ?

రాం: ఈ అయోమయంలో న్యాయం, అన్యాయం నాకు ఒక్కలాగే కనబడుతున్నాయి. ఇందులో పెద్దమనిషి ఎవరు?

(తలుపు చప్పుడు)

(కృష్ణా, రాంబాబులు లేస్తారు)

కృ: ఆఖరుమాట అడుగుతున్నాను. మన బాంధవ్యం ఆఖరు అయినట్లేనా!

రాం: అప్పుడే ఆఖరు ఎట్లా అవుతుంది? సశేషం పోలీసుకోర్టులో వుందిగా?

(దాసు పెండ్లివస్తువులతో వస్తాడు)

దాసు: పెండ్లికూతురికోసం చీరె, పసుపు కుంకుమా, పూలు, పండ్లూ తెచ్చాను... ఏమిటి? మీరంతా అలా వున్నారేం? (వెంకాయ్‌తో) ఓరబ్బీ! ఇలా రావోయ్!

(వెంకాయ వస్తాడు)

దాసు: వీటి నన్నిటిని లోపలికి తీసుకు వెళ్ళి పెళ్ళికూతురికి యివ్వమని అమ్మగారితో చెప్పు, (అంటూ యివ్వబోతాడు - వెంకాయ్ ఒక అడుగు వెనక్కు వేసి)

వెం: 60 ఏళ్ల కట్టంలో నా సేతులు ఎన్నడూ మైల పడ్లా! యీజీవితం యిట్టానే గడవనీయండి (బయటకు వెళ్తాడు)

దాసు: (ఆశ్చర్యంగా) శుభసమయంలో కొత్త చీరెకు మైలా గియిలాఅంటూ అప్రాచ్యపు మాటంటాడేం? (కృష్ణతో) నువు కూడా మాట్లాడవ్! ఏమిట్రా యీ చోద్యమంతా?

కృష్ణ: మనతో వియ్యమందితే వారి పెద్దరికమంతా పాడవుతుందిట!

దాసు: ఎందుకని? ఏమండీ రాంబాబు గారూ! ఇంతకంటె మహాపచారమేముంది? ఇంతలో అంత మార్పురావటానికి కారణం? ఇదేం మర్యాదండీ? (సిద్ధాంతితో) మీరైనా చెప్పకూడదు? పిలిచి పిల్లనిస్తామంటూ యింటికి రప్పించి అవమానం చేయటం మీరెన్నడైనా విన్నారా? న్యాయం చెప్పండి!

సిద్ధా: నిజమే బాబూ! నే నింతవరకు యెన్నడు విన లేదు. నక్షత్రాల్లోను, ముహూర్తాల్లోను నమ్మకం లేదన్నమాట! ఆ కొఱతీనాడు తీరింది! అయిందేదో అయింది! మీ రిచ్చటనుంచి యెంత త్వరగా గడప దాటితే అంత మంచిది!

దాసు: అంతేనా రాంబాబుగారూ!

రాం: అలాగే కనబడుతుంది.

కృ: రాంబాబూ! దీని ఫలితం వూరికే పోదు. తప్పక అనుభవిస్తావ్! ఇహ చెపుతున్నా విను. ఒకవేళ నీబుద్ధి మార్చుకొని నీ కూతురినిస్తానని నీవు ప్రాధేయపడినా, నీ కూతురేవచ్చి నా పాదాలగోదపడినా నా నిర్ణయం మారేదిలేదు. నీ కూతురికి పెళ్ళెలా అవుతుందో నేను చూస్తాను. (దాసు దగ్గరున్న వస్తువులను క్రిందకి విరజిమ్మి) రాంబాబూ! (వికటంగా నవ్వుతూ) మీ అందరిపరువు, మీ ప్రాణాలు, నాగుప్పెట్లో వున్నాయి. నీకు అవమానించటమే తెలుసు. నాకు ప్రాణాలు తియ్యటంకూడా తెలుసు! చూపిస్తా నాతడాఖా! చేయిస్తా పరాభవం! (నవ్వుతాడు).

(వెంకాయ్ పంచ ఎగకట్టుకొని బాణాకర్రతో వస్తాడు.)

వెం: బాబుగారూ! మీరు "వూ"అనండి! అందరిని మక్కలిరగబొడుత్తా! సూపిత్తా నాదెబ్బెంటో? అమ్మాఁ! (అంటూ ఆతురతగా వెనగ్గా చూస్తాడు)

రాం: ఏమిట్రా వెంకా? ఏమైంది?

(56-వ పేజీ చూడండి)

వంటింట్లో వంద



అంది అని చెప్పాడు బాబాయి.

మీ అమ్మనిన్ను అస్సలు బాబాయి అని పిలవదుగా అని చెప్పాడు డిటెక్టివురావు.

అప్పుడు బాబాయి ఇలా ఎగ్గిరిపోయి, భలే భలే భలేగా చెప్పావు అని డిటెక్టివురావు బుజం మీద ఘట్టిగా కొట్టేశాడు.

వాడు పాపం, అరుగుమీంచి దభీమనిపడిపోయేశాడు.

డిటెక్టివురావు అంటే నాకు తెలీదు. బాబాయికీ తెలీదు. వాడికి కూడా తెలీదట.

వాడికి ఖూనీలుఅంటే యిష్టంట. ఖూనీలు అంటేనాకు తెలీదు.

డిటెక్టివు రావుకి పేద్ద మీసాలున్నాయి.

డిటెక్టింగు చేసినప్పుడు అవి పెట్టుకోవా లిట. అప్పుడుటుపాకీ కూడా పట్టుకోవాలిట.

నువు కాలిచేస్తున్నావుగాఅని చెప్పాను.

ఇంకా వున్నాయా బీడీలూ అన్నాడు డిటెక్టివురావు ఆసిగా.


నువు. డిటెక్టివిగా చెప్పుకో చూద్దాం అన్నాడుబాబాయి.

డిటెక్టిలికి ఇలాటివి అన్నీ తెలుస్తాయిట.

కాని వీడికి తెలీ లేదనుకో.



ఇలా విరిగిపోయిన అద్దంముక్క లోంచి బాబాయి ని చూసి వుంటాయి



బాబోయ్ అని గాఠిగా కేక పెట్టేసింది బామ్మ.

ముందస్తుగా బాబాయి, డిటెక్టివురావూ హడ్డిలిపోయారు. నేను కూడా కుంచెం హడ్డిలిపోయాను.

ఎందుకంటే, బామ్మ అలా కేక వేస్తే మనికి డేంజరులే.

తేలు కుట్టితే బామ్మ అలా బాబోయ్ అంటుంది.

యేం. ఒక్కోసారి మరి మనం జటకా తోలడానికి బీడీలుతెస్తామా. అవి బామ్మ వత్తులపెట్టిలో దాచుకుంటామా.

బామ్మ అవి చూసినాసరే తేలు కుట్టినలాగే బాబోయ్ అంటుంది.

ఇప్పుడు ఏం జరిగిందీ అని నాకు అవమానం వేసింది.

వురేయ్ బాబాయ్ బామ్మ పిలుస్తోందిరా నిన్నే అని చెప్పాను.

బాబాయి కాదుకాయి బాబో

యేం? డిటెక్టివు రావు మళ్ళీ మెట్లు ఎక్కి అరుగుమీద కూచున్నాడా?

అప్పుడేమో, బాబాయి, వురేయ్ బుడుగూ లోపలికెళ్ళి బామ్మఎందుకు బాబోయి అందో చూసి రారాఅని చెప్పాడు.

నాకు బయ్యంవేసింది. బామ్మకి తేలు కుట్టితే పరవాలేదనుకో. అక్కడ బీడీ వుంటే యెలా అప్పుడు ప్రైవేటు చెప్పేస్తుందికదా.మరి.

నేను వెళ్లను. బాబాయీ అని చెప్పేశాను.

మరి వున్వ్వ బీడీలు అక్కడెందుకు దాచావూ అన్నాడు బాబాయి కోపంగా.

మరి గూటిలో పెట్టితే



రూపాయిల కేసు



అన్నాడు.

బాబాయేమో నవ్వేసి ఉండవులే అన్నాడు.

ఇంతట్లో ఇంటి లోయింకా గొడవ అయిపోయింది. అయ్యో హయ్యో అని కేకలు వేస్తున్నారు.

నాకూ డా బయంవేసింది.

చూడరా బుడుగూ అన్నాడు బాబాయి.

నేను చెప్పనా చూడకండానే అని అడిగాడు డికెష్టివు రావు.

చెప్పు అన్నాడు బాబాయి.

ఖూనీ అన్నాడు డికెష్టివాడు.

హయ్యబాబోయ్ ఖూనీయే. ఎవర్ని అన్నాడు బాబాయి యిలా హడిలిపోయి.

ఖూనీ అంటే ఏమిట్రా అన్నాను నేను.

ఫది రూపాయలో, ఒకబీడీయో ఇస్తే చెప్తానుఅన్నాడు డికెష్టివు.


వురేయ్ బుడుగూ యిలా రా అని అమ్మ పిలిచింది ఇంతట్లోకి.

*   *   *

అప్పుడేమో బుడుగు బయపడిపోయాడు.

డికెష్టివురావు బుడుగుని దగ్గిర్నా కాకలించుకునేసి వెళ్లకు బుడుగూ కూనీ కూనీ టుపాకీ పేలిచేస్తారు అన్నాడు.

బుడుగు బాబ్బోయ్ బాబోయ్ అన్నాడు పాపం ఏడుచుతూ.



యిక్కడే వున్నానురా బయపడకు అన్నాడు బాబాయి.

బాబాయి కాదు బాబోయ్. బాబోయి అన్నాను బాబాయ్ అని ఘట్టిగా చెప్పాడు బుడుగు.

యేం యేం అన్నాడు డికెష్టివురావు.

వెదవా నీమీసాలూ, చోక్కా గుండుసూదీ గుచుకున్నాయి నాకు. అని వాడి గుండుమీద (చిన్న క్రాపింగు ఉందిలే ఆ బోడివెదవకి) కొట్టేశాడు బుడుగు.



వురేయ్ బుడుగూ నిన్నేరా ఇలా రా అని



పిలిచింది ఒక ఆడగొంతుక.

ఆడది పిలుస్తోంది అని చెప్పాడు డికెష్టిరావు అటుకేసి బయంగా చూస్తూ.

మా అమ్మ అని చెప్పాడు బుడుగు.

ఔను మా వదిన అని చెప్పాడు బాబాయి.

అయితే రొండు గొంతుక లన్న మాట. చూశావా. ఒక్క కూనీల వాడు ఒక టుపాకీతో నించుని రొండు గొంతుకలతో పిలుస్తూన్నాడు. ఈ కేసు చాలా చిత్రంగా ఉంది అని చెప్పేశాడు డికెష్టివాడు.

కాదు ఒకటేరా, మా వదినే వాళ్లమ్మకదా అన్నాడు బాబాయి.

యేమో హంతకుడు దొరికితే కాని ఆ సంగతి చెప్పలేను అన్నాడు డికెష్టిరావు అద్దం ముక్కలోంచి చూస్తూ.

వాడి మాటలు బుడుక్కి తెలీ

మరి మనికి ఎలా తెలుస్తుంది అని అడిగాడు బాబాయి.

మనం లోపలికి వెళ్లిచూద్దాం అన్నాడు వాడు.

మరేమో, ఒక ఫిష్టోలు, సిగరెట్టు, ఒక ఓరుకోటు (పేద్దదిట), యింకా రెండు మీసాలు, కుంచెం రత్తం, మళ్లీ నేమో ఒక రెండు జెడల సీతా కావాలి అని చెప్పాడు వాడు.

సీత అంటే బాబాయికి కోపం వచేసింది. బుడుగుకి బోలు హాచర్యం వచ్చేసింది.

సీతని పిల్సితే వాళ్ళ తాత తంతాడు నేను పిలవను బాబూ అని చెప్పేశాడు బుడుగు.

ఈ సీతకాదూ, అసలు ఏసీతేనాసరే ఏదో ఒక సీత కావాలీ అని చెపాడు డికెష్టి. అయినా బాబాయికి కోపం పోలేదు. ఎందుకు అని అడిగాడు.

ఏంలేదు: తెలుగు డికెష్టినికదా. ఒక్కసారి ఆడ సెక్రటేబుజంమీద చెయేసి నవ్వాలి అన్నాడు డికెష్టి.

ఛంపేస్తుంది తెలుసా? ఉత్తినేనవ్వినా చంపేస్తుందీ, ఇంకా బుజంమీద చెయిపెట్టి నవ్వినా ఇంఖా చంపేస్తుంది సీత అని చెప్పాడు బాబాయి. మరి, సీత లేకపోతే డికెష్టను చెయ్యడం యెలా అన్నాడు డికెష్టి.

లాపోతే మానెయ్యి అన్నాడుబాబాయి.

* * *

వురేయ్‌బుడుగూ నిన్నె పిల్చింది చెవుడా యిలారా అంది బుడుగువాళ్ళమ్మ మళ్లీ.

అపుడు బుడుగు లోపలికి వెళ్లాడు.

మీబామ్మ బాబాయిని పిల్చిందని చెప్పు అంది అమ్మ. మళ్ళీ పీదరుగుమీదికివచ్చి బాబాయిని పిలిచాడు.

బాబాయి లోపలి కెళ్ళి మళ్ళీ పరిగెతు కొచ్చాడు.

వంటింటో వందరూపాయలు పోయాయి అని చెప్పాడు ఘట్టిగా.

ఇది ఛాలా ఛిత్రమైన కేసు. నేను డికెష్టింగు చేస్తాను. నన్ను అడుగు. అన్నాడు డికెష్టి యిలా కళ్లు యిప్పి చూసి. సరే చెయ్యి అన్నాడు బాబాయి.

అప్పుడు ఆడికెష్టివాడు జేబులోంచి ఇంకా పేద్దమీసాలు తీసి పెట్టుకుని హూ అన్నాడు.

అనేసి ఘబుక్కున ఇలా కిందపడి పోయాడు.

మళ్ళీ కుంచెం లేచి, సిగరెట్టు కాల్చి ఖుఉ అని యిలా పాపాయిలాగా పాకుతూ లోపలికి వచ్చాడు.



గుర్రం ఎక్కినా డిక్షేష్టివాడూ అని అడి గాడు బుడుగు.

కాని వాడి మీసాలు చూశాక అవమానం వేసి ఎక్కలేదులే.

వాడు అలా లోపలికి పాకిపాకి వంటిల్లు దాకా వచ్చాడు.

అమ్మ హడ్డిలిపోయి యేమిటిది బాబోయ్ అంది.

ఫరవాలేదు డిక్షేష్టితే అని చెప్పాడు బాబాయి.

వంటిట్లో వందరూపాయలు ఎక్కడ పోయాయి అని అడిగాడు డిక్షేష్టి.

వంటింటో వందరూపాయలు కాదూ మామూలు వందరూపాయలే పోయాయీ అని చెప్పాడు బాబాయి.

అంతట్లోకి బామ్మ హావురా హావురా అని కేకలు పెట్టేసింది.

బయంలేదు బయంలేదు. టుపాకీ యియ్యండి పేలుస్తాను అని చెప్పింది డిక్షేష్టి.

ఎవడ్రా నువ్వు ముందరా వెదవ సిగరెట్టు అవతల పారెయ్యి వెదవా. మరేమోనూ వంటింటిలో సిగరెట్టు కాలుస్తావా, ఇంకా నేమోనూ-నీ సిగరెట్టు మండిపోనూ అని ప్రెపేటు చెప్పింది బామ్మ.

డిక్షేష్టి హడిలిపోయి, సిగరెట్టు పారేసింది.

ఇక్కడ కాదు వీధిలో పారెయ్యి అని చెప్పింది బామ్మ.

డిక్షేష్టి లేచి వీధిలో పారేసి మళ్ళీ పాకుతూ వచ్చింది కోపంగా.

వంటింటో వంద రూపాయలు ఎక్కడ పోయాయి అంది మళ్ళీ.

ఏమో తెలీదు అన్నాడు బాబాయి.

ఎవరూ యేం ముట్టుకోకండి శవం యెక్కడుంది అంది డిక్షేష్టి.

శవం అంటే నాకు తెలీదు. కాని బామ్మకి తెలిసిపోయింది. శవం లేదు నీశార్ధం లేదూ ఎవడ్రా నువ్వు ఫో అనేసింది మళ్ళీ.

బాబాయికూడా ఖోపడేశాడు ఆవన్నీ ఇప్పుడెందుకురా అని.

మరి లాపోతే డిక్షేష్టింగు ఎలా అంది డిక్షేష్టి.

బుడుగుకి బలేబయం వేసింది. వాళ్ళమ్మ దగ్గిరకి వెళ్ళిపోయాడు. వాళ్ళమ్మ బుడుగు వీపు మీద మెల్లిగా కొట్టి బయంలేదమ్మా అని నెత్తిమీద ముద్దుపెట్టుకుని యిలా వాసన చూసింది. అప్పుడు బుడుగుకి బయం పోయింది.

యేం? డిక్షేష్టి యిలా పాకుతూనే వంటిల్లు అంతా అద్దం ముక్కలోంచి చూస్తున్నాడు.

బామ్మకి కోపంపోయి హాచర్యం వచ్చేసింది.

ఈ పిల్లాడికి చత్వారమా ఏమిటిరా లాపోతే అలా పడుకుని వెతుకుతాడూ అంది.

అప్పుడు డిక్షేష్టి లేచికూచుని యిలా నవ్వాడు.

నవ్వి, అదికాదండి బామ్మగారూ ముందస్తుగా రక్తం ఎక్కడుందో వెతకాలి అని చెప్పాడు.

అప్పుడు బామ్మ చీపురుకట్టతీసి, పోతావా లాపోతే చితక్కొట్టనా అంది.

బాబాయేమో వద్దని చెప్పాడు. వెతక్కపోతే వందరూపాయలూ దొరకవుకదా అన్నాడు.

అంతట్లోకి నాన వచేశాడు ఆఫీసునించి.

గోపాళం అంటూ బామ్మ, అమ్మ, బాబాయి అందరూ వెళ్లిపోయారు.

డిక్షేష్టి బుడుగుని పిల్చి, ఎవరూ బుడుగూ అన్నాడు.

బుడుగూ వాళ్ళ నాన్న గోపాళం రా అని చెప్పాడు బుడుగు.

ఓహో మీ నానతో ఎవరోవచ్చారే అన్నాడు డిక్షేష్టి.

బుడుగు కుంచెం అవతలిగదిలోకి వెళ్లి చూసివచ్చి, వాడూ, లావుపాటి పక్కింటి పిన్నిగారి ముగుడులే అని చెప్పాడు.

జానుకానీ మీనానని కొంచెం అర్జెంటుగా పిలూ అన్నాడు డిక్షేష్టి.

సరే అని బుడుగు, వాళ్ల నానావాళ్లు దగ్గిరికివెళ్లి డిక్షేష్టి పిలుస్తోందీ రండీ అని చెప్పాడు.

నానావాళ్లు, యెలాపోయిందిడబ్బు యెలాపోయింది అంటూ నా వెనకాతలే వంటింటోకి వచ్చారు.

కాని హాచర్యం!

డిక్షేష్టి ఏడీ! వాడుకూడా పోయాడు!

హారె! మ్మాయం అయిపోయాడే!

బాబాయి, నాన్న, అమ్మ, బామ్మ, లావుపాటి పక్కింటి పిన్నిగారి ముగుడూ అంధరూ హాచర్యపడిపోయేశారు. డిక్షేష్టి ఘుబుకున ఎలా మాయంఅయిపోయాడూ అని.

వక్కశవంకూడా లేదు. కుంచెం రత్తం కూడా లేదు. కూనీ జరిగిందేమో అన్నాడు బాబాయి.

ఛప్ అని కోప్పడాడు నాన.

మనందరం యిక్కడే వున్నాంగదాఅంది అమ్మ.

పెరటి తలుపు తాళం వేశానుకూడా అంది బామ్మ.

డిక్షేష్టి ఏమైపోయింది?

(మళ్లీ వారం చెప్తాలే.)

వలసి వచ్చిన అదృష్టం

1

ఆ వార్తకు ఊరంతా అట్టుడికినట్లయిపోయింది. లైబ్రరీ దగ్గరనుంచి ఆడవాళ్ళంతా జేరే రంగమ్మగారి సావిడి దాకా ఆ విషయం మినహా మరో విషయం మాట్లాడిన గొంతు లేదు. కొందరు ఆ!-ఇదంతా అబద్ధం-అన్నారు. కొందరు ఏమో, ఆ ఇల్లాలికి ఎక్కడ అదృష్టపుగీత ఉందో అన్నారు. కొందరు ఇక ఆనంబి ఆచార్లకి పట్టపగ్గాలుంటాయా అన్నారు. మరికొందరు ఆ పిచ్చి మహారాజుని బుట్టలో పెట్టాడు అంటూ అక్కసు వెళ్ళగక్కారు. ఆ! వాడికంత తెలివి ఉందంటావా?" అని అడిగాడు మరో సందేహాత్ముడు. నంబాచార్లు తెలివి అలగాడికి తెలియకపోలేదు. ఇంకొసేపు నంబాచార్లును గురించి ఆ ప్రసంగం పెంచాలి.

"ఆ! అలా ఉంటాడుగానీ-నంబాచార్లు దేవాంతకుడు" అన్నాడు మరో వక్త. బుగ్గలు పొడుచుకున్నారు కొందరు. మూతులు విరుచుకున్నారు కొందరు. గుండె పగిలేలా లోలోపల కుళ్ళిపోయింది అనంత రాయమ్మ.

నంబాచార్లు ధర్మపత్ని కొంతమ్మకు పట్టబోతున్న అదృష్టం తల్చుకునేసరికి సుబ్బరాయమ్మ కడుపు మండిపోయింది అప్పుడే. నిన్న మొన్నటిదాకా - ఆ నాలుగు కొంపలకీ యింతకుముందు కూడా ఉప్పూ అప్పూ తీసుకెళ్ళింది. ఉప్పేమిటి సమస్తం అప్పే. ప్రొద్దున్నుంచి సాయంత్రందాకా ఒక అర్ధసేరు కందిపప్పు కావాలంటూ ఎక్కే గుమ్మం దిగే గుమ్మం. అటువంటి కొంతమ్మకు యింత అదృష్టం ఏమిటి అర్థం లేకుండా అని ఆ యిల్లాలి ఘోష.

ఎవరు ఎన్ని అనుకుంటేనేం, జరగవలసింది జరక్కుండా ఉంటుందా? నంబాచార్లగార్కి ఆ మహారాజు నలభై ఎకరాల కురుక్షేత్రంలాంటి పొలం, దమ్మిడీ పుచ్చుకోకుండా, కేవలం ఉరికినే దఖలు చేశాడు.

ఎస్టేట్లు ఎలాగో పోతున్నాయి. తరతరాలనుంచి జమీందారీని కనిపెట్టివున్న కుటుంబం-మరి ఆ మాత్రం ఉపకారం చేస్తే న్యాయమని ఆ జమీందారుగారికి తోచి ఉండొచ్చు.

కాని ఆ ఊళ్ళో నాటికి తొంభైమందికి జమీందారుగారు చేసిన పని ఏమంత ఇదైంది కాకపోయింది.

"ఇలాగే జమీనంతా క్షీణించిపోయింది. అయినవాడికీ కానివాడికీ యిష్టం వచ్చినట్టు దానధర్మాలు చేస్తుంటే ఎన్నాళ్లు జరుగుతుంది" అని ఆ జమీందారుమీద గల భక్తిని వెళ్ళబుచ్చాడొక నిష్కామ కర్ముడు.

* * *

2

రోజూ ప్రొద్దున్నుంచి సాయంత్రం దాకా క్షణం తీరిక లేకుండా, తిరిగిన వాడు తిరిగినట్టే ఉండేవాడు నంబాచార్లు. తెల్లవారుజాము నాల్గింటికి లేచి-దేవతార్చన చేసి-ఓ మందులసంచీ పుచ్చుకొని పొరుగునగల నాలుగయిదూళ్లు చుట్టి వచ్చేవాడు. ఆయన తాతలు తండ్రులూ

నండూరి విఠల్ బాబు

ఆయుర్వేద వైద్యంలో పేరుగన్నవారు. నంబాచార్లుగారు అంత గట్టి బుర్ర కాకపోయినా కాస్తో కూస్తో వేరే ఆధారం అంతగా లేదు గనుక-వైద్యం చేసి సంపాయించక తప్పటం లేదు. ఆయన విరివిగా ప్రయోగం వచ్చినా అగ్నితుండిమాత్రలే వేస్తుంటాడని అనేకులు అనటంకూడా కద్దు. సాధారణంగా అనేకమంది ఆయన వైద్యం జోలికిపోరు.

నంబాచార్లు ఎంత పెద్దకేసు, ఎన్నాళ్లు తిరిగి నయంచేసినా, నాలుగు రూపాయలు కంటె ఎక్కువ ఆశించడు. అయిదురూపాయిలిచ్చే అందలం ఎక్కించినట్లు పరుగు పరుగున వచ్చి భార్య కొంతమ్మకు ఈ శుభవార్త చెప్పేదాకా ఊపిరి పీల్చుకోడు. ఆయనకు చాలామంది డబ్బు ఎగకొట్టేవాళ్ళే. అయినా మానవుడు నోరెత్తి అడగడు. అసలా విషయం మర్చిపోతాడు.

ఆరుగురు ఆడపిల్లల్ని, ముగ్గురు మొగపిల్లల్ని పోషించి-నూరేళ్ళు నిండినా ఇరవై నాలుగ్గంటలూ, పటిక బెల్లం - ద్రాక్షపళ్లూ కావాలంటూ శోకాలుపెట్టే ముసలమ్మను తృప్తి పరుస్తూ-గుండెజబ్బుగల కొంతమ్మ కోసం మందుమాకులకు ఋణమో ఫణమో ఖర్చుపెడ్తూ సంసారం ఈదుకొస్తున్నాడు నంబాచార్లు.

పెద్దపిల్లకు వెంకటమ్మకు రెండేళ్ళ క్రితమే పెళ్ళిచేశాడు. ఆ అమ్మాయి ఎందువల్లో అందమైనపిల్ల కావటంవల్ల, హయ్యర్ గ్రేడు ప్యాసై పుట్లగుంటలో బడిపంతులు ఉద్యోగం చేస్తూ నలభై తొమ్మిది రూపాయలు సంపాదిస్తున్న వేదాంతాచార్లు కిచ్చి చేతులు కలుపుకున్నాడు.

తన కూతుర్ని ఓ ఉద్యోగస్థుడి కిచ్చినందుకు కొంతమ్మ గర్వించినా, అనవరతం లౌకిక లోకాన్ని విడిచి, ఆధ్యాత్మిక విషయాలలోనూ, భోగ నీలలోనూ మునిగి తేలుతున్న అల్లుడు వేదాంతాచారి వైఖరి ఆమె కంతగా నచ్చలేదు.

పోనీలే-ఏం మాట్లాడినా, నెలయ్యేసరికి నలభై తొమ్మిది రూపాయలు భళ్లున వళ్లో పోసుకొస్తున్నాడని నంబాచార్లు ఓర్పుగా కొంతమ్మను సమాధానపర్చాడు.

ఇలా ఉండగా వేదాంతాచార్లు ఆ నిక్షేపంలాంటి బడిపంతులుద్యోగాన్ని పోగొట్టుకున్నాడు. ఇంతకీ జరిగిందేమిటంటే, అతగాడు చదువుచెప్పేది నాలుగయిదు క్లాసుల వాళ్ళకే అయినా సర్వదా, జీవితం క్షణభంగురమనీ, బ్రతుకుబుద్బుదప్రాయమనీ, యౌవనం సౌదామిని వంటిదనీ, ఐహిక సుఖాలు తుచ్ఛమనీ-మాంసరక్తమయమైన శరీరం హేయమైనదనీ-ఇత్యాది బోధనలతో పిల్లలకు చదువు రాకుండా, జోగులుగా, బైరాగులుగా చేస్తున్నాడనీ — పుట్లగుంట మునసబు పరంధామయ్యగారు ఆరోపించటంతో ఆయన్ని ఆ ఉద్యోగంనుంచి బర్తరఫ్ చేశారు.

ఆ వేదాంతాచార్లుగారు, గర్భవతిఅయిన భార్యతో మామగారింటి కొచ్చేశారు శాశ్వతంగా ఉండడానికి. ఇంట్లో యిప్పాటలూ భోంచేసి—వీధి అరుగుమీద కూర్చుని, వచ్చే పోయేవాళ్ళని బలవంతంగా పిల్చి, జీవితం ఎంత క్షణభంగురమో, సోదాహరణంగా వివరించటంతో రోజులు గడుపుతున్నాడు వేదాంతాచార్యులవారు.

బుద్బుదప్రాయమైన జీవితంకోసం మళ్ళీ మళ్ళీ ఉద్యోగ ప్రయత్నాలు చేయదల్చుకోలేదు ఆ వేదాంతి. ఆయన భార్య అనగా నంబాచార్లుగారి ప్రథమపుత్రిక నొప్పులు పడుతూ, నీరసంవల్ల వాతం కమ్మి స్పృహ

తప్పితే—నిర్లిప్తంగా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్న అల్లుణ్ణి చూసేసరికి కాంతమ్మ ఒళ్ళు మండిపోయింది. ఇంత మహాజ్ఞానం సంసారం చేసేటప్పుడు ఏమైందో? అంటూ విసురుగా వెళ్ళిపోయింది ఆ యిల్లాలు. దైవకృపవల్ల వేదాంతాచార్యులు గారికి మొగపిల్లవాడు కలిగాడు. ఎవరో అభినందిస్తే—"నాదేముంది? దైవకృప" అన్నాట్ట ఆ మానవుడు.

తొమ్మండుగురు పిల్లల్ని పోషించడమే ఒక సమస్యగా ఉన్నప్పుడు కూతురూ, అల్లుడూ వాళ్ళ సంసారాన్ని కూడా నిభాయించుకు రావటం కష్టమైనా నంబాచార్లు అల్లుణ్ణి మరో ఉద్యోగం చేసుకోవయ్యా అని అడిగే స్వభావం కలవాడు కాదు. ఇక పెండ్లికి ఎదిగిన అయిదుగురు ఆడపిల్లలూ పెళ్ళిళ్ళయి కాపురానికి వెళ్ళాలంటే కనీసం కొన్ని వేల రూపాయలు ఉండితీరాలి. మరో సంగతి ఏమంటే నంబాచార్లు పెద్దకూతురొక్కతే కొంత అందకత్తె. తక్కినవాళ్ళు అంతా కాకిపిల్లల్లా ఉంటారనీ, చాలా గడుసు పిండాలనీ—వాళ్ళని చేసుకోవటం కంటె సన్యాసం పుచ్చుకొని హిమాలయాల్లోకి పోవటం మంచిదనీ—పొరుగింటి అనంతరాయమ్మ పనికట్టుకొని ప్రచారము చేస్తోంది భారీయెత్తున.

అనంతరాయమ్మ మాటలలో అవగింజంతైనా అసత్యం లేదని తెలుసుకున్న పెళ్ళివారు, తర్వాత తెలియజేస్తామంటూ వెళ్ళిపోతున్నారు.

విధి అరుగుమీద ముసలమ్మకూ—ఈ ఆడపిల్లలకూ క్షణం పడదు. అందులో నాంచారమ్మంటే ఆ ముసలావిడకు అరికాలిమంట నెత్తికొస్తుంది. ఎప్పుడూ ముసలమ్మ—మనవరాళ్లు కిచకిచ లాడుకుంటూనే ఉంటారు.

ఎంత పోట్లాడుకున్నా వాళ్ళందరినీ, తనలో యింటివాళ్ళను చెయ్యాలని - కనపడ్డ ప్రతి కుర్రవాడి కులగోత్రాలు వాకబు చేస్తుంటుంది ఆ ముసలమ్మ.

ముసలమ్మకూ కాంతమ్మకూ కూడా అంత సయోధ్యత ఉండదు. ఎటు తిరిగీ ఆడపిల్లలు యెదిగి గుండెలమీద కుంపట్లుగా ఉన్నా, నిమ్మకు నీరెత్తినట్లు చీకూ చింతా లేకుండా వళ్ళు దులుపుకుపోతున్న నంబాచార్లుమీద యుద్ధం ప్రకటించేటప్పుడుమాత్రం-ఇద్దరికీ ఎక్కడలేని సయోధ్యతా వచ్చేది.

నంబాచార్లుకి నోట్లో నాలిక లేదంటారుగా అందరూ. వచ్చిన ప్రతి సంబంధం ఖాయం ఔతుందనే నమ్మకంతో సంబరపడేవాడు ఆ తండ్రి. వాళ్లు పెడముఖం చూపేసరికి, ఆ ఆరుగురు ఆడపిల్లల్ని కన్న తండ్రి కళ్ళల్లో నీళ్లు తొంగిచూసేవి. ఎవరూ చూడకుండా కళ్ళు తుడుచుకుని, మందులసంచీ చేతపుచ్చుకొని తాటాకు గొడుగులో ముఖాన్ని దాచుకొని వెళ్ళిపోయేవాడు నంబాచార్లు.

నున్నగా గుండు చేయించుకుని - పిలక కదురుగా ముడివేసుకొని - గుండెలమీద, జబ్బలమీదా, మొహంమీదా, స్పష్టంగా నామాలు పెట్టుకొని. ఇంత సంసార భారాన్ని వహిస్తూ కూడా, చిరంతనానందస్వామిలా చిరుమందహాసంతో ఉండే నంబాచార్లుని చూస్తే-ఊళ్ళో ఎవరికీ ఏవిధమైన జాలీ లేదు.

ప్రపంచం ఎలా తిరుగుతున్నదో ఆయనకక్కర్లేదు. కమ్యూనిజం ఎంత మంచిదో ఆయనకు శ్రద్ధలేదు. మూడవ ప్రపంచ యుద్ధం ఎంత దారుణమైనదో ఆయనకు భయంలేదు—

కనీసం-భారతయుద్ధంలా జరిగిన సాక్షాత్తు ఆ వూరి పంచాయతీబోర్డు ఎలక్షన్లలో ఎవరు గెల్చింది అయిదారు రోజులుదాకా ఆయనకు అక్షరాలా తెలియదు.

అయినా నంబాచార్లంటే ఒంటికాలు మీద లేస్తుంది అనంతరాయమ్మ. వాళ్ళకో అగ్రహారం ఉంది. ఆ తర్వాత ఆ ఊరి గుడి మీద ఏ బాపతుదో కాని, కొంత అధికారం ఆవిడ భర్తకుంది.

అనంతరాయమ్మ గీచిన గీటుదాటని శంకరయ్య అనే శివశంకరశాస్త్రిని భర్తగా సంపాదించింది. అనంతరాయమ్మకు మొదటి నుంచీ, నంబాచార్లు భార్య కాంతమ్మంటే ఓ విధమైన కోపం - ద్వేషమూను. ఆవిడకు తోడుగా సుబ్బరాయమ్మ కలుస్తుంది. ఇద్దరూ అన్నాళ్ళు నీళ్ళు మాని, కాంతమ్మ కూతుళ్ళకింక పెళ్ళిళ్ళు కావనే సంబరంతో ఒకరినొకరు కౌగలించుకుని చెవులు కొరుక్కుంటూ ఖులాసాగా కాలక్షేపం చేసేవాళ్ళు.

అంత దరిద్రపుగొట్టు సంసారంచేస్తూ కాంతమ్మ అంత అందంగా ఉండటమేమిటని అనంతరాయమ్మ ఉవాచ: అయినా పిల్లలందరు కోతులేగా అని సుబ్బరాయమ్మ సంతోషం-వీళ్ళకిక పెళ్ళిళ్ళు కావటం కలలోని వార్తని ఇద్దరికీ అంతులేని నమ్మకం - ఎక్కడలేని సంబరం.

తాతముత్తాతలు ఎంత తగలేసినా, నంబాచార్లుకు పూర్వార్జితమైన ఆస్తి కావలసినంత ఒచ్చింది. కొని అణాన్నర పట్టుదలకోసం, హైకోర్టుదాకా కథ నడిపించి కొంత ఆస్తినీ, ఆ తర్వాత టూరింగుసినిమాలు పెట్టించి కొంత ఆస్తినీ, ధాన్యం వ్యాపారంలో మిగతా ఆస్తిని పోగొట్టుకొని పదిమంది పిల్లలతో పొట్ట చేత్తో పుచ్చుకుని ఆ చింతపెక్కల అగ్రహారం చేరాడు నంబాచార్లు పది సంవత్సరాల క్రితం.

కాంతమ్మ ఒంటిమీద నగలూ, ఇంకా ఇతరత్రా వచ్చిన అయిదు వేల రూపాయలూ పెట్టి ఆ ఊళ్ళో ఓ మంచి డాబా కట్టుకుని- ఆ గుళ్ళో అర్చకత్వంచేస్తూ కాస్తో కూస్తో

★ కలిసివచ్చిన అదృష్టం ★

వైద్యం చేస్తూ—కాలక్షేపం చేస్తున్నాడు నంబాచార్లు.

అలాటి నంబాచార్లుకు అనుకోకుండా, అకస్మాత్తుగా, అనవసరంగా, అంత ఆస్తి వచ్చిపడిందంటే-ఆ వార్త అంత అలజడి కలిగించటంలో ఆశ్చర్యమేమిటి?

ముఖ్యంగా అనంతరాయమ్మకు అన్న హితవు పోయింది. బ్రతికినంతకాలం గుదిబండల్లా ఉండి పెళ్ళికాని కూతుళ్ళ విషయం చెప్పి—సుబ్బరాయమ్మ ఎంత ఓదార్చినా, ఆమె సమాధానపడటంలేదు.

3

ముప్ఫై ఎకరాలు దఖలు చేయించుకుని, కొలంత ముఖంతో కొరు దిగాడు ఆ సాయంత్రం నంబాచార్లు. ఆరోజు వేడి నీళ్ళు పెట్టింది కొంతమ్మ భర్తకోసం—కున్నిపిండితో పిపురుద్దింది. తువ్వాలుతో తుడిచింది. అన్నంలోకి బంగాళాదుంప-ఉల్లిపాయల కూర చేసింది. పులుసు బాగా పెట్టింది. ఆకూరంటే ఆయనకు జీవుడు. అయినా చేసిపెట్టమని భార్యను ఏనాడూ అడిగి ఎరుగడు.

అన్నం తిన్నాక డాబామీద పడుకున్నారు. ఎంతోసేపు మంచంమీద కూర్చుని భర్తకాళ్ళు ఒత్తింది కొంతమ్మ. ఆ పండువెన్నెల్లో నిశ్చింతగా రీవిగా పడుకున్న భర్తమీద వల్లమాలిన జాలి ముంచుకొచ్చి కొంతమ్మకు కళ్ళు చెమ్మగిల్లాయి.

పెళ్ళి జరిగిన కొత్తల్లో ఆస్తి కరగని కాలం—ఆశలలో రంగరించిన భవిష్యత్తును కళ్ళల్లో దాచుకుని కాపురాని కొచ్చిన కొంతమ్మ ఇన్నాళ్లకు కనిపించింది నంబాచార్లు కళ్ళకు మళ్ళీ.

ఆ రాత్రి వాళ్ళు నిద్రపోలేదు. నిద్ర రాలేదు. ఇన్నాళ్ళూ కొంతమ్మతో సుఖంగా ఉండేవాడు భర్త. వాళ్ళ మధ్య ఎక్కువ సంభాషణ జరిగేది కాదు.

ఆరోజున కొంతెమ్మమీద అంతులేని ప్రేమ పొంగి పొర్లింది ఆయనకు.

ఇల్లు అమ్మేసి వచ్చిన డబ్బుతో పొలం బాగుచేసుకుంటే, లక్షరూపాయల ఆస్తి ఔతుందని—పొలానికి ఉత్తరపు పరిహద్దున వాగు ఒకటి పోతున్నదని, చిన్న చెరువు త్రవ్వించుకొని ఆవాగులోని నీరు మళ్ళించుకుంటే-ముప్ఫయి ఎకరాలు పల్లం అయిపోతుందనీ-లెఖ్ఖలువేసి చూపెట్టాడు ఆచార్లు.

అప్పుడు ఎకరం-ఎంత హీనంగా చూసుకున్నా మూడువేలు చేస్తుంది కొబట్టి—అయిదెకరాలు అమ్మి ముందు అయిదుగురు కూతుళ్ళకూ ఆమూడు ముళ్ళ చొప్పునా వేయించి, తలో యింటివాళ్ళనీ చేయ్యాలని కొంతమ్మ నొక్కి చెప్పింది.

"పిచ్చిదానా-మీకోసం కాక-నాకింకేం కావాలే" అన్నాడు ఆచార్లు గద్గద స్వరంతో.

సంతోషంలో కూడా ఓరకమైన విషాదం దాగిఉంటుంది కామాల్సు.

చిల్లరమల్లర బాకీలన్నీ తీర్చివేయాలనీ-మొదటిఏడు పంటరాగానే, యింటిల్లిపాదీ దుబారా అనుకోకుండా తలోనాల్గు జతలూ బట్టలు కుట్టించుకోవాలనీ, పెద్దవాడికి వచ్చే మాసం వడుగుచెయ్యాలనీ—ఇత్యాది సందర్భాల్లో జరగవలసినవన్నీ కొంతమ్మ ఏకరువు పెట్టింది. నంబాచార్లు అన్నింటికీ తల ఊపాడు.

ఇల్లు తనఖాపెట్టి మూడువేలు చేత పుచ్చుకొని సకుటుంబంగా పెద్ద కూతురూ ఆమె భర్తతోసహా గోకారం చేరాడు నంబిఆచార్లు. ఏలూరునుంచి బస్సుమీద పదకొండుమైళ్ళు ప్రయాణంచేసి 11వ మైలు రాయివద్ద దిగి, రెండెడ్లబండిపై ఆరుమైళ్లు ప్రయాణం చేసి లోపలికిపోతే గోకారం ఊరు తగులుంది. ఆఊరికే కోతుల గోకారం అనే మరోపేరుండటంబట్టి, అక్కడ కోతులు సమృద్ధిగా ఉంటాయని తెలియవస్తుంది.

ఆగోకారం గ్రామం శివార్లలోనే, ఆజమీందారుగారు ఈ నంబిఆచార్లుగారికి ముప్ఫయి ఎకరాల పొలం దఖలుచేసింది.

ఊళ్ళో దిగగానే పెద్దల్నందరినీ దర్శనం చేసుకున్నాడు ఆచార్లుగారు. ఆఊళ్ళోకల్లా మోతుబరిరైతు రత్తయ్య, పళ్లికిలిస్తూ, ఏం బావమ్మడా ఈపొలాలు ఎందుకు పనికొస్తాయయ్యా—దీనిమీద ఎంత పెట్టినా దండగే, అని చప్పరించినపుడు నంబాచార్లు మనస్సు చివుక్కుమంది.

ఆ ఊరి మున్సబు—కొస్త మంచివాడని ప్రతీతికావటంవల్ల ఆయన్ని ఆశ్రయించి తను పొలనలో తమ నీడక్రింద ఇంత ఆదరువు చూపెట్టమని ప్రాధేయపడ్డాడు నంబాచార్లు. తను చేయగలిగిందంతా చేస్తానని వాగ్దానం చెయ్యటమే గాకుండా, తన సావిడిలోనే తడికలు కట్టించి కుటుంబంతోసహా అక్కడే వుండమన్నాడు.

మున్సబుతో తన దీనగాథనంతా వెళ్ళబుచ్చుకుని, మళ్ళీ ఇన్నాళ్ళకి, ఒక సెంటు భూమంటూ తన పేర ఉండనీ—పిల్లలు గలవాణ్ణనీ, వాళ్ళని ఓదరి జేరిస్తే తనకు చీకు చింతా లేదనీ-కంట తడిపెట్టుకున్నాడు ఆచార్లు.

మున్సబు పూర్తిసహాయం చేస్తానన్నాడు. ఆచార్లుగార్కి దఖలుచేసిన పొలం ఒక చిట్టడవిలా ఉంటుంది. అడవినరికించి అమ్మితే-కొంత లాభం వస్తుంది. మోడు తీయించి అమ్మితే కనీసం ఖర్చులొస్తాయి. ఇక ఎకరానికి యాభై రూపాయల చిల్లర ఖర్చుతో గట్లు వేయించొచ్చు. ఏమైనా ఏడాది తిరిగేసరికి తగిన ఫలసాయం వచ్చేలా చూస్తానని హామీయిచ్చాడు మున్సబు.

నంబాచార్లు యింటికొచ్చి కొంతమ్మకీవిషయమంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. కొంతమ్మ వేయిదేవుళ్ళకు మొక్కుకుంది.

ఆచార్లు మున్సబు పంచన జేరాడన్న సంగతి విని రత్తయ్య మండిపోయాడు. "ఏం నెలగబెట్టాడో చూస్తాగా" అంటూ విషపు నవ్వు నవ్వి-అచార్లు పోవనపోతుంటే యికిలింపులూ సకిలింపులూ మొదలెట్టాడు. తలకాయ వంచుకొని పోయేవాడు ఆచార్లు. ఆ తర్వాత దేనిమీదనో పెట్టి ఘాటుగా మాటలు విసరటం మొదలెట్టాడు. తరువాత పొలంలోనే ఓ ఎకరం చదును చేయించి, పెద్దపాక వేసుకున్నాడు ఆచార్లు. నుయ్యి త్రవ్వించాడు పొగాకుతోట వేయాలనే సంకల్పంతో--పొలంలో చిట్టడవినంతా కొట్టించి కట్టెను అయిదువందలకు బేరమిచ్చాడు. కాని విధి మరోలా రాసిపెట్టింది. తెల్లవారేసరికి పొలంలో కట్టె మాయమై పోవటం చూసి నిర్ఘాంత పోయాడు. ఎవర్ని ఏమంటానికి తోచక గుడ్లనీరు గుడ్లలో కుక్కుకొని యింటికొచ్చాడు.

పొలంలో నలభై కుంకుడుచెట్లున్నాయి. పూత బాగా పట్టింది. అయిదారొందలు వస్తాయని అంతా అంటున్నారు. అల్లుడు వేదాంతాచార్లుని ఆ కుంకుడుచెట్లపై నిఘా వుంచాడు.

ఒకరోజు చీకటి పడుతుండగా, కుంకుడు చెట్లన్నీ ఒకసారి చూసుకొని ఇంటికొస్తున్న వేదాంతాచారిని ఎవరో చావమోదారు.

(56-వ పేజీ చూడండి)



పెద్దరికాలు

చిన్నవాళ్ళను అవసరంగానూ, అనవసరంగానూ కూడా తిట్టటం కొట్టటం అనేఅలవాటు మా నాన్నగారి దగ్గర్నుంచీ మా ఆఖరి అన్నయ్యవరకూ కూడా ఉంది. అదేం చిత్రమో కాని మా ఇంట్లో నాకన్న అందరూ పెద్దవాళ్ళే అవటంచేత సాధారణంగా నాకు ఎవర్ని తిట్టేందుకూ, కొట్టేందుకూ అస్కారం ఉండేదికాదు. అక్కడికీ చాలాసార్లు మనసులోనూ, అప్పుడప్పుడూ బయటికికూడా తిట్టి, వంటిమీద దెబ్బ పడకుండా నే గొంతుకుని ఏడవ స్థాయిలోనికి పోనిచ్చేదాన్ని.

ఒకరోజున మా గోపాలకృష్ణ అన్నయ్యా నేనూ భోజనం చేస్తున్నాం. ఇంతలో నే స్కూల్ ఫస్ట్‌బెల్ వినిపించింది. అంచేత అన్నం త్వరగా తింటున్నాను. కృష్ణన్న ఆ తొందరేమిటే?...అని ఒక పుల్ల మొట్టికాయ వేశాడు. ఆ మొట్టికాయతో సన్నటి సూది తలపై గుచ్చుకుని నోట్లోకి వచ్చినట్లయింది. వెంటనే 'నన్నెందుకొట్టేవ్ వెధవకానా' అని తిట్టేశాను. వంటింటిలో సామానులు సర్దుతున్న అమ్మ నీకన్న పెద్దవాణ్ని వెధవా అని తిడతావా అంటూ తిలవంచి నా వీపు మీద గట్టిగా ఒక దెబ్బవేసింది. నే నన్నం తినను అని చెప్పి అన్నం పళ్లాన్ని చేతితో నెట్టేసి ఏడుస్తూ, చిందులు తొక్కుతూ నే చేయి కడుక్కోటానికని నీళ్ళకుండీ వైపుకు నడిచాను. ఇంతలోనే మామ్మగదిలో పడుకున్న అక్క లేచి వచ్చి "చంద్రీ వెళ్ళి అన్నం తింటావా తినవా" అని హుకుం జారీ చేసింది. తిననా వద్దా అని తటపటాయించే అంతలో చెంపమీద చెళ్ళున చరిచి అన్నం పళ్ళెం వద్దకు లాక్కెళ్ళి కూర్చోబెట్టింది. కూర్చున్నానేగాని నోట ముద్ద పెట్టుకోలేక పోయాను. మాపెద్దన్న ఎప్పుడూ పేకబెత్తం చేతబుచ్చుకొని అదును దొరికినప్పుడు చురకలు వేస్తూ ఉండేవాడు. తనకిమట్టుకు పెద్దవాళ్ళను ఎదిరించే అధికారంకూడా ఉంది. మా పెద్దన్న నన్ను కొట్టిన ప్రతిరాత్రీ అన్నను నేనే పేకబెత్తంతో కొట్టినట్లు కల

మంచి-చెడ్డా



వచ్చేది. తెల్లవారేక కలను తలచుకొని ఎంత ఆనందించేదాన్నో.

ఈ శుభసమయం పెద్దన్న పోనీయదల్చుకోలేదు. హటాత్తుగా నా ఎదుట రాక్షసుడల్లే ప్రత్యక్షమయ్యాడు. హడలిపోతూ వాడి ముఖంలోకి చూశాను. చేయి నిలువున చాపి పేకబెత్తంతో—

అబ్బ! తల్చుకుంటుంటే గుండెలు తరుక్కుపోతున్నయ్. వీపు పొడుగునా పెద్ద దద్దురు తేలింది రెండో దెబ్బవేసే అంతలో అమ్మ అడ్డుపడి ఆ యమకింకరుణ్ని అక్కడనుండి పొమ్మని తిట్టింది. ఈరాద్ధాంతమంతా జరిగే సరికి నాకు స్కూలుకు వెళ్ళే వేళ మీరింది. ఏడుస్తూ ఏడుస్తూ అమ్మ పక్కలో నిద్రపోయాను. లేచి సావిట్లోకి వెళ్ళి చూతును గదా నాన్నగారు దినపత్రిక చదువుతున్నారు. గోడగడియారం రంగ్ రంగ్ మని నాలుగు గంటలు కొట్టింది. ఇంకొక అరగంట గడిస్తేనేగాని స్కూలు విడిచిపెట్టరు. పేపరు ప్రక్కకు తిప్పుతూ నాన్నగారు నను చూసి "ఏమే స్కూలుకు వెళ్లలేదా" అని ప్రశ్నించేరు. పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని కనుకొలకులవద్దే ఆపుకొని సమాధానం పాలుపోక అలా నిల్చుండిపోయాను. రెండు నిమిషాలు గుడ్లురిమి చూసి సమాధానం చెప్పవే అని కుర్చీలోనుంచి లేచి నా వైపుకు వస్తూ గద్దించేరు. నా కాళ్లువణికిపోయినయ్. బావురుమన్నాను. అనవసరంగా యేడుస్తావెందుకు అని చిలకకొయ్యకు వ్రేలాడుతున్న తాడు తీసి కాళ్లమీద సర్‌మనిపించేరు. నా కళ్ళు తిరిగినయ్. అమ్మా అని కేకపెట్టి నేలమీద కొరిగిపోయాను. ఆ తరువాత యేం జరిగిందో తెలియదు. కళ్ళు విప్పి చూతునుగదా, నా చుట్టూ అందరూ గుమిగూడారు. నీరసంగా అంతా కలియజూశాను. కళ్లు మండుతున్నయ్. సలసల కాలుతున్న వంటిమీద అమ్మ తన చల్లని చేయి వేసినిమురుతూంది. డాక్టరుగారు ఇంజక్షన్ గొట్టంలోనికి మందు లాగుతున్నారు. ఆ సమయంలో ఇంజక్షన్ చేయించుకోవటం నాకంత బాధనిపించలేదు. నా చేతిని డాక్టరుగారికి అప్పజెప్పి ముఖం ప్రక్కకు తిప్పుకున్నాను. వారం రోజుల తర్వాత మళ్ళీ ఆ రోజునే స్కూలుకు వెళ్లగలిగాను. నాకన్న పెద్దవాళ్లమనుకుంటున్న వాళ్లంతా ఉచితానుచితాలు ఆలోచించకుండా నన్ను హింసించేరే కాని అసలు జరిగిన తప్పేమిటో తరవాతకూడా తెలుసుకోవటానికి ఏ వొక్కరూ ప్రయత్నించలేదు. ఇటువంటి పెద్దరికాలున్న పెద్దలు అక్కడక్కడా ఉంటూనే ఉంటారు. ★

[illegible]

ఫలహారం మనకిచ్చే ఫలాలు

ఫలహారం అనే పేరు వినటంతోటే మనస్సుకు తట్టేది "టిఫిన్లు". ఎవరన్నా మనింటికి వస్తే మనం ఫలహారం అనేపేరుతో పెట్టేది ఏ ఉప్మా, ఇడ్లీ, దోసె, బజ్జీ లాంటివో, కారబూంది, కారపూస, పకోడీల్లాంటివో పెట్టి కాఫీ ఇస్తాము. వీటన్నిటి లోనూ ఫలము అనేది ఒక్కటీ లేదు. ప్రొద్దున భోజనం, రాత్రి భోజనాల్లో పప్పులు నూనెలు తిరగమూతలు ఎల్లాగూ వాడుతూనే ఉంటాము. ఈ రెండు భోజనాలకు మధ్యలో షుమారు 2, 3 గంటలకు ఆకలి వేసినప్పుడు ఏదో తినాలిగా! ఆ తినటానికి మనం ఎట్లాగూ భోజనంతోపాటు తినేపప్పులు, నూనెలు వాడేబదులు, అంటే ఏదోసె, ఇడ్లీ, బూంది, కారపూసలాంటివో వాడేబదులు-ఫలహారం అన్న పేరుకుతగ్గట్లుగా కొద్దిగా పండ్లు తినటం అలవాటు చేసుకుంటే ఎంత మంచిదో చూడండి. మధ్యాహ్నం "లంచ్ టయిము" అప్పుడు పండ్లు తినటంవల్ల ఎంత లాభమో ఉంది.

ప్రభుత్వోద్యోగుల యిళ్లలో సహజంగా జరిగేది మొగవాళ్లు పదింటికి భోజనాలు చేసి ఆఫీసులకు వెళ్లటం, మధ్యాహ్నం టిఫినుటయిములో వాళ్లపాటికి వాళ్లు ఆఫీసు దగ్గర కాంటీనుల్లో దోసె యిడ్లీలాంటివి తిని కాఫీలు పోయటం జరుగుతుంది. ఇంట్లో ఉండే ఆడవాళ్లు మధ్యాహ్నానికి ఏ టిఫినో చేసుకోటంగాని హోటలునుండి తెప్పించుకోటంగాని జరుగుతుంది. మళ్ళీ ఆకలివేసేది రాత్రికి, అప్పుడు భోజనం. ఇంక పండ్లు తినాలిసిన అవసరమూ రాదు. అలా అవసరం ప్రతిరోజూ కనిపించకపోవటంతో సామాన్య సంసారాల్లో పండ్లు తినటం ఎప్పుడో ఏనాడో జరుగుతుంది. దీనివల్ల పండ్లు మనకు సులభంగా ప్రసాదించే విటమినుల్లాంటి పదార్థాలు దేహంలో లోపించటం, రోగాలు పట్టుకోటం, డాక్టరు బిల్లులు పెరిగిపోవటం- ఇట్లా ఎంతమందివిషయంలో జరగటం లేదు!

తినేది వంటబట్టేది

ఆమాటకు వస్తే పండ్లయందు ఉండే విటమినులు, కాల్షియం, ఇనుములాంటివి ఇతర కూరగాయలు, పప్పుల్లో లేవా! పండ్ల అవసరం ఏమిటి అంత? అని అడగచ్చు. పండ్లు సులభంగా అరుగుతాయి. వీటిని వండాలిసిన పనిలేదు. అందుకని బొగుల ఖర్చు, వంటచేసే శ్రమ రెండు తగ్గుతాయి.



మా అక్కపాపా; ఆ పాపబొమ్మ.

ఫొటో: వి. సూర్యరేఖ (అమలాపురం)

ఇంకా వండటంతో పప్పులు, కూరల్లోని విటమినులు చాలాభాగం నశిస్తాయి. ఇనుము లాంటి పదార్థం నిజంగా కూరల్లోకన్నా పండ్లలో తక్కువే ఉంది. ఉంటేయేం? ఆ ఉన్న కాస్తా సంపూర్ణంగా రక్తంలోకి చేరిపోతుంది. కాని కూరగాయల్లో తోటకూర, కాకరకాయ లాంటివాటిలో ఇనుముఎక్కువగానే ఉన్నా కూరగాయల్లోని ఇనుము నూటికి 50 పాళ్ళు మాత్రమే రక్తంలోకి కలిసిపోయేది. మిగతాది వృథా అయిపోయి బయటకు వెళ్ళిపోతుంది. పండ్ల విషయంలో అలా జరగదు.

మనం ఎంత తింటున్నాము అనేది ముఖ్యంకాదు. తినేదాంట్లో ఎంత మన ఒంట బట్టుతోంది అనేది ముఖ్యం. విటమినులు, ఇనుములాంటివి ఒంట బట్టాలంటే పప్పులు, కూరగాయలకన్నా పండ్లుమాత్రమే ఎక్కువ ఉపయోగిస్తాయి.

అయితే అందరూ అన్ని పళ్ళూ తినటం కుదరదు. మనతత్వాలు బట్టి మనకు ఏపండ్లు ఎక్కువ లాభిస్తాయో తెలుసుకుందాం.

భైరవభట్ల లీలాసీతారాం

నీరసానికి

కొందరికి రక్తం సమృద్ధిగా ఉండదు. పాలిపోయి ఉంటారు. రక్తక్షీణతవల్ల నీరసం, నిస్సత్తువ, బుద్ధి మందగించటం, ఒకటే మతిమరుపూ ఉన్నవాళ్ళు అనేకమంది ఉన్నారు. అంటే వీరి రక్తంలో ఇనుము తక్కువయిపోయిందన్నమాట. రక్తానికి ముఖ్యంగా కావాలిసినది ఇనుము. ఇది తగ్గితే రక్తంలో రోగనిరోధకశక్తి తగ్గిపోతుంది. దాంతో చీటికి మాటికి సుస్తీలు, జ్వరాలు. ప్రాణవాయువును జీవకణాలకు సరఫరా చేసేది రక్తంలోని ఇనుము. ఈ ఇనుము వేరుశెనగ బెల్లంలో బాగా నేఉంది. కాని వాటిల్లోని ఇనుముఅంతా మన ఒంటపట్టదు. రక్తంలోకి సులభంగా ఇనుమును చేర్చేవి ముఖ్యంగా మామిడిపళ్ళు, నారింజపళ్ళు, జామపండు, ఖర్జూరపండ్లు, అత్తిపళ్ళు, ఆపిలుపళ్ళు. వీటిలో బాగా సమృద్ధిగా ఇనుము ఉన్నది. ఆపిలు, ఖర్జూర, సిద్ధవటం దోసపళ్ళు, మామిడిపళ్ళలో. ఖర్జూరపండులో ఎక్కువగా లభించేది ఒక్క ఇనుముమాత్రమే కాదు. దేహం ఆరోగ్యంగా ఉండటానికి ముఖ్యంగా కావలిసిన పోటీన్లు (మాంసకృత్తులు), కాల్షియం, భాస్వరం, విటమిను-ఏ, విటమిను "బి-1", విటమిను "బి-కాంప్లెక్సు" అన్నీ ఎక్కువ పాళ్ళల్లో ఉన్నాయి. అందుకనే అరేబియా ఎడారుల్లో నెలలతరబడి ప్రయాణంచేసే అరబ్బులు ఒంటెపాలు, ఖర్జూరపళ్ళు మాత్రమే తిని ఆరోగ్యంగా పోతూఉంటారు.

(43-వ పేజీ చూడండి)



కొన్నాళ్ళపాటు ఆడపిల్లలు పుట్టకుండా ఉంటే

"సోదర సోదరీమణులారా! స్త్రీ, పురుషుడూ ఒక్క అమ్మకడుపులో సమానంగా పుడతారు, అలాంటప్పుడు అన్ని విషయాల్లోనూ వాళ్ళిద్దర్నీ సమానంగా చూడాలి. స్త్రీని, పురుషుడిని సమానంగా చదివించాలి స్త్రీనికూడ ఉద్యోగం చేయనివ్వాలి. ఏ పెళ్ళికొడుకుకాని, పెళ్ళికొడుకుల తండ్రులుకాని కట్నం అడగకూడదు. పురుషుడితో సమానంగా చదివించి, అంత వరకూ ఖర్చయినదికాక ఇంకా కట్నం ఇవ్వాలంటే చాలకష్టం. అందుకని యీ విషయాలన్నీ అందరూ గుర్తుంచుకుని ప్రవర్తిస్తే బాగుంటుంది" అని చెప్తూ ఉపన్యాసం ముగించాడు గొప్ప వక్తఅయిన రామారావు అందరూకూడ ఆహా, ఎంత గొప్పగా చెప్పాడయ్యా అని అనుకున్నారు. పెళ్ళికావాల్సిన మొగపిల్లలున్న తండ్రులు మాత్రం కోపంగా వెళ్ళిపోయారు.

సభ ముగిసింది. రామారావు గర్వంగా

ఎ. వైదేహి

ఇంటికి వచ్చాడు తలుపు తీసింది భార్య కమల.

"ఇంత ఆలస్యంగా వస్తే ఎలాగండి. ఎక్కడికెళ్ళినాను" అంది

"నాయిష్టం నేను నిన్ను పెళ్ళిచేసుకొన్నాను పదిగంటలకి వచ్చినా, పన్నెండు గంటలకి వచ్చినా అడిగే అధికారం లేదు నీకు" అని కోపంగా అన్నాడు. కమల మాట్లాడలేదు

భోజనాల దగ్గిర కమల "ఏమండీ అమ్మకి జబ్బు ఎక్కువగా వుందిట. ఇవాళ సాయంత్రం ఉత్తరం వచ్చింది. ఒక్కసారి వెళ్ళి చూసి వస్తానండి" అంది

"నే నడిగిన రిస్ట్‌వాచి, రేడియో, కట్నం బాపతు ఇంకా ఇవ్వవలసిన రెండువేలూ ఇచ్చారుగా. సిగులేకపోతే సరి. పుట్టింటికి వెడుతుందిట, పుట్టింటికి" అన్నాడు

"ఇలాగే వుంటాయి వీరి పనులు. చెప్పే కబుర్లు చూస్తే కోటలు దాటుతాయి పది మందిలో నిలబడి చెప్పే సలహాలు వాళ్ళ యింటి విషయాలలోమాత్రం పనికిరావు చాలమంది మొగవారింతే బయటవారందరిచేత "ఆహా హా, ఏం, సంస్కర్తండీ" అని అనిపించుకుంటారు పెద్ద పెద్ద సభలలో కట్నం పుచ్చుకోకూడదు. స్త్రీ అంటే దేవత, ఆమెని గౌరవించాలి అని చెప్తారు. ఇతరులకి చెప్పడమే తప్ప వాళ్ళ ఆచరణలో పెటరు వాళ్ళ భార్యలూ తల్లులూ మాత్రం దేవతలుకారు, సరికదా వాళ్ళని బయటికేయినా వెళ్ళనివ్వకుండా చేస్తారు స్త్రీకి స్వాతంత్ర్యం ఇవ్వాలి అని చెప్పే ఈ పెద్దమనుషులు.

ఇతరుల పిల్లలకయితే కట్నాలు పుచ్చుకోకూడదు కాని, వాళ్ళ పిల్లలకయితే 6000 కి తగ్గరు

"ఇంకా ఎవరో ఇంకా ఎక్కువిస్తామ

(43-వ పేజీ చూడండి)



చిట్టితల్లి వంట నేర్చుకుంటానంటే చిన్న సైజు సరంజామా

కాపరానికెళ్ళేనాటికి వంటా వార్పూ నేర్చుకోడానికి ఐదారేళ్ళప్పుడే అమ్మాయి "రిహార్సల్" మొదలుపెట్టి, వంట నేర్చుకుంటానంటే, చిట్టితల్లికి తగిన చిన్న సరంజామా ముచ్చటగా అమర్చవచ్చు చిన్న చిన్న గిన్నెలూ, వాటికి తగిన స్టౌ, మొదలైనవన్నీ జర్మనీ పారిశ్రామికులు తయారుచేస్తున్నారు ఇవీ, నిలువెత్తు బొమ్మలతో ఆడుకునే ఆడపిల్లలు, బొమ్మలకి కట్టే గుడ్డలు ఉతకడం కోసం, చిన్న చిన్న యంత్రాలూ, ఇంకా ఇలాటివే అనేకం, ఈ నెల సెప్టెంబర్‌లో ఏర్పాటుఅయిన పారిశ్రామిక ప్రదర్శనంలో ఉంచుతున్నారు. దాదాపు 70 వేల రకాల బొమ్మలు అక్కడ ప్రదర్శిస్తున్నారు ఈ చిత్రంలో వంట నేర్చుకుంటున్న బొమ్మలాటి అమ్మాయినీ, బొమ్మల్లాంటి సరంజామానీ చూడవచ్చు


పాండ్స్ కోల్డ్ క్రీమ్‌ను
వాడే ఆమెను
అతను
మెచ్చుకొనును!
మీరు ముఖము కడుగుకున్న
తరువాత ఎల్లప్పుడూ అద్భుతమైన
పాండ్స్ కోల్డ్ క్రీమ్‌ను వాడండి.
ఇది కడుగుకుపోతున్న, చర్మము
నకు రక్షణ యిచ్చే నూనెలను
తిరిగియిచ్చి మీ చర్మమును లేతగా
మరియు నిష్కళంకముగా ఉంచును.
పాండ్స్ కోల్డ్ క్రీమ్ సులభముగా
చర్మములోకి చొచ్చుకొనిపోయి మీ
ముఖమును శుభ్రముగా ఉంచును!
ఉచిత పుస్తకము
Lovelier with Pond's అనే సౌందర్య
మును గురించిన మా యింగ్లీషు పుస్తకము
కావాలని యీ ఎడ్రసుకు వ్రాయండి: పి.ఓ.
బాక్స్ నెం. 1612, బొంబాయి 1.
POND'S
cold
cream

పిల్లలపట్ల మనప్రవర్తన

సాధారణంగా పిల్లలు చిన్నపుడు మనం ఎట్లా నేర్పితే పెద్దయ్యాక కూడా ఆబుద్ధులు శాశ్వతంగా అల్లాగే నిల్చిపోతై. శివాజీకి అతడితల్లి చిన్నతనంలో వీరుల కథలూ పురాణకథలూ చెప్పటంవల్ల అతడు వారిలాగానే వీరుడూ, ధర్మపరుడూ కావాలనిఅనుకొనేవాడు. పెద్దవాడై అట్లాగే అయ్యాడు. దొంగలకథలు చెబితే దొంగే అవుతాడు.

మా పక్కింటివాళ్ళింట్లో చిన్నపుడు ఆయిల్లాలు బిడ్డ, తల్లిని వదిలి ఒక్కణం కూడా ఉండేదికాదుట. స్కూలుక్కూడ వెళ్ళలేదట. తల్లే ఆపిల్లకు ఇంట్లోచదువు చెబుతూ, చిన్నచిన్న తెలుగు నవల్సు వరకూ చదివేలాచేసింది. వాళ్లు ఇద్దరూ రాత్రి పడుకొనేది కూడా ఒకే పక్కపైనే. ఆఖరకు తల్లి వెలుపటఉన్నా బిడ్డ పక్కనుండాల్సిందే.

ఇపుడూ మేం చూస్తూనే ఉన్నాం. ఆ అమ్మాయికి 15 ఏళ్ళుంటాయి. వాళ్ళమ్మ పక్కనే పడుకుంటుంది. ఆమె బయట చేరితే, ఒకవేళ ఎవరన్నా ఎదురుగ్గా ఉన్నట్టయితే కూతురును వేరేపడుకోబెడ్తుంది. ఆపిల్లకు నిద్రరాక "అమ్మా భయమేస్తుందే నిద్రరావటంలేదు" అంటూంటుంది. ఆమె "యీ మూణ్నాళ్లు ఎట్లాగో జరగనియ్యవే" అంటుంది. లేకపోతే "ఆమిగిలిన పుస్తకం చదువుతావా" అంటుంది.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఇహ ఆపిల్లకు పెళ్ళయి అత్తారింటికెడితే ఏపనీ ముట్టకుండా, ఎపుడూ, పుస్తకాలు చదువుకుంటూవుంటే కుదురుతుందా? అని. ఆతల్లి ఇప్పుడు భయపడుతుంది ఆపిల్ల సంగతిగూర్చి. చిన్నప్పట్నుంచీ ఆ జాగర్త వుంటే.

రాముడు 12 ఏళ్లు. వాడు ఒకరి పక్కన పడుకోమంటే సుతరామూ వినడు. ఎందుకని. మొదట్నుంచీ వాడికి వేరే ప్రత్యేకంగా పరుపూ దోమతెరా వున్నై. ఇది ఆరోగ్య శాస్త్ర రీత్యా చాలా మంచి అలవాటు.

పై రెండూ, పెద్దలు (తల్లులు) ఎట్లా నేర్పితే చిన్నపుడు పెద్దయ్యాక కూడా అట్లాగే వుంటాయి అనుదానికి. నేను యిది రాస్తున్నపుడు మా అన్నయ్య గుర్తొచ్చాడు. వాడు చిన్నపుడు ఎలిమెంటరీస్కూల్లో చదివేటపుడు వాళ్ళ టీచరు పిల్లల్నందర్నీ తల కొకణా తెమ్మని చెప్పాట్ట. అన్నయ్య యింటికొచ్చి నాన్నని అడిగాడు మాస్టారు అణా పట్రమ్మని చెప్పారని. అప్పుడాయన "ఏమిటి, వాళ్ళకంతకన్నా వేరేపనిలేదు కావొచ్చు, పిల్లవెధవలదగ్గరంతా అణాలు, వసూలుచేస్కుని తినటానిక్కాతప్పితే. అని పదరా నేనొచ్చి చెబుతా అంటూ

కె. రోహిణీబాయి

(కర్నూలు)

స్కూల్కు వెళ్ళి ఆ టీచరుతో "ఏమండి మాటిమాటికీ యిలా, అణాలు, అర్ధణాలు తెమ్మని చెప్పటం, వాళ్లమమ్మల్ని పీక్కు తినటం అని అరిచారుట. (టీచరుమెతక వాడు) దాంతో ఆయన భయపడిపోయి "నేను మీ అబ్బాయిని తెమ్మన్లేదండి" అన్నాట్టపాపం. (అంటే అతడి ఉద్దేశ్యం నేను మీ ఒక్క అబ్బాయినే తెమ్మన్లేదని అనబోయ్యాడేమో) ఇక అప్పట్నుంచీ అన్నయ్యకు ఆ టీచరంటే భయంలేదు. స్నేహితుల్తోమానాన్నంటే వాడలిపొయ్యాడు తెలుసా" అని చెప్పుకునేవాడు. ఇప్పుడు వాడు కాలేజీ లెక్చరర్లని కూడా పేర్లుపెట్టి పిలవటం! యేఁ వాడెంత" అనటం వాడు గుర్తొస్తుంది. ఎందుకు? అది చిన్నప్పటి అలవాటుకనుక పెల్లలయెదుట, అసభ్యపు మాటల్ని గానీ, రహస్యవిషయాల్ని కాని, ఒకర్ని హేళన చేసే మాటల్ని కాని మాటాడ్తే వాళ్ళ చిన్ని మెదడులో అవిబాగా ముద్రవేసుకు పోతాయి.

మా బాబు అద్దంముందు నిల్చుని వంగి దువ్వకుంటున్నాడు ఓరోజున. అద్దం ఎత్తులోవున్నా వాడు అట్లాగే చేస్తున్నాడు. వాడికది అవుపించక నానాఅవస్థ పడుతున్నాడు. ఎందుకు? రోజూ మా ఆయన అల్లా వంగి దువ్వకునేవారు. పెద్దలకది అవసరము. బాబుకది అవసరంలేకపోయినా పెద్దల్ని అనుకరిస్తాడు అదో పెద్దయిదిగా.

ఇటువంటి చిన్నవిషయాలు మొదలుకొని పిల్లలు ప్రతిఒక్క దాన్లోనూ పెద్దల్ని అనుసరిస్తారు. చిన్నప్పటి అలవాట్లని మర్చిపోరు ★

ఉత్తరాలు:

పెద్దా పేరక్కలు....

అందరూ భోజనాలు ముగించి కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో "ఏమండోయ్ అంతా బావున్నారా" అంటూ ఓ అమ్మాయి లోపలి కొచ్చింది. నాకు ఆ అమ్మాయిని ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం. మా అమ్మ "ఎవరమ్మాయ్ నువ్వు" అన్నారు. "అదేమిటండీ అలా అడుగుతారు. మీ రిదివరకు రాజమండ్రిలో ఉన్నపుడు మేము మీ యింటికి మూడిళ్ళవతల ఉండేవాళ్ళం. సత్యనారాయణగారని మా నాన్నగారు, శేషాయమ్మని మా అమ్మ, మేమంతా మీ యింటికి వస్తూ ఉండేవాళ్ళం. అయ్యో అప్పుడే మరచిపోయారూ? ఎంత త్వరగా మరచిపోతారండీ మనుష్యుల్ని" అంటూ వాళ్ళు మాకు ఎలా చిరపరిచితులో గుక్క త్రిప్పుకోకుండా నిమిషంలో చెప్పేసరికి నాకు చాలా ఆశ్చర్యమేసింది ఆ అమ్మాయి మాటలకు. ఇంతకీ ఆపిల్లకి సరిగ్గా పదేళ్ళయినా వుండవు. పెద్ద బొమ్మలాగా నిష్ఠూరపు మాటలు దొర్లించేసింది.

"సరేగాని మీ పెద్దమ్మాయి కెంత మంది పిల్లలు? మీ చిన్నమ్మాయికి పెళ్ళయిందా?" అని ఆపిల్ల అంటూంటే నాకు నవ్వాగలేదు. ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే కొందరు పిల్లలు వయసుకు తగ్గ మాటలు మాట్లాడరు. పెద్ద గృహిణుల్లాగా వాగుతూంటారు. చిన్న పిల్లలు తమ వయసుకు తగినట్లు ముచ్చటగా ఆటపాటలు గురించి మాట్లాడితే ఎంతో ముద్దుగా ఉంటుంది. ఇంకో రకం పిల్లలున్నారు. "కులాసాగా ఉన్నారా? ఏం జబ్బు లేదు కదా? అంత నీరసంగా ఉన్నారేం?" అంటూ పెద్దా పేరక్కల్లాగా మాట్లాడేస్తూంటారు.

పెద్దవాళ్ళు మాట్లాడుతున్న చోటుకు పిల్లల్ని రానివ్వటం, పైగా అధికప్రసంగం చేస్తున్న పిల్లల్ని చూసి చాలా గొప్పగా మాట్లాడుతారని మురిసిపోవడం చాలా తప్పు. పిల్లల్ని పిల్లలలో కలసిపోనివ్వాలి, చిన్న పిల్లలు ఇతరులతో మాట్లాడేటప్పుడు ఏ విధంగా మాట్లాడాలో ఎంతవరకు పెద్దలతో మాట్లాడాలో ప్రతి తల్లి తండ్రి నేర్పాలి. మొక్కలోనే వంచి బాగా అదుపులో ఉంచాలి.

ఎల్. వి. సరోజానాయుడు,
చిత్తూరు.

* * *

బెట్టు సరి

ఈమధ్య మాయింటి కో ఆవిడ వచ్చింది. రాత్రి అవటముచేత భోజనానికి ఉండమన్నాను. ఎంతో బలవంతంమీద తింటూన్నది. నేను అలవాటు ప్రకారం "మరి కొంచెం వేసుకోండి" అని మర్యాదగా అంటుంటే "ఏమండోయ్! మాకు కంచాలు కంచాలు తినటం అలవాటు లేదండోయ్!" అన్నది. ఏంచేస్తాం! ఇటువంటి వాళ్ళతో వేగలేము. అప్పటికి అర్థమేమిటంటె వాళ్ళు తగినంత తింటారనీ, మిగిలినవారు కంచాలు కంచాలు తింటారనీ అర్థం. ఎవరి కడుపుకు పట్టినంతవారుతింటారుగాని తక్కువా తినరు, ఎక్కువా తినరు. ఇట్లు బెట్టుసరి చేయబోయి కొంచెమేతిని కడుపుమాడ్చుకుని, తిరిగి ఇంటి కెళ్ళి తినేవాళ్ళు చాలామంది ఉన్నారు.

సాధారణంగా ఇటువంటివాళ్ళకు బెట్టుసరితోపాటు గర్వంకూడా ఉంటుంది. వీళ్ళ పిల్లలుకూడా అట్టే చెడిపోయేది. మొన్న ఒక స్నేహితురాలింటికి వెళ్ళాను. ఆమె కొడుకట. పట్టుమని ఎనిమిదేళ్ళుకూడా లేవు. నాకరుమీదెక్కి గుద్దుతూ ఒరేయ్! అని తిడుతున్నాడు. ఇదేమిటంటారు? ఒకసారి ఒక తెలిసినవారింటికి వెళ్ళాను. బయట

పేపరు చదువుకుంటున్న ఆమె గబగబా లోపలికి మమ్మల్ని చూడనట్టు వెళ్ళి వెనక వైపునుండి షెడ్డోంచి కారుతీసికొని మా ముందునుంచే 'రయ్' మని వెళ్ళింది. ఇదే మిటి గర్వం కాదూ!

రహీమున్నిసా బేగం.
(ఒంగోలు).

*   *   *

సరి కాదు

శ్రీమతి ఆర్. సుశీలగారు 27-2-57 వార పత్రికలో 'మంచికి చెప్పినా' అనే శీర్షిక క్రింద హైద్రాబాదులో హిందీ మాట్లాడితే ఒకధర చెప్పి, తెలుగులో మాట్లాడితే రెండింతల ధరలు చెప్తారని వ్రాశారు. కాని ఈ మాట సరికాదు. నేను ఇక్కడ మా జేశై స్కూల్లో పనిచేస్తున్నాను. నేను ఎక్కడికి వెళ్ళినా, యేవస్తువుకొన్నా స్వచ్ఛమైన మన తెలుగులోనే మాట్లాడుతానుగాని యిక్కడి తెలుగుగాని, హిందీగాని ఉపయోగించను. అయినా నేను యింతవరకూ యెప్పుడూ మోసపోలేదు.

ఎస్. రమ.
హైద్రాబాదు.

*   *   *

గూటిపలుకు

27-2-57 ఆంధ్ర పత్రికలో బొప్పన గంగాభవానిగారు రాసిన "నేను అబద్ధం చెప్పాను" అన్న వ్యాసం చదివాను. "విద్యా విహీనుల సంగతి అలా ఉంచండి. విద్యా వంతులలో ఇటువంటి మంచి చెడ్డలు పిల్లలకు చెప్పేవాళ్లెందరు?" అన్న ప్రశ్నలో ఆమె అభిప్రాయం నాకవగతం కాలేదు. చదువురాని స్త్రీలకు దేశభక్తి కాని యుక్తాయుక్త వివేచన జ్ఞానం కాని ఉండవన్నట్లయితే మనదేశంలో ఎంతమంది విద్యావంతులున్నారు? ఈ మిగిలిన పిల్లలందరు దేశద్రోహులు, దొంగలు, అబద్ధాలకోరులు అయిపోవలసిందేనా? ఆమె లెక్కలో ప్రవర్తనకి, శీలానికి ఇప్పటి డిగ్రీల చదువే కొలబద్దా? అయితే మనవెనుకతరాలలో ప్రాణాలు సయితం ధారపోసిన దేశభక్తుల సంగతేమిటి? వారి తల్లులు డిగ్రీలు సంపాయించలేదు గదా కనీసం పరీక్షుల మొగమైనా ఎరుగరు. సాధారణంగా ఎవరో మూర్ఖులు తప్ప ప్రతివారు తమ పిల్లలు నీతినియమాలతో ఉండాలని ఆశిస్తారు.

ప్రతి తల్లీ తనబిడ్డ భవిష్యత్తును బాగు చెయ్యాలనుకుంటుంది. ఇందుకోసరం పెద్ద చదువు సంస్థలు అవసరము లేనేలేదు. ఆ లెక్కన చూస్తే శివాజీ తల్లి జిజియాబాయి; బాపూజీతల్లి పుతలీబాయి ఏమి చదువుకున్నారు. భారత రామాయణాది వీరగాథలతో తమ పుత్రులను వీరులను చేశారు.

ఎండ కన్నెరుగని శ్రీమంతకుటుంబాల స్త్రీలనుండి సామాన్య కుటుంబాల స్త్రీలవరకు ఎంతమందో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. వీరందరు ఏ ప్రోద్బలంతో బయటకు రాగలిగారు. కేవలం ఆ రోజులలో జరుగుతుండిన అలజడు లేకదా కారణం. ఇంతకూ నేను చెప్పవచ్చే దేమిటంటే తనకున్న సామాన్యపరిజ్ఞానంతోనే ప్రతితల్లీ తన బిడ్డలకోసరం పాటుపడవచ్చును. అందుకు పెద్దచదువు లేం అవసరంలేదు. అంతకంటే పెద్ద డిగ్రీలు అవసరంలేదు. ఆ లెక్కన వస్తే విద్యావంతుల పిల్లలలో నూటికి నూరుపాళ్లు నిజాయితీపరులు, దేశభక్తులూ అవుతారని ఏం లెక్క. ఉగ్గుపాలతో నేర్చుకోక పోయినా మనకు మంచి పనులు కావు అని తోచినవాటిని మనం మానేయ్యాలి. మన పిల్లలచేత మానిపించెయ్యాలి. సామాన్యంగా నీతి నిజాయితీ కలిగి తన. పొరుగువాళ్ళను ప్రేమించగలిగిన బిడ్డ తన దేశాన్ని కూడా

(43-వ పేజీ చూడండి)

★ అపరబుద్ధి ★

(19-పేజీ తరువాయి)

కారులో వున్న రేడియోలో సంగీతం వినబడుతూంది.

"ఇలా రేడియో మోగుతూ వుండటం మంచిదేనా?" అంది.

నేను రేడియో తెరిచే వుంచాలని చెప్పాను. బంగళా వదలివచ్చిన రెండు గంటలలోనూ రేడియోలో ప్రసారమైన వార్తలు తెలుసుకునే అవకాశం వుంటుంది. ఆమె కారు మరీ వేగంగా నడుపుతూంది. ఒక ఆరు బయలు ప్రదేశంలోనుంచి వెళ్ళేటప్పుడు, ఆమె తీసుకొనివచ్చిన తాడుముక్కలను కారు కిటికీలోనుంచి బయటికి విసిరి పారేశాను. నా దగ్గరవున్న నల్ల కంటిఅద్దాల చట్రాన్ని విరిచి అద్దాలతో సహా బయటికి విసిరాను. క్రిందికి వంగినపుడు ఆమె కాలిజోళ్ళు కనబడ్డవి. వాటినిండా బురద మరకలు వున్నవి. గుడ్డతో ఆ మట్టి తుడవమని చెప్పాను.

ఆమె కారు ఆపింది. కాలిజోళ్లకు అంటిన బురదను పాత గుడ్డతో తుడిచి శుభ్రం చేస్తూంది.

"ఆ స్థితిలో అతణ్ణి కారులో వుంచుని ఎక్కడికి వెడదామనుకున్నావు? నేను ఏమైపోతాననుకున్నావు?" అన్నాను.

"మీ రెక్కడ ఉన్నారు?"

"మనం నిర్ణయించుకున్న సంకేతస్థలంలో. నీకోసం ఎదురుచూస్తున్నాను. ఎంతసేపటికి నీవు కనపడకపోతే, మట్టిరోడ్డుమీద నడక ప్రారంభించాను."

"ఆ పరిస్థితిలో కారులో ఒంటరిగా కూచోటానికి భయం వేసింది. అందుకని కారు తలుపులు వేసి, మిమ్మల్ని వెతుకుతూ బయలుదేరాను."

"తలకు కట్టుకున్న వులెన్ మఫ్లర్ తీసివెయ్" అన్నాను.

ఆమె మఫ్లర్ విప్పివేసి, అద్దంలో ముఖం చూచుకుని తలదువ్వుకుని, ముఖానికి పౌడరు అద్దుకుంది.

"హృదయంలో ఆందోళనగా వుంది. కొంచెం దూరం కారులో తిరిగివద్దాం" అంది ఆదుర్దాగా.

ఆమే కారునడుపుతూంది. చాలా విపరీతమైన వేగంతో కారు వెడుతూంది. ఇద్దరం మౌనంగా వున్నాము. ఎవ్వరూ మాట్లాడడానికి ఉద్యుక్తులం కాలేదు. కాని ఒకరిని ఒకరు వింతజంతులవలె ముఖాలలోకి చూసుకుంటున్నాము. చిట్టచివరకు ఆమే ఇలా ప్రారంభించింది:

"మనం ఏదైనా మాట్లాడుకోవాలి. మన ఇద్దరం కలిసి మాట్లాడుకోవటం ఇదే ఆఖరు పర్యాయం కావచ్చు."

"అయితేమాట్లాడు. నిన్ను ఎవరు అభ్యంతర పెట్టారు?"

"నీకు ఆయన భీమాపట్టా విషయమై తెలుసుకాదు."

"ఆ విషయం ఎన్నిమార్లు చెప్పాలి?"

"మాట వరసకు జ్ఞాపకం చేస్తున్నాను."

"ఈ సంగతి మీరు నాకు చెప్పటం నేను వినటం చాలాసార్లు జరిగింది. మళ్ళీ అదే విషయం ప్రస్తావిస్తే విసుకు కలుగుతూంది."

"విచారణ-అంటే పంచాయతి - జరుగుతుంది. ఆతరువాత దహనం చేయటానికి అనుమతి ఇస్తారు. ఆసందర్భంలో నీవు ఒక మంత్రిని ఆహ్వానిస్తానన్నావు. జ్ఞాపకం వుందా?"

"ఔను ఈవిషయంలో కూడా నా మనసులోవున్న అభిప్రాయం మీకు ఇదివరకే చెప్పాను. నన్ను మళ్లీ ఎందుకు విసిగిస్తారు? కొంచం దూరం యింకా కారులో వెడదాము."

"సరే పోనివ్వు."

కారు కదిలింది.

"కమలాక్షి బయటికి వెళ్లిందా?"

"అసంగతీ చెప్పాను కదూ?"

"మెడికల్ స్టోరు పక్కనవున్న హోటల్ వద్ద కారుఆపి లోపలికివెళ్ళి కాఫీతాగి ఇంటికివెళ్ళు. అతణ్ణి రైలుకుసాగనంపి, తిరిగివచ్చావనుకుంటారు అక్కడివాళ్లు. నేను ఇక నీవెంట వుండటం మంచిదికాదు. మీ ఇంటిదగ్గిరే వున్న రోడ్డు మలుపుకు కొంతదూరాన వున్న నిర్జనప్రదేశంలో ఇందాక నా కారునిలిపాను. అక్కడికి నడుపుకారు. నా కారులో నేను ఒంటరిగా బంగళాకు వెడతాను," అన్నాను.

నేను ఇంటికివెళ్ళి తాళం చూశాను. బయటనుంచి నన్ను పిలవటానికి ఏర్పాటు చేసిన గంట నొక్కటానికి ఒక మీటవుంది. బయలుదేరేప్పుడు అక్కడవుంచిన కార్డు అలాగే వుంది. దాన్ని తీసి జేబులో వేసుకున్నాను. తాళం తెరిచి మేడమీదికి వెళ్ళాను. టెలిఫోను రిసీవరును ఆనించి వుంచిన కార్డుకూడా కిందపడలేదు. నేను ఇంట్లోలేని సమయంలో నన్ను ఎవరూ టెలిఫోన్ ద్వారాగాని, స్వయంగా వచ్చిగాని పిలవలేదన్నమాట.

గోడగడియారం చూశాను. అప్పటికి పది గంటల ఇరవైఅయిదు నిమిషాలైంది. స్థిమితంగా కుర్చీలో కూచుని బట్టలు మార్చుకుని కాలికి కట్టిన కట్టువిప్పాను. ఆ గుడ్డలు, దూది, టేపు అన్నీ ఒక కుప్పగాజేసి పాత పేపరుకు నిప్పుముట్టించి వాటన్నిటి ఆ మంటలో కాల్చివేశాను. నా జేబులో వున్న రెండు కార్డులను కూడా అదే మంటలో పడేశాను. అన్నీ పూర్తిగా కాలి బూడిదైపోయినవి. మేడముందరి భాగంలో వున్న నా గదిలోకి వెళ్ళి, టెలిఫోన్ చేయాలని బల్లముందు కూర్చున్నాను. నేను ఆ సమయానికి స్వస్థానంలోనే వున్నట్టు ఋజువుపరచటానికి అప్పుడు ఎవరినైనా టెలిఫోనులో పిలిచి మాట్లాడాలనుకున్నాను. నా గొంతు జీరపోయినట్టుగా అనుమానం కలిగింది. వంటగదిలోకి వెళ్ళి, రెండు సీమరేగికాయలు తీసుకొని కత్తితోకోసి తినటం ఆరంభించాను. కొంచంసేపు కూనిరాగాలు తీశాను. ఎట్లాగైనా టెలిఫోనులో పిలిచి మాట్లాడాలనుకున్నాను. అప్పుడు పదిగంటల నలభైఎనిమిది నిమిషాలు అయింది. టెలిఫోన్ డైరెక్టరీ చూసి భగవతి ఫోన్ నెంబరు చూశాను. అతను ఇంకొక కంపెనీకి ఏజంటు. అనుభవశాలి. టెలిఫోన్‌లో భగవతి మాట్లాడాడు.

"అగ్నిప్రమాద భీమా చేయించటానికి ప్రీమియం రేట్ల పుస్తకం, ఆఫీసులో మరిచిపోయాను. రేపు ఉదయమే ఒక కంపెనీచేత భీమా చేయించటానికి వస్తానని మాట ఇచ్చాను. కొంచం మీరు శ్రమతీసుకుని 5,6,8 టేబిల్సుక్రింద ఎంతెంత ప్రీమియం కట్టాలో మీ పుస్తకం చూసి నాకు చెప్పాలి. శ్రమకు మన్నించాలి," అన్నాను అతడితో. మళ్ళీ పదిహేను నిమిషాల్లో ఫోన్‌ద్వారా తెలియపరుస్తానని ఆయన జవాబు చెప్పాడు. ఏమీ తోచక గదిలో పచార్లు చేయటం మొదలుపెట్టాను. టెలిఫోను గంట మోగింది. భగవతి, ఫోనులో చెప్పిన అంకెలు ఒక కాగితంమీద రాసుకున్నాను. ఆ సమయంలో ఆయన శ్రమ తీసుకుని నాకు సహాయం చేసినందుకు కృతజ్ఞత తెలిపాను. అప్పుడు స్నానాలగదిలోకి వెళ్లాను. మనసు విపరీతంగా ఆందోళనపడుతూంది. ఎప్పుడూ ఎరగని బలహీనత, నన్ను ఆవేశించింది. ఎలెక్ట్రిక్ హీటర్ తో నీళ్ళుకాచుకుని వాటితో వొళ్ళంతా కడుక్కుని బట్టలు మార్చుకుని నాగదిలోకి వెళ్ళి, మంచంమీద పడుకున్నాను. చాలా సేపటివరకు దీపం ఆర్పకుండా అలాగే వుంచాను. కిటికీలోనుంచి ఆరుబయటికి చూశాను. చీకటి భయంకరంగా వ్యాపించివుంది. ఆకాశంమీద దట్టంగా నల్లమబ్బులు కమ్ముకున్నవి. నక్షత్రాల కాంతికూడా కనపడటంలేదు. కళ్ళు తెరుచుకుని, మెలకువగానే పడుకున్నాను. అకస్మాత్తుగా ఎవరో నా వీపు తట్టినటు అనిపించింది. వెంటనే శరీరమంతా వొణికిపోయింది. ముచ్చెమటలు పట్టినవి. భయంతో కంపించాను. గాలికోసమని పంకా స్విచ్ వేశాను. పంకా తిరిగేప్పుడు వచ్చే శబ్దం వింటూంటే, నన్ను ఎవరో తరుముకుని వస్తున్నట్టుగా అనిపించింది.

జరిగిన విషయాలన్నిటినీ ఆలోచించటం మొదలుపెట్టాను. వాటినుంచి నా మనసును మరల్చుకోవాలని ప్రయత్నం చేశాను; కాని ఉపయోగం లేకపోయింది.

నేను చేసిన పని నాకు తెలుసు. ఒక మనిషిని హత్యచేశాను. ఒక స్త్రీ కోసం హత్యచేశాను! ఆమె కోరిక తీర్చుకోటానికి నేను ఆమె శక్తికి వశ్యుణ్ణయినాను. నేను మరణశిక్షకు పాత్రుణ్ణని వేలుపెట్టి చూపించ గలవారు ఈ ప్రపంచంలో ఒక్కరు మాత్రమే ఉన్నారు! ఆమె కోసమే నేను ఈ హత్య చేశాను. నేను జీవించినంతకాలం మళ్లీ ఆమెను చూడాలన్న కోరికే నాకు లేదు.

ఒక క్షణంలో తుపానులాగా చెలరేగిన భయం, ప్రేమను జుగుప్సగా మార్చేసింది!

(ఇంకా వుంది) ★

ఉత్తరాలు

(41-వ పేజీ తరువాయి)

ప్రేమిస్తుంది. స్వార్థపరురాలయి తన కుటుంబములోని అత్త, ఆడబిడ్డలు మొదలయిన వారిని కూడా ద్వేషించగలిగిన స్త్రీ ఎంత విద్యావంతురా లయినప్పటికి తన బిడ్డకు సరైన శిక్షణ నివ్వలేదు. ఏ గూటి చిలుక ఆ పలుకు పలికినట్టే పిల్లలు కూడ ఇంట్లో పెద్దలనుబట్టే, ఇంటిపెద్దలు కుటుంబములోనివారు నిజాయితీనీ, ఇతరులను సమభావంతో చూడ గల్గటం నేర్పుకుంటే ఆ యింటి బిడ్డలు కూడా పెద్దల ననుకరిస్తారు. ఇది తప్పకుండా జరిగే విషయం. అందువల్ల ముందు పెద్దలు తములో లోపాలుంటే సరిచేసుకోవాలి. తరువాత బిడ్డలచేత ఆచరణలో పెట్టించాలి. తములో లోపాలుంచుకొని బిడ్డలను సరిచేయబోతే ఆ పిల్లలు బాగుపడరు సరిగదా నువ్వెంతంటే నువ్వెంత అనే పద్ధతికి వస్తారు. ముందు పెద్దలు క్రమశిక్షణ నేర్చుకుంటే పిల్లలు వారిని తప్పకుండా అనుకరిస్తారు.

డి. ఎన్. లక్ష్మి
(బొంబాయి)

* * *

ఆడపిల్లలు పుట్టకుండా ఉంటే—

[37వ పేజి తరువాయి]

న్నారు. మేమే చేసుకోలేదు" అనిచెప్తారు, అడగవచ్చిన పిల్ల తండ్రితో.

మాకు తెలిసినాయన ఒకరు వున్నారు. ఆయనకి ఒక కూతురు, ఒక కొడుకు. కూతురికి పెళ్ళిచేసేశారు. కొడుకుకి చూస్తున్నారు. ఐదువేల రూపాయలు కట్నం ఇచ్చి ఐదు రోజులు పెళ్ళిచేయాలని ఆశ. ఎంతకో చూశారా. ఇలాగే వుంటారు ఈ పెద్ద మనుషులు.

నా అభిప్రాయం ఏమిటంటే ఇంకా చాలకాలం దాకా కట్నాలు తగ్గడం జరగదేమో అనిపిస్తోంది. పూర్వకాలంలో కన్యని వూరికే దానం చేయకూడదు కనుక, కన్యతో పాటు తమకు తోచినంత ఇవ్వడం ఉండాలి. ఇప్పుడు అలాగకాదు. తామడిగిన కట్నంకి ఒక్క కాణి తక్కువయినా ఊరుకోరు. డబ్బు దగ్గర లేక తరువాత ఇస్తామంటే కట్నం ఇచ్చేదాక ఆ అమ్మాయిని రాచి రంపాన పెడతారు. మళ్లీ ఇస్తారో ఇవ్వరో అని నోటు రాయించుకుంటున్న వాళ్ళని మనం చూస్తూనే వుంటాము.

ఏమైనా ఈ మొగపిల్లల తండ్రులు ఆడపిల్లల తల్లి తండ్రుల్ని చాల ఏడిపిస్తున్నారు. కొంతకాలం దాకా ఆడపిల్లలు తక్కువ మందిపుడుతూ, మొగపిల్లలు ఎక్కువమంది పుడితే ఈబాధ ఏమైనా తగ్గుతుందేమో.

* * *

ఫలహారాలు మనకిచ్చే ఫలాలు


(36-వ పేజీ తరువాయి)


(ఒకఔన్సు ఖర్జూరపండులో 8 మిల్లీ గ్రాముల ఇనుము ఉంటుంది. అంతే బరువు గల ఆపిలుపండులో 0.5 మిల్లీగ్రాములు, అరటిపండులో 0.1 మిల్లీగ్రాములు, గజ నిమ్మ పండులో 0.7 మిల్లీగ్రాములు. పచ్చి మామిడికాయలో 1.3 మిల్లీగ్రాములు మామిడి పండులో 0.1 మిల్లీగ్రాములు ఉంటుంది. జామపండులో 0.3 మిగ్రాలు, నారింజలో 0.1 మిల్లీగ్రాము, అత్తి, అనాసపళ్ళలో 0.8 మిల్లీగ్రాలు, ఇనుము ఉంటుంది.) దీన్నిబట్టి రక్తపుష్టి కావాలిసిన వాళ్ళందరూ వారికి నచ్చినపళ్ళను ఎన్నుకొని మితంగా రోజూ తినటం లాభం. "అధికస్య అధికం ఫలం" అనే సూత్రం మాత్రం తిండి విషయంలో అబద్ధం సుమండీ!

నూటికి 70 మంది

కొంతమందికి జీర్ణశక్తి తక్కువగా ఉండటం, బాగాపుష్టిగా ఎదగకపోవటం, ఎముకలు బలంగాలేక దొడ్డికాళ్ళలాంటివి రావటం, నోటి దంతాలు గట్టిగాలేకపోటం-చూస్తుంటాము. వీటికి ముఖ్యంగా కారణం "కాల్షియము"లోపించటం.మన ప్రాంతంలో నూటికి డెభ్భయి మందికి కాల్షియం తక్కువ. కాల్షియం ఇంజక్షనులు ఎంతమంది తీసుకోటంలేదు? కాల్షియం ఫాస్ఫేటును "టాబ్లెట్సు" రూపంలోనూ, టానిక్కుల ద్వారానూ ఎంతమంది సేవించటంలేదు? ఈ లోపం పోగొట్టుకు నేందుకు, సమంగా ఆరోగ్యంగా ఎదిగేటందుకు కావాలిసినవి నారింజపళ్ళు, నిమ్మపళ్ళు, ద్రాక్షపళ్ళు, అత్తిపళ్లు. ఈ పళ్ళలో మిగతావాటికంటే ఎక్కువగా కాల్షియముంది. ఖర్జూరపండులో చాలా అధికంగా "కాల్షియం" ఉన్నది. సామాన్య సంసారుల్లోకూడా రోజుకొక నారింజపండు తింటం ఎక్కువకష్టంకాదు. ఇది అశ్రద్ధచేస్తే మందులకెంత ఎక్కువ ఖర్చుపెట్టాలో ఆలోచించుకోవచ్చు.

(మిగతాది పైవారం.)





అందాల నా పడవ
అలిగి పోయింది
కాగితపు నా నావ
కదిలి వెళ్లింది

సాగరమ్మును దాట
సాహసించింది
చేతిలోనుండి యది
జారిపోయింది

నీలిరంగుల నీటి
మీద నృత్యము సల్పి,
నింగి మబ్బుల క్రింద
హాంగుగా నడిచింది

మా తోటలోనున్న
మల్లె, జాజులు కొన్ని
ఎన్నెన్నో దేశాల
ఎగుమతీ చేయాలి

పిల్లవాయువులోన
పిలుపులే అందించి
తిరిగి వచ్చెదనంచు
కబురు పంపించింది

నయనమ్ము లవతలగ
పయనమ్ము సాగించి
పెనుగాలి ఊపులకు
వణికింది ఒకమారు

అంతలోనే—నీరు
ఆవరించెను, నావ
తల్లక్రిందుగ ఒరిగి
మెల్లగా మునిగింది

అందాల నా పడవ
అరుగు నెప్పుడో మరల
వేయికన్నులు నిలిపి
యెదురు చూస్తున్నాను
అందాల నా పడవ...

శ్రీ గందం జోయెల్

సమయస్ఫూర్తి

గుండెపూడి రాజ్యలక్ష్మి

పూర్వము భోజరాజు ధారానగరము ముఖ్యపట్టణముగా రాజ్యపాలన జేయురోజుల్లో కోగల్లు గ్రామంలో కేశవభట్టు అనే బ్రాహ్మణుడుండేవాడు. ఆయన సకలశాస్త్ర కోవిదుడు. వేద వేదాంగముల నధ్యయనము చేసి కవనము చేయుటయందు కూడా తనకు సాటి లేరనిపించుకున్నాడు తెలివితేటలెన్ని ఉన్నను దరిద్ర దేవత మాత్రము కేశవభట్టును వదల్లేదు. దరిద్రదేవత పట్టి బాధిస్తున్నప్పటికీ అతనేమీ చలించేవాడు కాదు. "నారుపోసినవాడు నీరుపోయకుండా ఎలా వుంటాడు?" అనే మనస్తత్వము కలవాడు కేశవభట్టు. ప్రతిరోజూ కేశవభట్టును భార్య "భోజమహారాజు ఆస్థానమునకు వెళ్ళి శక్తిసామర్థ్యములను చూపి మహారాజు మన్నన లందుకొని రమ్మని" అదేపళంగా పోరుపెడుతుండేది. కానీ కేశవభట్టు భార్యచెప్పినదంతా విని వూరుకుండేవాడే కాని కార్యరూపములోకి తీసుకొచ్చేవాడు కాదు. ఆవిధంగా రోజులు గడిచినవి. నానాటికి దరిద్రబాధ ఎక్కువయింది. కేశవభట్టుకు దరిద్రమునుండి కాపాడుకోడానికి భార్య చెప్పిన మార్గముదప్ప అన్యమార్గమేమీ తోచలేదు. భోజరాజు ఉదారుడనీ, కవులను సన్మానిస్తాడనీ లోకవ్యాప్తమయిన పేరున్నదిగదా తననుకూడా సన్మానించక పోవునా అని భోజరాజును దర్శించుట కొక రోజున ధారానగరానికి బయలుదేరాడు కేశవభట్టు.

పెద్దలవద్దకు వెళ్లునప్పుడు రిక్తహస్తముతో పోగూడదని భార్యను పిలచి "రాజుగారికి బహుమానముగా ఇచ్చుట కేదయినా ఇమ్మని" కోరాడు. దరిద్రదేవత తాండవిస్తున్న ఆయనింట్లో రాజుగారికి బహుమతిగా యివ్వడానికి వీలైన వస్తువేముంటుంది? అందుకని కేశవభట్టు భార్య రెండు చెఱకు తుంపులనే రాజుగారికి బహుమతిగా యివ్వమని యిచ్చింది. రెండు చెఱకు తుంపులను మూటలో కట్టుకుని భోజరాజును దర్శించుటకు కేశవభట్టు ధారానగరానికి ప్రయాణమయ్యాడు.

కేశవభట్టు ధారానగరము చేరుకునేసరికి బాగా చీకటిపడింది. ఆ రాత్రికొక సత్రములో నిద్రించి మరునాడుదయమున లేచి రాజదర్శనార్థము రాజభవనము చేరుకున్నాడు. భోజరాజు కొలువులో వున్న తరుణముచూచి కేశవభట్టు అనుమతి తీసుకొని కొలువులో ప్రవేశించాడు. వెంటనే తనతో తీసుకువచ్చిన మూటలోని రెండు చెఱకు తుంపులను భోజరాజుకు బహూకరించు ఉద్దేశ్యముతో మూట విప్పాడు. మూటలోవున్న రెండు కొఱువులను చూచి భోజరాజు చిరునవ్వు నవ్వాడు. కేశవభట్టు "చెఱుకు తుంపులు కొఱువులెలా అయ్యాయా" అని ఆశ్చర్యపోయాడు. అది చూచి భోజరాజు "ఇదేమిటయ్యా నాకు

★ సమయస్ఫూర్తి ★

బహూకరించుటకి రెండు కొరువులు తీసుకొచ్చావు?" అని ప్రశ్నించాడు కేశవభట్టుని. సమయస్ఫూర్తి గల కేశవభట్టు వెనుకా ముందాడకుండా ఒకశ్లోకాన్ని పూర్తిచేసి "మహారాజా! అందమైన ఫలపుష్పాదులతో కూడి యున్న వృక్షములచే అలరారు ఖాండవ వనమును అర్జునుడు వృథాగా తగులబెట్టెను. బంగారు ప్రాకారములతో స్వర్గతుల్యమై యొప్పారు లంకాపట్టణమును హనుమంతుడు దహించెను. అందరికి సుఖమును చేకూర్చు మన్మథునికూడా అనవసరముగా శంకరుడు తన మూడవ నేత్రముతో భస్మము చేసెను. కానీ భూలోకమునందు మానవులందరికీ గొప్ప ఆపదను కలుగజేయు దారిద్ర్యమును ఇంతవరకెవ్వరూ దహించలేదు. అందుచేత యీ రెండు కొరువుల నుపయోగించి నన్ను వేధించుచున్న దరిద్రదేవతను దహించవలసింది మహారాజా!" అని దానికి అర్థం చెబుతూ రెండు కొరువులను కేశవభట్టు భోజరాజు పాదపద్మములముందుంచాడు.

భోజరాజు కవిచమత్కృతికి సమయస్ఫూర్తికి మెచ్చుకొని కేశవభట్టు పరిస్థితి నర్థంచేసుకుని భుక్తికి లోటురాకుండా జీవితము సాగిపోయేట్లు అతని పేర ఒక అగ్రహారము వ్రాసి యిచ్చాడు. చూచితిరా సమయస్ఫూర్తి! ★

బ్రహ్మ వ్రాత

పూర్వం ఒక ఊళ్లో ఒక పేద బ్రాహ్మణుడుండేవాడు. ఆ ఊరు ఒక అగ్రహారం. ఏ లోటూ లేకుండా అంతా జీవిస్తూ ఉండేవారు. కష్టపడి పండించి తినే వారు. ఇక వారికి వేరే పనిలేదు. ఈ పంతులుగారు తీరిక సమయాల్లో శాస్త్రాలు, పురాణాలు చదివి అందరితో కాలం వెళ్లబుచ్చుతూండేవాడు. అన్నింటితో పాటు జ్యోతిషశాస్త్రం కూడా బాగా చదివి పెద్దపేరు సంపాదించారు. ఆ రోజుల్లో పంతులుగారు చెప్పినజోస్యం అంటే ఇక తిరుగు లేదన్నమాట. పాపం ఆయన కోబుద్ధి పుట్టింది. తనసంగతి తానెందుకు తెలుసుకోకూడదా అని. తప్పక తెలుసుకుంటానన్నాడు. శాస్త్రాలన్నీ తెగ చూసి, అన్ని విధాలా లెక్కలుచూసి, చివరికి తనకి 72-వ యేట ఆ ఊరి ఉత్తర దిక్కునవున్న పెద్ద మర్రిచెట్టు యొక్క దక్షిణ కొమ్మక్రింద మృత్యువుందని నిర్ధారణ చేసుకున్నాడు. పాపం చావు అంటే భయం కదా! అతనికి ఓ దురాలోచన పుట్టింది. అదేమిటంటే న్యాయంగా బ్రహ్మవ్రాత తప్పదు. అయినా ప్రయత్నించి చూద్దామని ఇలా అనుకున్నాడు: "నాకు కాళ్లుంటే కదా ఆదిక్కుగా వెడతాను.

శ్రీరంగం సుందరమ్మ

కాళ్లు లేకుంటే ఆ దిక్కుకు వెళ్ళలేను. అందుచేత చావు అక్కడ రావటానికి వీల్లేదు" అని తలపోసి తనకున్న కాళ్లుకాస్తా తెగ కొట్టుకొని కూర్చున్నాడాయన.

రోజులు గిర్రున తిరుగుతున్నాయ్. మృత్యువు దగ్గిరపడుతున్నది. ప్రతిదినం ఉదయాన్నే లేవడం, సంధ్యవార్చి, వీధి అరుగు మీద కూర్చోడం అతని దినచర్య. కొంత కాలం గడిచేటప్పటికి మృత్యువు సంగతి మరిచాడు పాపం. మృత్యువురోజు వచ్చింది. కాని ఆయనకు గుర్తులేదు. మామూలు ప్రకారం అన్నిపను లయినతర్వాత వీధి అరుగుమీద కూర్చున్నాడు.

ఇంతలో ఎవరో ఒకాయన, ఒక గుఱ్ఱంమీద, వీధిలో కనబడ్డారు. పాపం ఆ బాటసారి గుర్రం సక్రమంగా ఎక్కలేక తికమకపడుతున్నాడు. పంతులుగారదంతా చూసి, ఎక్కేవిధం విపులంగా చెప్పారు. అయినా ఆయనకు చేతకాలేదు. పంతులుగారికి ఒళ్ళుమండింది. నీకు చేతకాకపోతే నన్ను తీసుకెళ్ళి ఆ గుర్రంమీద కూర్చోపెట్టు, చూపిస్తాను అన్నారు పంతులుగారు.

ఆ మాట అలాఅనడంతో, పాపం ఆ బాటసారి సంతోషించి పంతులుగారిని గుర్రం ఎక్కించాడు. పంతులుగారు సగర్వంగా కళ్లెం పట్టుకొని, ఓమాటు ధీమాగా అందరివేపు చూశారు. అకస్మాత్తుగా గుర్రం దౌడు తీసింది. పంతులుగారు గర్వంగా కళ్లెంపట్టి జనాన్ని చూస్తున్నారు. ఆ గుర్రం తిన్నగా ఆ ఊరి ఉత్తరదిక్కుగా వున్న మర్రిచెట్టు క్రిందుగా పోతూంది. అసలు

★ బ్రహ్మవ్రాత ★

చావుసంగతిమరిచిపోయిన పంతులు, గుర్రం ఆగకపోవడం చూసి, కళ్లెం వదిలి, మర్రిచెట్టుకొమ్మ పట్టుకొన్నారు. కాని ఆకొమ్మ ఉత్తర దిక్కున ఉన్నది. కాని పంతులుగారి జ్యోతిషం ప్రకారం, మరణం దక్షిణకొమ్మక్రింద అని ఉంది. పంతులు పట్టుకొన్న కొమ్మ ఉత్తరాన్న ఉండుటచేత, గాలి విసిరి గిర్రున దక్షిణానికి తిరిగింది పంతులుగారికి కళ్ళు తిరిగాయి. గాభరాపడి చేతులు వదిలారు. క్రిందపడి మరణించారు. ప్రాణం వదిలేముందు అంతా గుర్తుకొచ్చింది. బ్రహ్మ వ్రాసిన వ్రాత తప్పదనుకుంటూ మరణించాడు.

★

సినిమా



మధురంగా, మనోహరంగా. .



ఒక రకంగా ఉభయ తారకంగా

పొన్నలూరివారి "భాగ్యరేఖ"

"మతిభ్రమతో మంచం పట్టిన రవి మళ్లీ మామూలు మనిషి ఎలా అయ్యాడు?"

ఎలాగ అయినా మళ్లీ మామూలు మనిషి అవుతాడు అనడానికేం సందేహంలేదు

అసలు తెలుగు చిత్రాలలో నాయకుడు చిరంజీవి రవికి ఎప్పుడూ ధోకా ఉండదు

మతిపోవడం వంటివి జరిగినపుడు, ఊచిపుచ్చుకు చెంపకాయ కొడితే స్మృతి రావచ్చు అతిగాడు నిలుచున్న చోటుకు కొస్త అసింటా పిడుగుపడితే రావచ్చు, లేదా బుడగ పేలినా రావచ్చు ఇంకేదేనా కారణం కావచ్చు

పొన్నలూరి వారి "భాగ్యరేఖ" చిత్రంలో ఇక వ్యవధి లేక పోవడం ఒక కారణం అయింది మరో కారణం, ప్రియురాలు ధూకుడుగా వచ్చి పక్క గదిలో ఉన్న తిరుపతి వేంకటేశ్వరస్వామిని నిలవేసి, "ఏమయ్యా స్వామీ నువ్విపుడైనా (18 రీళ్లు అయ్యాక) ఆదుకునేటట్టా లేనట్టా?" అంటూ ఉరిమిచూసి దులిపెయ్యడం

మొత్తానికి రవి మేలుకున్నాడు. తరవాత కోలుకున్నాడట.

అసలు అతడు మరో మరో విధంగా ప్రవర్తించడానికి వీలులేదు ఎందుకంటే, అతగాడి ప్రియురాలు లక్ష్మి అరచేతిలో జారిపోకులాటి భాగ్యరేఖ ఉందట. దాని ప్రకారం ఆమె కోటికి పడ [illegible] ఏర్పాట్లు సక్రమంగా జరగడానికి మతిభ్రమించిన రవి బతికి బట్టకట్టక తప్పదు.

"భాగ్యరేఖ" చిత్రకథ అంతా ఈసూత్రం అనుగుణాడలలో నడిచింది

తల్లీ, తండ్రీ, ఐశ్వర్యం, ఆఖరికి నోట్లో నాలికో కూడా లేని అనాధ బాలిక లక్ష్మి, పినతల్లి ఇంట నానా అవస్థలూ పడుతూ పెరుగుతుంది.

అది తెలిసిన తరవాత ఆమె ముసలి తాత ముసలయ్య ఆమెను వెంట తీసుకుపోయి పెళ్లీడు వచ్చేదాకా పెంచి పెళ్లి చెయ్యకుండా పోరియుంటాడు

లక్ష్మి మళ్ళీ పినతల్లి ఇంటికి వచ్చి, కౌన్సాస్ సంచిలో వేసుకుని తిరుపతి వెళ్తుంది. అక్కడ జీవిత రేఖని చెరిపి వేయబోయిన వేళ, భాగ్యరేఖ కలగచేసుకుని అడ్డుపడుతుంది.

తరవాత లక్ష్మి, తను కోడలు కావలసిన కోటీశ్వరుడి ఇంట ఆశ్రయం సంపాదిస్తుంది. అయింటి బిడ్డడు రవి ఆమెను వరిస్తాడు. సిరికూడా వరించేలోగా, కథ అడ్డం తిరిగింది. జలతారు చీరగట్టి వారం పది రోజులు కారు షికారు కూడా చేసిన లక్ష్మి, మళ్ళీ ఒక రోజున తన పాత కౌన్సాస్ సంచీ (కంటిన్యుటీ అద్భుతంగా పాటించారిక్కడ) తీసుకుని మళ్లీ వెళ్ళిపోయింది ఎక్కడికో అలవాటు ప్రకారం.

ఇలా పరిపరి విధాల పరుగెత్తిన ఈకథా, కథానాయకీ, 18 రీళ్లు పైచిలుకు తిరుగంగా, గమ్యస్థానం చేరకోవడం జరుగుతుంది.

ఈలోగా, దర్శకుడు శ్రీ బి. ఎన్. రెడ్డి నవరసాలూ చిప్పిలేవిధంగా కథలో అనేక ఘట్టాలను ప్రవేశపెట్టారు పాటలు పది పన్నెండూ, తెలుగులోకి తర్జుమా చేసిన బొంబాయివాళ్ళ వీధి నృత్యాలు రెండు మూడూ కూడా చూపించారు.

అయితే ఈ నృత్యాలు బాక్సాఫీసు హంగులని మనం అనుకోనరాదు "ఇలాటివి నేటి చిత్రాలలో ఉంటున్నాయి సుమండీ" అని విమర్శను ధ్వనిస్తూ హేళనచేయించారు.

ఇది ఒకరకంగా ఉభయ తారకంగా ఉంది.

మొత్తంమీద చిత్రంలో ప్రత్యేకఘట్టాను చిత్రించడంలోనే రెడ్డిగారి ప్రతిభ, శిల్పనైపుణి ప్రస్ఫుటంగా గోచరిస్తాయి

ఆయా ఘట్టాలను రక్తికట్టించడంలో శ్రీ పాలగుమ్మి పద్మరాజు మాటలూ, ప్రతిభావంతులైన నటీనటుల కృషికూడా చాలా



కథానాయకి పరిపరివిధాలతిరుగంగా



జై రామ్ ప్రొడక్షన్స్ వారి "టవున్ బస్" తెలుగు చిత్రంలో అంజలీదేవి.

★ "భాగ్యరేఖ" చిత్రసమీక్ష ★

హోపాదం కౌశాయి సునిశితమైన విమర్శ అతిసున్నితమైన హాస్యం మేళవించి పద్మరాజుగారు వ్రాసిన సంభాషణలలో చక్కని చమత్కారధార ఆద్యంతం ప్రవర్తిల్లింది పాత్రౌచితి చెడకుండా ఆయన వీటిని ప్రశంసనీయంగా సాధించారు

కృష్ణశాస్త్రిగారి పాటలు ఈ చిత్రానికి విశిష్టతను, సమకూర్చాయి సంగీత దర్శకుడు శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు కూర్చిన వరసలు కొన్ని బొంబాయి బాణీలు, అనుకరణలూ అయినా, తెలుగు రాగాలలో కూర్చినవి ప్రతి పేయంగా ఉన్నాయి ఉన్నవాటిలో "కన్నీటి కడలిలోన - చుక్కానిలేని నావ", "నీ వుండేదా కొండపై, నాస్వామి నేనుండేదీ నేలపై, నీ లీల సేవింతునో" వంటి పాటలు రెండు మూడు అత్యుత్తమంగా ఉన్నాయి

మధురంగా, మనోహరంగా ఉన్న "నీ వుండేదా కొండపై" అనే గేయసాహిత్యం, దానిని రాణింపచేయగలిగిన స్థాయి సంగీతం, దేవుడిమీద పువ్వులు వేసినంత మెత్తగా, హాయిగా సుశీల వాటిని పాడినవిధం, ఆ గేయాన్ని చిత్రించిన ఘట్టాలకు, ఈచిత్రానికి కూడా విశిష్టతను ఘనతను చేకూర్చాయి

కథా, కథానాయకీ కూడా తరచుగా దారివిడిచి కొండలూ గుట్టలూ పర్యటించడం ద్వారా కలిగిన అవకాశాలను చాయాగ్రహణ దర్శకుడు శ్రీ బి ఎన్. కొండారెడ్డి అద్భుతంగా వినియోగించుకుని రమణీయమయిన దృశ్యాలను ఇందులో పొందుపరచారు.

జమున, రామారావు, జానకి, రేలంగి సి ఎస్.ఆర్. సూర్యకాంతం, డా॥ గోవిందరాజుల సుబ్బారావు, రమణారెడ్డి, పి హేమలత, కె. వి యస్. శర్మ, సి. నాగభూషణం, అల్లు రామలింగయ్య, డా॥ శివరామకృష్ణయ్య, సీతాబాయమ్మ, బలరాం, మాస్టర్ వర్మ, కుమారి శశికళ, భారతి, సీతారత్నం ఇందులో పాల్గొన్నారు

ఎటేనటులందరూ పాత్రోచితమయిన నటనను ప్రదర్శించారు లక్ష్మి భూమిక నిర్వహించిన జమున, ఇన్నాళ్ళూ ఈ తరహా పాత్రలే నటించినా, ఈ చిత్రంలో గత అనుభవాలను సద్వినియోగం చేసుకొని కొత్త స్థాయిని అందుకొంది నిండైన విగ్రహం, చక్కని నటన ఈ పాత్రకు నిండుతనం చేకూర్చాయి


మాస్టర్ పులిగా రేలంగి ఇందులో హుషారైన వేషం వేశాడు. ఈసారి సినిమా లోకంలో టోకరా శాస్త్రాన్ని, శాస్త్రజ్ఞలను, "ఎకి" వదలిపెట్టడానికి ఈ భూమికను చక్కగా వినియోగించారు ఈ వేషానికి గల బలం, రేలంగి నటనతో ఇనుమడించింది

పదహారణాల తెలుగుతనం ఉట్టిపడే సాంబయ్యగా రమణారెడ్డి అద్భుతమైన నటనాకౌశలం ప్రదర్శించాడు. ఎక్కడా ఎబ్బెట్టు అనిపించకుండా మితిమీరకుండా ఇతను నటించాడు. అరక్షణం వ్యవధి, అంగుళం చోటూ ఇస్తే, చక్కని హాస్యాన్ని చవి చూపించగల బాలకృష్ణ ఈ చిత్రంలో "అతిథి"గా ఒకే ఒక్క నిముషం కనిపించినా చక్కని హాస్య నటన ప్రదర్శించాడు. ★

గాయని సుశీల వివాహం

ప్రసిద్ధ ప్లేబాక్ గాయని కుమారి సుశీలకు ఈ నెల 4 వ తేదీన వివాహం జరిగింది. వరుడు శ్రీ రాజారామ మోహనరావు

మైలాపూరు వినాయక నగర్ లో జరిగిన ఈ వివాహానికి తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖ దర్శక నిర్మాతలూ, నటీనటులూ, సంగీత దర్శకులు గాయకులు వచ్చి వధూవరులను ఆశీర్వదించారు ★



★ సినిమా వార్తలు ★

కల్యాణీ ప్రొడక్షన్స్ వారి తొలిచిత్రానికి గతవారం వాహినీ స్టుడియోలో ప్రారంభోత్సవం జరిగింది

శ్రీ తిలక్ ("ముద్దుబిడ్డ") దర్శకత్వాన వీరు నిర్మించనున్న ఈ చిత్రంలో ఎస్. వి. రంగారావు, కన్నాంబ, జగ్గయ్య, రేలంగి, బల్లం నరసింహారావు, రమణారెడ్డి మొదలగువారు పాల్గొంటున్నారు.

తాపీ ధర్మారావు కథ, మాటలు, పాటలూ వ్రాస్తున్నారు సంగీత దర్శకుడు చలపతిరావు ఛాయాగ్రహణం లక్ష్మణ్ గోరే

పూజకు శ్రీయుతులు నాగిరెడ్డి, చక్రపాణి, సి. పుల్లయ్య, సి శ్రీనివాసరావు, కె బి. నాగభూషణం, తాపీచాణక్య, తాతినేని ప్రకాశరావు, కె. భాస్కరరావు శ్రీమతులు ఎస్. వరలక్ష్మి, లక్ష్మిరాజ్యం, ఋష్యేంద్రమణి ప్రభృతులు వచ్చారు నిర్మాతలకు (కె వెంకటేశ్వరరావు, టి. వి. సుబ్బారావు, కె రామకృష్ణప్రసాద్) శుభాకాంక్షలు తెలిపారు

ఆంధ్రఫిలిం వాణిజ్యమండలి అధ్యక్షుడు శ్రీ సుందర్‌లాల్ నహతా కామెరాస్విచ్ ఆన్ చేశారు శ్రీ తాపీధర్మారావు క్లాప్ కొట్టారు తొలిషాట్‌లో దేవతల పటాలను చిత్రించారు.

పూజతరువాత, తులసిపూజ పాటను రికార్డుచేశారు. ఇదే ఈ చిత్రంలో మొదటి పాట. గాయని సుశీల ఆ పాటను పాడింది

దాంపత్యం

రాజశ్రీ ఫిలింస్ పేరిట శ్రీమతి కృష్ణవేణి నిర్మిస్తున్న సాంఘిక చిత్రం "దాంపత్యం" దాదాపు పూర్తిఅయినట్లే, రీరికార్డింగు మాత్రమే తరువాయి

ఇల్లు స్వర్గసీమఅయినా, నరకలోకం అయినా అది ఇల్లాలి ప్రతిభేనన్న నిజాన్ని నిరూపించే ఇతివృత్తంతో వీరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో జి వరలక్ష్మి, విజయకుమార్, రేలంగి, గుమ్మడి వెంకటేశ్వరరావు, డా॥ గోవిందరాజు సుబ్బారావు, పెరుమాళ్లు, డా॥ శివరామకృష్ణయ్య, విద్య, జి ఎస్ స్వామి, బేబీ శశికళ మొదలగువారు పాల్గొంటున్నారు.

రచన శ్రీ అనిసెట్టి సుబ్బారావు, దర్శకుడు శ్రీ ఎర్రా అప్పారావు

ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ శ్రీ రమేష్, ("హామ్లెట్," "స్వయంప్రభ") వాయించిన సంగీతం అని రషెస్ చూచినవారు మెచ్చుకుంటున్నారు. ఈయన సంగీత దర్శకత్వం స్వీకరించిన తొలి తెలుగు చిత్రం ఇదే అయినా, తరువాతి చిత్రం "స్వయంప్రభ" ఇతఃపూర్వం విడుదలఅయిన విషయం విదితం

(54-వ పేజీ చూడండి)



"వెండితెరకన్న నిండు సభే మెరుగు"

కవలలందరిలాగా కన్నూ ముక్కూ, తీరూతెన్నూ, కట్టూ బొట్టూకూడా డిటో డిటోగా ఉండే ఈజిప్షియన్ నర్తకీ సోదరీమణులు లిన్, లిస్‌లు ఈమధ్య మనదేశంలో పర్యటించారు

ఇరవై ఏళ్ళ ఈడుగల ఈజోడా ఇప్పటికనేక దేశాలు పర్యటించి నృత్య ప్రదర్శనలనిచ్చి ప్రశంస లందుకున్నారు.

ఏ దేశం వెళ్ళితే ఆదేశీయుల వేషభాషల తీరుతెన్నులు తెలుసుకోవడం, భాష నేర్చుకోవడం, వ్యవధి ఉంటే నృత్యాలు కూడా నేర్చుకోవడం వీరికి చాలాఇష్టం ఇప్పటికి ఇంగ్లీషు, ఫ్రెంచి జర్మన్, ఇటాలియన్, అరబిక్ భాషలుబాగా నేర్చుకున్నారు మొన్న బొంబాయి వచ్చాక హిందీ కొంత నేర్చుకున్నారు. ఈ సందర్భంలోనే ఎస్ డి నరాంగ్ కొత్త చిత్రం "యెహూదీ-కీ-లడ్కీ"లో ఒక నృత్యంకూడా చేశారు. కలకత్తా వెళ్ళినపుడు అక్కడొక బెంగాలీ చిత్రంలో పాల్గొన్నారు

"చలన చిత్రాలలో నృత్యప్రదర్శనాలివ్వడం చాలా సరదాగానూ ఉంటుంది. బోలెడు డబ్బూ వస్తుంది అయితే నిండు సభలో ప్రేక్షకుల ఎదట రంగస్థలిమీద నిలచినప్పటి ఉత్సాహం, ఆనందం వెండితెర కెమెరాముందు ఉన్నపుడు కలగవు అని లిన్, లిస్‌లు అంటారు ★


లక్స్ టాయ్‌లెట్
సబ్బును వాడి చూడమని
లలిత మీకు సలహా చెప్పుచున్నది
"శుద్ధమైనది, తెల్లనిది—
ఈ సబ్బు ద్విగుణమైనది!"
...లలిత, తన చర్మ సౌందర్యమును చెక్కు చెదరకుండా కాపాడుకొనుటకు ఎల్లప్పుడూ లక్స్ టాయ్‌లెట్ సబ్బునే వాడుచుండును. దాని సమృద్ధియైన నురగ తన చర్మమును పరిశుభ్రంగాను, నునుపుగాను వుంచుచున్నదని ఆమె గ్రహించింది—మరియు మనోహరమైన దాని పరిమళమును ఆమె చాల మెచ్చుకొనును!
సినీమా తారలవలె చేయుడు—దీని మెత్తని నురగతో మీ చర్మ సౌందర్యమును కాపాడుకొనుడు. దాని అద్భుతమైన, తెలుపు లక్స్ టాయ్‌లెట్ సబ్బుయొక్క శుద్ధతకు నిదర్శనము.
లక్స్ టాయ్‌లెట్ సబ్బు
LUX
TOILET SOAP
సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు
LTS. 494-X52 TL



సారథీ ఫిలింస్ వారి కొత్త చిత్రం "పెద్దరికాలు" లో గిరిజ, రేలంగి

హిచ్ కాక్ తమాషాలు

★ అప్పుడేమైంది? ★

పన్నెండంతస్తుల మేడలలో ఒకలిఫ్ట్ మెల్లగా పైనుంచి కిందకి దిగుతోంది అందులో నలుగురున్నారు వారిలో ఇద్ధ రొకజట్టు.

ఒకాయిన గబుక్కున మాట్లాడ్డం మొదలు పెట్టాడు మిత్రుడితో

"సరే ఆ అమ్మాయి అలా మొత్తం నాలుగు సార్లు పెళ్లిచేసుకుంది నలుగురికీ నలుగురు పిల్లల్నికన్నది మొన్న నాలుగోభర్తకికూడా విడాకులిచ్చాక, ఒకరోజున పిల్లలు నలుగురితో ఎక్కడికో వెళ్లేసరికి ఒక్కసారిగా నలుగురుమాజీభర్తలూ కలుసుకున్నారు. ఆ పళంగా వాళ్లేమన్నారు తెలుసా "

అంతలోకి లిఫ్ట్ఆగింది కథచెబుతున్న ఆసామీ, అతగాడి జతగాడు బయటకి వెళ్లి పోయారు గునగునలాడుతూ

పరిచయం లేకపోయినా, అంతవరకు ఆకథనివింటున్న మిగతా ఇద్దరికీ పూర్తిగా మతిపోయింది

"ఆ నలుగురుభర్తలూ ఏమనిఉంటారు?" అన్న ప్రశ్న ఆరోజంతా వారిని వేధించింది.

అలావాళ్లని అవస్థపెట్టేఘట్టంలో కథ ఆపి వెళిపోయినవ్యక్తి, కావాలనే ఆపని చేశాడు పక్కనున్నవాళ్లు వింటారని, తరవాత తహతహలాడిపోతారనీ తెలుసు అతనికలా చెయ్యడం సరదా, వృత్తికూడా అదే

ఆయన ఉత్కంఠను అద్భుతంగా పోషించడంలో సిద్ధహస్తు డనిపించుకున్న దర్శకుడు అల్ ఫ్రెడ్ హిచ్ కాక్

చలనచిత్రాలలో ఇలాంటి పని చేస్తే కళ అంటారు. నిత్యజీవితంలో చాన్నే అల్లరి అనీ పెంకితనం అనీ అభివర్ణిస్తారు. ఎలా అన్నా ఆయన కిది సరదా

ఒకసారిలాగే లిఫ్ట్‌లో మిత్రుడితో వస్తూ ఇంతకన్న దారుణమైన కథ మొదలుపెట్టాడు. ఆ లిఫ్ట్‌లో ఇద్దరు వృద్ధ మహిళలున్నారు

"ఏం చెయ్యను చెప్పు, ఆవేశంలో ఒళ్లుతెలిసిందికాదు గబగబ నాలుగుసార్లు పేల్చాను కాలిమీదే అనుకో గది అంతా రక్తపు మడుగు అయిపోయింది ప్రాణాలు పోయివుండవులే ఎట్నుంచొచ్చినా, నువ్వే కాస్త ఆదుకోవాలి లిఫ్ట్ ఆగగానే నేను పెరటవేపు నించి వస్తాను నువ్వు ఇవెళ్లి టాక్సీ తీసుకురా " అన్నారు హిచ్ కాక్.

లిఫ్ట్ ఆగీ ఆగడంతో, అందులో వనితలిద్దరూ ఒక్క అంగలో బయటపడి, రెండో అంగలో వీధినపడి పరుగెత్తారు అంతే తప్ప, ఖూనీచేసి వచ్చిన ఒక మనిషి పారిపోతున్నాడని ఆ భవంతిలోవాళ్ళకి తెలిసేలా ఒక్క గావుకేక పెట్టాలన్న సంగతికూడా వాళ్ళకి తట్టలేదు! ★

రచయితలకు మనవి

త్వరలో పాఠకులకు పరిచయం కానున్న "అంతర్వాణి" తెలుగు మాస పత్రికకు మీ రచనలను ఈ క్రిందిఅడ్రసుకు పంపగలరు.

EDITOR ANTHARYANI
18 Hyderbasti Secunderabad

సినిమా వార్తలు

(51-వ పేజీ తరువాయి)

తమే. భాస్కర్ ప్రొడక్షన్స్‌వారి నాలుగో చిత్రానికి కూడా ఈయనే సంగీతదర్శకుడు.

పెద్దరికాలు

సారథీవారి క్రొత్తసాంఘిక చిత్రం "పెద్దరికాలు" తుదిమెరుగులు దిద్దుకుంటోంది. శ్రీ తాపీ చాణక్య దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో జగ్గయ్య, అంజలీదేవి, డా॥ గోవిందరాజుసుబ్బారావు, పెరుమాళ్ళు మొదలగువారు పాల్గొన్నారు. సంగీత దర్శకుడు శ్రీ వేణు.

"సువర్ణ సుందరి"

విడుదలకు సిద్ధంగాఉన్న మరొక చిత్రం అంజలీ పిక్చర్స్‌వారి "సువర్ణ సుందరి"

భారీసెట్స్‌తో తయారైన ఈ జానపద చిత్రంలో అంజలి, నాగేశ్వరరావు, రేలంగి, సి. ఎస్. ఆర్., గుమ్మడి వెంకటేశ్వరరావు, బాలకృష్ణ, రాజసులోచన, గిరిజ, సూర్యకళ ప్రభృతులు పాల్గొన్నారు. మాటలూ పాటలూ శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి వ్రాశారు. శ్రీ వేదాంతం రాఘవయ్య దర్శకత్వం నిర్వహించారు. ★

మద్రాసుఫిలిండైరీ 1957

దక్షిణభారత చలనచిత్ర పరిశ్రమ గురించిన సమగ్ర సమాచారంతో ఏటేటా వెలువడే 'మద్రాసు ఫిలిండైరీ' ఈ ఏడాది (1957) తాజా విశేషాలతోపాటు, టాకీ రజతోత్సవ చిత్రాలతో ఆకర్షణీయంగా రూపొందింది. ప్రచురణకర్త శ్రీ వీరంకి రామారావు ఈ సారి నయాపైసా పరివర్తన పట్టీని, వినోదంపన్ను ప్రస్తుతపు రేట్లను మార్చి నయాపైసాలలో లెక్క కట్టడానికి వేరే ఒక పట్టికనుకూడా పొందుపరచారు. పరిశ్రమలోని నటీనటుల, టెక్నీషియన్ల, దర్శకనిర్మాతల చిరునామాలు ఇంతవరకు విడుదలఅయిన చిత్రాలజాబితా, వివరాలు, 1956 లో బాక్సాఫీస్ హిట్‌లు అయిన చిత్రాలవసూళ్ళు, అఖిలభారత చలనచిత్ర పరిమాణాన్ని సూచించే వివరాలూ మొదలగు వాటితోపాటు, గత డిశంబరులో కేంద్రమంత్రి డా॥ కేస్కర్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన సినిమాటోగ్రాఫ్‌బిల్లు (1956) ప్రతిని సంగ్రహంగాను పొందుపరచారు, చలనచిత్ర పరిశ్రమలోవారేకాక, దీనిపట్ల ఆసక్తిగలవారుకూడా చూడతగ్గ పుస్తకం వెల 2-8-0. ప్రతులకు శ్రీ వీరంకి రామారావు, 19 ఉడ్స్ రోడ్, మద్రాసు-2 అని వ్రాయాలి. ★

★ తెలి తెరలు ★

(15-వ పేజీ తరువాయి)

నిరంజన్‌కు కిశోర్‌కు మధ్యకు వచ్చి నిలబడుతుంది. నిరంజన్‌వైపు కోపంతో చూస్తూ) ఏమిటిది?

(హాలులో దీపాలన్నీ ఒక్కసారి వెలుగుతాయి. ఎడమవైపునుంచి దినకర్, ఆనంద్, వృద్ధుడు తొందరగా ప్రవేశిస్తారు.)

దినకర్: సరిగా నాయిక ప్రవేశించవలసిన సమయం యిదే! (చేతిలోని పుస్తకం తెరిచి చూస్తాడు.)

చిత్ర: (కోపంతో) ఏమిటిదంతా? ఎందుకు కొట్టుకుంటున్నారు? (అందరి ముఖాలకేసి చూస్తూ) ఏం? ఒక్కరూ మాట్లాడరేం?

కిశోర్: (స్తిమితంగా) ఏమీ లేదు. నాటకం రిహార్సల్సు వేసుకుంటున్నాం.

చిత్ర: (కోపంతో) నో! నో! మీరు నాటకాల్లో వేషాలు వెయ్యడం నాకు ఇష్టం లేదు. యికముందు అటువంటి పనిచేస్తే నేను వూరుకోనేదిలేదు.

(రివ్వున తిరిగి మేడమెట్ల దగ్గరకు వెడుతుంది.)

కిశోర్: (ఆమె వెనుక నడుస్తూ వినయంగా) యీ ఒకసారి ఎక్స్యూజ్ చెయ్యండి. యీ ఒక నాటకంలోను వేషం వెయ్యనివ్వండి. ఆ తరవాత మీరు వెయ్యమన్నా వెయ్యను.

చిత్ర: (మెల్లెక్కుతూ) నాటకాలలో వేషాలు వేసేవాళ్ళు నిజ జీవితంలో కూడా వేషాలు వెయ్యకుండా వుంటారా? వీల్లేదు. నేను ఒప్పుకోను.

(ముందు చిత్ర వెనుక కిశోర్ మేడమీదికి వెళ్ళిపోతారు.)

వృద్ధుడు: (కిశోర్ పోతున్న వైపు చూస్తూ) వెర్రినాయనా! నీకింకా బుద్ధి రాలేదురా. ఆడపిల్లల జోలికి పోవద్దని ఎంత చెప్పినా వినవుకదా!

(గెడ్డం మీసాలు తీసివేస్తాడు. యీసారి నిజరూపంలో జయరాం కనిపిస్తాడు.)

నిరంజన్: (అసంతృప్తితో) మీరు నాటకంలో హాస్యాన్ని, శృంగారాన్ని చిత్రించలేక పోయారు కవిగారూ!

దినకర్: రౌద్రం, భీభత్సం, కరుణ యీ మూడు రసాలు లేకుండా నేను నాటకం రాయను.

ఆనంద్: రెండవ అంకంలో కొంత శృంగారాన్ని చిత్రించండి దినకర్.

దిన: ప్రయత్నిస్తాను. ప్రయత్నిస్తాను. మెరుపుతీగలవంటి సుందరాంగులను సృష్టిస్తాను. వాస్తవిక జగత్తులో తీరని కోరికలను కావ్యజగత్తులో తీరినట్లు చిత్రిస్తాను. నా పాఠకులను, ప్రేక్షకులను ఆనందడోలికలలో వూగిస్తాను.

జయ: అయ్యా! మీ కావ్య మీమాంస కట్టిపెట్టి కాఫీ తెప్పించండి. యిప్పటికే అలిసిపోయాం.

ఆనంద్: అప్పుడే అలిసిపోతే ఎలా? మరో రంగం రిహార్సల్సు చేసుకోవాలి.

జయ. నాయకుడు పరారీ అయ్యాడు. యిక రిహార్సల్సు కేపటికి వాయిదా వెయ్యండి. నేను నా కోటా కడిగేసుకొని వస్తాను. కాఫీ మాత్రం మరచిపోకండి నిరంజన్‌గారు!

(జయరాం ఎడమవైపు నిష్క్రమిస్తాడు.)

ఆనంద్: (జయరాం పోతున్నవైపు చూస్తూ) మహానుభావుడు. యితగాడు ఏదేశంనుంచి వచ్చాడో! ఎప్పుడూ తిండి గురించే మాట్లాడతాడు.

దిన: తిండి! అది అత్యంతముఖ్యం! చరాచర జీవకోటికి ఆహారాన్ని సృష్టించిన భగవానుడు, కొందరు మానవులకు మాత్రం తిండి అందకుండా చేశాడు. భగవంతుని పేర జరుగుతున్న యీ అన్యాయాన్ని మానవుడు సరిదిద్దాలి.

(సరిగా యీ సమయంలో బిగ్గరగా "ఘోరం! ఘోరం!" అనుకుంటూ దండపాణి ఎడమవైపు నుంచి ప్రవేశిస్తాడు. ముఖానికి నల్లటిరంగు, తలకు తెల్లటి తలపాగ, చేతిలో ఒక ఇనుపగుదియ వుంటాయి.)

(ఇంకావుంది)

★ పెళ్లిచూపులు ★

(27-వ పేజీ తరువాయి)

వెం : (విచారంగా) ఇంకేమవుద్ది దొరాల అంతా ముంచుకొచ్చింది! రెండు బస్సు నిండా పోలీసు నాయళ్ళొచ్చి మనయిల్లు సుట్టేసినారు బాబూ! అందరిని బయటకు రమ్మంటుండారు.

(కృష్ణ పారిపోవాలని ఎటు వెళ్ళినా లాఠీలు కనబడతాయ్ - రామారావు ప్రశాంతంగా నవ్వుతూ ముందుకు వస్తాడు)

రామా : అమ్మయ్య! నా మనశ్శాంతికి శుభముహూర్తం సమీపించింది! జైలుకు పోయి హాయిగా, నిశ్చింతగా నిద్రపోతాను. ఏలోకంలోవున్నా నాకోసం పరితపించే నా అర్ధాంగికి శాంతిని సమకూరుస్తాను. (రాంబాబును ఆపాదమస్తకం చూచి) నాన్నా! అజ్ఞానంలో ఒళ్ళుతెలియక ఏమేమో అన్నాను. నాకిప్పుడు బుద్ధివచ్చింది. నన్ను మన్నించి ఆశీర్వదించు నాన్నా! (నమస్కరిస్తాడు.)

(రాంబాబు దుఃఖాన్ని ఆపుకోలేక ఏడుస్తాడు.)

రామా : కమలచావుకు కన్నీరు కార్చని నీ హృదయం నేను జైలుకు వెళుతుంటె బాధపడుతున్నదా నాన్నా? అవును. కమల కొడుకు నేను, నాకొడుకు నువ్వు-యిదే మన అనుబంధం! (లోపలికిచూస్తూ) అమ్మా! మీరూ యేడుస్తున్నారా అమ్మా! ఇది నిజంగా ఆనందించవలసిన సమయం! పాపానికితగిన ప్రాయశ్చిత్తాన్ని అనుభవించపోతున్నాను. నేను నిజమైన మానవుడ్ని కావాలని ఆశీర్వదించమ్మా! (నమస్కరించి, వెళ్ళుతూవుండాగా)

రాం: (ఏడుస్తూ) నాయనా! రాముడూ! ఒక్క క్షణం ఆగు!

(రామారావు తిరిగి చూస్తాడు)

రాం: రా! దగ్గరకు రా! నేను పిశాచాన్ని కాదురా నాయనా! నీతండ్రినిరా! రా! రా!

(రామారావు దగ్గరకు రాంతోటె హృదయాలింగం చేసుకుంటూ, తల నిమురుతూ వుంటాడు.)

రామా : ఊరుకో నాన్నా! ఎందుకు యింకా బాధపడటం?

రాం: (కొడుకు ముఖాన్ని తన చేతులతో పట్టుకొని చూసి, ప్రశాంతంగా నవ్వుతూ) రాముడూ!

రామా : ఏం నాన్నా?

రాం : నాచేతిని పట్టుకో!

రామా : (పట్టుకొని) ఎందుకు నాన్నా?

రాం : ఇకపద! నేనూవస్తారా నీతో!

రామా : (ఆనందంగా) నాన్నా!

రాం : అవునోయ్! నా కళ్ళకు కూడా చూపొచ్చిందిప్పుడు - పద! వెలుగులోకి పోదాంపద!

రామా : నాన్నా! (ఆనందంతో పుప్పొంగి, తండ్రికాళ్ళకు నమస్కరించి) రా నాన్నా వెళుదాం!—

(ఇద్దరూ బయటకు వెళ్తారు)

వెం : (కన్నీరు తుడుచుకొని, కృష్ణతో) ఇంకా కదలవేం పోలీసోళ్ళు కాసుకుంటె?

(కృష్ణ, దాసు వెళతారు)

వెం: సమురుకొళ్ళబాబు! పెళ్ళిసూపులు కొచ్చాడు-కొంప కూల్చాడు!

(లోపల పెద్దధ్వని వినబడుతుంది)

వెం + సిద్ధాంతి: (లోపలిశబ్దం విని కంగారుగా) అమ్మగారూ! అమ్మగారూ!

(లోపలికి పరుగెత్తుతారు)

గడియారం అరగంట కొడుతుంది - తెర పడుతుంది!

[హక్కులన్నీ రచయితవే. ప్రదర్శనానికి వారి అనుమతి పొందాలి.]

★

కలిసి వచ్చిన అదృష్టం

(34-వ పేజీ తరువాయి

చివరికి అఘాయిత్యం చేసింది రత్తయ్యగారి జేష్ఠ పుత్రుడని తెలిసి, వంబాచార్లుగారు రత్తయ్య దగ్గరకు వెళ్లి జరిగింది మొరబెట్టుకున్నాడు.

“జౌనయ్యా, మీ అల్లుడు ఆ కుమ్మరమ్మాయిని ఏదో అన్నాట్ట—ముందు అతనికి బుద్ధిచెప్పు” అని గుడ్లురిమాడు రత్తయ్య.

వేదాంతాచార్లు ఇంతపని చేస్తాడని— అతనిభార్య తప్ప యింకెవ్వరూ నమ్మలేదు.

కుంకుళ్ళు—పచ్చిగా ఉండగానే ఎవరికందినవి వాళ్లు దులుపుకపోయారు పొలం చెరిసగం పాలుకిస్తే - వ్యవసాయపు ఖర్చులు కూడా మిగల్లేదు. పంట బాగానే పండింది. కాని వంబాచార్లుచేతికి ఏమీ అందటం లేదు. స్వంత వ్యవసాయం చేద్దామని అప్పు చేసి ఎడ్లజతను ఒకదాన్ని కొన్నాడు మున్నబు దగ్గర. ఆ మర్నాడే ఒక ఎద్దు పారిపోయింది. మరొకటి తెగులొచ్చి చచ్చిపోయింది. దమ్మిడీ చేతి కందటంలేదు. చేతిలో డబ్బంతా అయిపోయింది.

“బాపనోళ్ల వ్యవసాయం అని ఊరికనే అన్నారు” అంటూ విరగబడి నవ్వాడు రత్తయ్య-“అప్పుడే ఏముంది - ముందున్నది మునసబ్ కంటుగ” అన్నాడు పరంధామయ్య. ఆ దోవన వెళ్తున్న వంబాచార్లు ఈ మాటలు వినబట్టే వెళ్లిపోయాడు.

మున్నబు ఆచార్లుకి ఓ సలహా యిచ్చాడు. పొలం అమ్ముకుని వచ్చినంత రాబట్టుకుంటం మంచిదని-వంబాచార్లు కొంచెం మొగ్గినా కాంతమ్మ ససేమిరా ఒప్పుకోలేదు.

ఒక రోజున పొలంనుంచి యింటి కొచ్చేసరికి, చిన్నకూతురు నాంచారమ్మ వెక్కి వెక్కి ఏడుస్తూంది. కాంతమ్మ జేవురించిన మొహంతో పిల్లాడికి పాలిస్తూ నులకమంచం పై కూలబడి ఉంది. ఎంతవస్తే అంతే - పొలం అమ్మేయండి-మన మీ ఊరునుంచి విరగడై పోదాం” అంది కాంతమ్మ.

నాంచారమ్మ నూతి దగ్గర నీళ్లుతోడుతుంటే-పచ్చిగా మాట్లాడుతూ, చెయ్యి పుచ్చుకు లాగాడుట రత్తయ్య కొడుకు. వంబాచార్లు రత్తయ్య దగ్గర కెళ్లి మళ్లీ మొరపెట్టుకున్నాడు.

రత్తయ్య కొడుకును మందలించటంపోయి మీ అమ్మాయే వచ్చి మా వాణ్ణి వేధించుకుతిందట - వయసొచ్చిన పిల్లలకు పెళ్ళి పెటాకులూ లేకపోతే ఏంచేస్తారు బాపడా” అంటూ వెకిలినవ్వు నవ్వాడు రత్తయ్య.

పొలం అమ్మి ఎలాగైనా సొమ్ముచేసిపెట్టమని మున్నబు కాళ్లా వేళ్లా పడ్డాడు ఆచార్లు. మొత్తం పొలమంతా మూడు వేల కిమ్మన్నాడు మున్నబు. ఆచార్లు ఇదేం న్యాయం మున్నబుగారూ అంటూ గొల్లుమన్నాడు.

మరో అయిదు వందలు - దమ్మిడీ ఎక్కువివ్వను అన్నాడు మున్నబు.

మున్నబును కాదని నిభాయించటం - ఆ వూళ్లో మానవమాత్రులకు సాధ్యంకాదు. ఎవరూ ఆ మున్నబుకు ఎదురునిల్చి - ఆ పొలం కొంటానికి పోటీకి రారు. చివరకి కాళ్ళావేళ్లాపడితే మరో అయిదు వందలిస్తానన్నాడు మున్నబు. అంతే గాకుండా మరొక్క సాయం కూడా చేస్తానన్నాడు. ఆ ఊళ్లో పెట్టబోయే స్కూల్లో, అల్లుడు వేదాంతాచారికి మేష్టరీ వేయిస్తానన్నాడు.

చివరకు నాలుగు వేలకూ, భూమి దఖలు చేసి, మాష్టరీ ఉద్యోగంలో చేరిన అల్లుణ్ణీ, అతని సంసారాన్ని ఆకోతులగోకారంలోనే వదిలి, సకుటుంబంగా చింతపిక్కల అగ్రహారం తిరిగి చేరుకున్నాడు వంబాచార్లు. వెంటనే తాకట్టు విడిపించుకుని యింట్లో జేరి, దేవాలయంలో అదృష్టవశాత్తు మళ్లీ ఖాళీ అయిన ఎప్పటి ఉద్యోగంలోనే జేరాడు.

మాటలుపోయి చాలాకాలమైనా, అనంతరాయమ్మ సుబ్బరాయమ్మతో కలిసి, కాంతమ్మగారిని పలకరించ వొచ్చింది. కాంతమ్మకు శాశ్వతంగాపోయిన అదృష్టానికి—అనంతరాయమ్మ కళ్లు చెమ్మగిల్లిన మాట యదార్థం— ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.

